

ఆణిముత్యాలు 1997
మరియు
సహజ సమాధి
కస్తూరి బెహెన్


ఆణిముత్యాలు 1997
మరియు
సహజ సమాధి
కస్తూరి బెహన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - 9440652774

కె. సుదర్శన్ - 9247805058

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు - 1997

# మరియు

# సహజ సమాధి

కస్తూరీ బెహెన్

సోదరి కస్తూరీ అప్పుడప్పుడు అభ్యాసీలతో చెప్పిన విషయాలు, అభ్యాసీల ప్రశ్నలకు ఇచ్చిన జవాబులు, బాబూజీ ఆయా సందర్భాలలో ఇచ్చిన వివరణలూ ఈ చిన్న పొత్తంలో వివరించడం జరిగింది.

ఇందులోని తప్పులు
మీకు అందించినవి – మావి
ఒప్పులన్నీ బాబూజీ
కృపా ధారలు

**21–12–1997** **– మీ సోదర అభ్యాసీలు**

**గమనిక:** సిస్టర్ కస్తూరీగారు 10.03.2007వ తేదీన హైదరాబాద్‌లో ఇచ్చిన సందేశం; త్రివేంద్రమ్, హైదరాబాద్, లక్నో మొదలైన ప్రదేశాలను పర్యటించినప్పుడు అభ్యాసీలు అడిగిన పలుప్రశ్నలకు జవాబులు, వివరణలతోపాటుగా, అభ్యాసీల ప్రశ్నలకు బాబూజీ స్వయంగా ఇచ్చిన సమాధానాలు ఈ పుస్తకంలో పొందుపరచబడ్డాయి.

# ఆణిముత్యాలు - 1997

**ప్రశ్న: పునర్జన్మ రాహిత్యానికి, ముక్తికిగల భేదం ఏమిటి?**

**జవాబు:** మనస్సు దివ్యం మీదనే లగ్నం కావాలి. సహజమార్గం మీద, ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) ఇచ్చే బాబూజీ మీద విశ్వాసం ఉండాలి. మన దృష్టి పూర్తిగా అంతర్ముఖమై దివ్యం మీద లగ్నమైనప్పుడు మనం శారీరక (భౌతిక) స్పృహను కోల్పోతాము. ఇటువంటి స్థితికి చేరుకుని, ఆ స్థితిలో లయమైనప్పుడు పునర్జన్మ నుంచి విముక్తి ప్రసాదించటమే బాబూజీ యొక్క అనుగ్రహం. ధ్యానం హృదయం మీద నిలిపి, సాధన చేస్తూ ఉంటే స్థూలశరీరం అనగా భౌతిక శరీరం యొక్క ధ్యాస కనుమరుగైపోతూ బాబూజీతో మనకు అనుబంధం ఏర్పడుతుంది. ఇంకా సాధన చేసినకొద్దీ ఆత్మ సూక్ష్మ శరీరం, కారణ శరీరం కూడా దాటేవరకు 'నేను' అనే భావం కొంత ఉంటుంది. అందుచేత ఈ స్థితిలో విముక్తి (లిబరేషన్) పొందినట్లు కాదు. ఆత్మ శారీరక బంధనాన్ని ఛేదించుకొని వెనుదిరిగి చూడకుండా ఎప్పుడైతే పరమాత్మ శక్తిలో లీనమైపోతుందో అప్పుడు విముక్తి కలుగుతుంది. ఈ స్థితికి చేరిన ఆత్మ 'విముక్తాత్మ' (లిబరేటెడ్ సోల్) అవుతుంది. అప్పుడు మన ఆత్మకు అస్థిత్వం కూడా తెలియదు. అనగా బాబూజీతో నేరుగా సంబంధం ఏర్పడి అభ్యాసీ యొక్క అన్ని స్థితులను బాబూజీ తమ ఆధీనంలో ఉంచుకుంటారు. అభ్యాసీకి తన పురోగతిలో వచ్చే మార్పులు పైనుంచి వస్తున్నట్లుగా అనుభవమవుతుంది.

"ఈశ్వరుని చేరటమే మానవుని పరమ లక్ష్యం. అందుకు ప్రయత్నించటమే ఆధ్యాత్మికతకు (స్పిరిట్యుయాలిటీకి) ప్రారంభ దశ. ఈ సాధనలో తనను తాను మర్చిపోవటం మొదటి మెట్టు. ఇలా మరచిపోగలగటం అనే దశయే ఆధ్యాత్మికత ప్రారంభమైనదని అనటానికి నిదర్శనం. మతం అనే దానికి ముగింపు ఎక్కడో అక్కడ ఆధ్యాత్మికత ఆరంభమవుతుంది. ఎప్పుడు ఆత్మ తన బంధనాలను విడనాడి పరమాత్మ శక్తిలో లీనమవుతుందో, అప్పుడు ఆధ్యాత్మికత అంతమై రియాలిటీ ప్రారంభమవుతుంది. ఆత్మ పరమాత్మలో లయంకాకముందు అందరిలోనూ భగవంతుడు పరివ్యాప్తమై ఉన్నట్లు, ఆత్మలన్నీ భగవంతునిలో లీన మవుతున్నట్లు అనుభవమవుతుంది. ఈ స్థితిలో రియాలిటీ అంతమైపోయి, ఆత్మల సమ్మేళనం కూడా మరచిపోయి, పరమాత్మ ఒక్కటే, –తానే పరమాత్మ–అను అనుభూతి కలిగి, మహోజ్వలానందం కలుగుతుంది" అని బాబూజీ అనేవారు.

బాబూజీతో అభ్యాసీ ఒకరు తాను 'రామ', 'రామ' అని జపిస్తూ ఉంటానని చెప్పినప్పుడు – 'వారు' అతడు జపించే 'రామ' శబ్దం యొక్క అర్థం ఏమిటి అని ప్రశ్నించి "అలా పేరుతో పిలుస్తూ ఉంటే, దగ్గరలో ఉన్నట్లయితే వస్తాడు. కాని దూరంగా ఉంటేనో?" అని, దాని అర్థం వివరిస్తూ "రామ అంటే రామ అవుతుంది. కాని అదే 'మ'తో ప్రారంభమైతే, 'రా'తో కలసి 'మరా' అవుతుంది. అంటే 'చచ్చాను' అన్నట్లు అవుతుంది" అన్నారు బాబూజీ నవ్వుతూ.

సర్వదా ధ్యానమే మనల్ని గమ్యానికి చేర్చుతుంది. రైలు ప్రయాణంలో మనం మేల్కొని ఉన్నా, నిద్రలో ఉన్నా గమ్యానికి చేరినట్లే. అదే విధంగా సహజమార్గంలో ప్రయాణం (సాధన) మనల్ని, మన గమ్యమైన అనంతానికి చేర్చుతుంది. మనం ఏ దారిన వచ్చామో ఆ దారినే వెతుక్కుంటూ వెళ్ళితే, మళ్ళీ

మన స్వస్థానానికి వెళ్ళతాము –ఇదే సహజమార్గం. దీని మహత్తును వర్ణించటం అసాధ్యం, అనిర్వచనీయం. బాబూజీ అనంతం నుండి అవతరించారు. కనుక మనల్ని భగవత్ సాక్షాత్కార స్థితి నుంచి కూడా పైకి తీసుకొని వెళ్ళతారు.

భవబంధం ఉండి పరమాత్మలో పూర్తిగా లయమైపోనంతవరకు వేర్వేరు ఆత్మలు – పరమాత్మ, అనే వైవిధ్యం ఉంటుంది. పూర్తిగా లయమైపోయిన తర్వాత ఈ భేదభావంపోయి అంతా ఒక్కటే అనే అనుభూతి కలుగుతుంది.

"దైవ దర్శనం పొందుతున్నట్లు ఎలా గుర్తించటం" అని నన్ను ఒకరు ప్రశ్నించగా నేను (కస్తూరీ) సమాధానం ఇలా చెప్పాను:

మనం ధ్యానంలో కూర్చున్నప్పుడు మన దృష్టి హృదయం మీద కేంద్రీకరిస్తాము. తర్వాత హృదయం పూర్తిగా తెరవబడినట్లు అవుతుంది. ధ్యానం అప్పుడు ఆంతరంగికంగానూ, బాహ్యంగానూ కూడా ఒక్కటిగానే ఉండి, సర్వత్రా వ్యాపించినట్లు అవుతుంది. ఆత్మ దానంతట అదే పురోగతి చెందుతూ ఉంటుంది.

**ప్రశ్న: సహజమార్గ పద్ధతికి, ఇతర సాధనా పద్ధతులకు గల తేడా ఏమిటి?**

**జవాబు:** సహజమార్గంలో బాబూజీ అభ్యాసీకి ట్రాన్స్‌మిషన్ ఇస్తారు. సాధనలో మార్గదర్శకత్వం వహించి అభ్యాసీ ఎదిగిన స్థాయి నుండి దిగజారిపోకుండా కాపాడుతారు. భక్తితో, దీక్షతో సాధన చేసినవారి అందరినీ బాబూజీ పైకి తీసికొని వెళ్ళతారు.

ఇతర సాధనా పద్ధతుల్లో అభ్యాసీ ప్రాణాహుతి ప్రసారం (ట్రాన్స్‌మిషన్) పొందే అవకాశం లేదు. తన కండీషన్ (స్థితి) తెలియదు. అతని స్థితి, పురోగతి తెలియచెప్పేవారు ఉండరు. సహాయం చేసేవారూ ఉండరు. కొందరు స్వయం సాధనతో పురోగతి సాధించినా దిగజారి పోవచ్చు.

**ప్రశ్న: సహజమార్గ సాధకులకు, ఇతర సాధకులకు భగవత్ సాక్షాత్కారం పొందగోరువారికి బాబూజీ చేసే సహాయంలో భేదం ఉంటుందా?**

**జవాబు:** చాలా భేదం ఉంది. ఇతర సాధనా విధానాల్లో కబీరు, మీరాబాయి వంటి సాధకులు తమకు తామే అంచెలంచెలుగా ఎదిగారు. ఆ సాధకులు, వారికి వారే మార్గాన్ని వెదుక్కోవాలి. మార్గంలో అవరోధాలు వారే తొలగించుకోవాలి. ఇతరుల సహాయం ఉండదు. దివ్యశక్తిని ప్రసాదించే వారు ఉండరు. అయినా బాబూజీ వారికి కూడా సహాయం చేస్తారు. కాని వారిలో భగవత్ సాక్షాత్కారం కోసం తపన, ఆర్తి ఉండాలి. సహాయం కొరకు విన్నపం చేసుకోవాలి. దీక్షతో సాధన చేయాలి. సాధకుడు కోరిన కోరిక మేరకు అనుగ్రహించితే అతనికి ఆనందం కలుగుతుంది.

ముక్తి సాధనలో ముందుకు సాగిపోవాలంటే సహజమార్గం అందుకు సాటిలేనిది. ఈ మార్గంలో బాబూజీ ముందుగానే ముళ్ళను ఏరివేసి బాటను మృదువుగా చేశారు. సహజమార్గం మనం ఎంపిక చేసుకున్న మనోహరమైన పుష్పం వంటిది. పూవు నుంచి సువాసన ఎలా వెదజల్లబడుతుందో సహజమార్గం నుంచి దివ్యశక్తి అలా ప్రవహిస్తూ ఉంటుంది. భగవంతుని దివ్య సన్నిధిని చేరాలనే తపన, సాధన మినహా వేరే విధానం అంటూ లేదు.

'సహజమార్గం'లో ముళ్ళు తొలగించబడిన మనోహరమైన గులాబీ పుష్పాలు మాత్రమే ఉన్నాయి. అభ్యాసీ దీనిని స్వీకరించటంలో ఏ ఇబ్బంది కలుగదు. ఈ విధానంలో అన్నీ మంచి వాటితోనే నిండి ఉంది. బాబూజీ ఆశీస్సులతో మీరు అంతిమానికి చేరవచ్చు. అభ్యాసీకి సాధనా మార్గంలో ఎదురయ్యే ఆటంకాలన్నీ తొలగించబడతాయి. ఇతర సాధనా పద్ధతుల్లో కూడా మంచి ఉండవచ్చు. కాని ఆ పద్ధతులు సులభతరంగా, సమస్యా రాహిత్యంగా తీర్చబడి ఉండవు. సహజమార్గం యొక్క సాటిలేని సౌందర్యం ఇదే!

నేను దివ్యప్రేమ పిచ్చిదానను. ఎప్పుడూ 'వారి'తో మాట్లాడాలని, 'వారి'నే చూడాలని అనిపిస్తూ ఉంటుంది. అందుకే నాకు ఎక్కడ చూసినా బాబూజీయే కనిపిస్తారు. అలా ఉంటేనే మనకు 'వారి'తో దివ్య సంబంధం ఏర్పడుతుంది.

**ప్రశ్న: అభ్యాసీ భయ సందేహాల నుండి నివృత్తి పొందాలని ఆశించటం ఎలా?**

**జవాబు:** భయ సందేహాలు ఎలా ఉన్నాయో, సహజమార్గంలో భయ రాహిత్యం, సందేహ రాహిత్యం రెండూ ఉన్నాయి.

ఆధ్యాత్మికత (స్పిరిట్యుయాలిటి)లో ప్రవేశించగానే సందేహం ప్రారంభమవుతుంది, మనం గమ్యం చేరగలమా లేదా అని. దానిలో మనం పొందే అనుభవాలు ఒక్కొక్కసారి ఒక్కో విధంగా ఉంటాయి. ఈ అనుభవాలలో ఉన్న హెచ్చు తగ్గులు, మార్పులు సందేహానికి గురిచేస్తూ ఉంటాయి. కొన్ని దశలలో ధ్యానం ప్రారంభిస్తూనే సందేహం వస్తుంది. కొంచెంసేపు నిశ్చలంగా కూర్చుంటే వాటిని మర్చిపోతాము.

బాబూజీ చెప్పేవారు –సందేహం చాలా విషపూరితమైనది అని. సహజమార్గం సందేహాలకు ఆస్కారంలేని సిస్టమ్. కాని సందేహాలు కొన్ని స్టేజస్‌లో ఉంటాయి. మనస్ఫూర్తిగా ధ్యానంచేస్తే ఇవి తొలగిపోతాయి. సందేహం ఊహాజనితం. ఈ ప్రపంచంలోని విషయాలలో నిమగ్నమై, సందేహాల్లో నివసించి, మీరు స్వయంగా అనుమాన మనస్కులైపోయారు. మనలో 'నేను' ఉన్నంతవరకు సందేహం ఉంటుంది. 'నేను' (అస్థిత్వం)లో 'సందేహం' సంసిద్ధంగా (ఎలర్ట్) ఉంటుంది. 'నేను' (అస్థిత్వం) మర్చిపోతే సందేహం తొలగిపోతుంది. బాబూజీతో అనుబంధం పెంచుకుంటే 'నేను' క్రమేణా తొలగిపోయి సందేహాలు సమసిపోతాయి.

**భయం రెండు రకాలు.**

**మొదటిది:** భౌతిక జీవితానికి సంబంధించినది. దీనిని ప్రార్థన ద్వారా తొలగించుకోవచ్చు.

**రెండవది:** ఆధ్యాత్మికత గురించి. అనగా మనం గమ్యాన్ని చేరగలమా లేదా అని.

అభ్యాసీ కృతనిశ్చయంతో మిషన్‌లో చేరి, బాబూజీ చెప్పిన విధంగా సాధన చేస్తే, పురోగతితో గమ్యం చేరతాడు. బాబూజీతో సాన్నిహిత్యం పెంచుకున్నకొద్దీ సందేహం కూడా క్రమంగా కనుమరుగై పోతుంది. బాబూజీ ఒకసారి "సందేహానికి కూడా తాను ఉన్నానా లేదా అని సందేహం కలుగుతుంది" అని చమత్కారంగా అన్నారు.

**ప్రశ్న: అభ్యాసీ వివిధ దశలగుండా ప్రయాణించేటపుడు సాధనలో కలిగిన అనుభవాలు ప్రతిదశలోను (పునరావృతం) మళ్ళీ అనుభవం అవుతాయా?**

**జవాబు:** సాధనలోని అనుభవాలు మళ్ళీ వస్తాయి. కాని ఒకే సాంద్రతతో ఉండవు. ఒక్కొక్కసారి స్వల్పంగాను,

మరొకసారి అధికంగాను ఉంటాయి. ఒక సంవత్సరం మెడిటేషన్‌లో అనుభవమైన లైట్‌నెస్ (తేలికదనం) మరో సంవత్సరంలో కలిగిన అనుభవం కంటే హెచ్చుగానో, తక్కువగానో ఉండవచ్చు. అనుభూతి ఒక్కటే అయినా అంశ (డిగ్రీ)లో తేడా ఉంటుంది. ధ్యానం చేస్తున్నప్పుడు మనకు కలిగిన అనుభూతులు ఆనందాన్ని కలిగిస్తాయి. అలాగే మళ్ళీ ధ్యానంలో కూడా ఆనందం కలుగుతుంది. కాని వీటిలో భేదం ఉంటుంది. ఒకసారి మనం ప్రోగ్రెస్‌తో ఉన్నత దశలకు పోతూ ఉంటే అదనంగా వచ్చే ట్రాన్స్‌మిషన్, అనుభూతుల వలన కలిగే ఆనందం ఒక్కటైపోతే, మరోసారి, మనకు ఆలోచనలు వచ్చి ఆటంకపరచలేవు –అనే సంతృప్తి వలన కలిగే ఆనందం ఒకటి. కాని భావనలో తారతమ్యం ఉంది. ప్రతిదశలోనూ మనం అంతర్ముఖులమై చూసుకుంటే, మనం కోరుకున్న ఆనందం అక్కడే ఉంటుంది. ఒక్కొక్కసారి శరీరం తేలికగా అనిపించవచ్చు. మరొకసారి గాలిలో తేలిపోతున్నట్లు అనిపించవచ్చు. రెండింటిలోను భావన ఒక్కటే. కాని (డిగ్రీ) అంశలో తేడా ఉంది. ఫోర్స్‌లో కూడా తేడా ఉంది.

ప్రోగ్రెస్ అంటే మీరు బాబూజీతో మరింత సన్నిహిత సంబంధం పొందుతున్నట్లు. అది ఇంకా దృఢమైనకొద్దీ 'నేను' అంటే అహం కరిగి ఆనందానుభూతి దానంతట అదే పెరుగుతుంది.

బాబూజీతో ఒక అభ్యాసీ తనకు లైట్‌నెస్ రావటం లేదని అన్నాడు. బాబూజీ మంచిదే అన్నారు. మరికొందరు తమకు లైట్‌నెస్ బాగా వస్తుందని అన్నారు. అదీ మంచిదే అన్నారు. ఇవి విన్న మరొక అభ్యాసీ బాబూజీతో –అదీ ఇదీ, రెండూ ఎలా మంచివి అవుతాయి అని అడిగాడు. అప్పుడు బాబూజీ ఇలా చెప్పారు: ఒక గాడిద ఉంది. దాని వీపు మీద ఎంత బరువు వేసినా మోసుకొని పోతుంది. కాని బరువు దించేటపుడు దాని వీపు మీద బరువు తగ్గించినకొద్దీ చికాకుతో చిందులు తొక్కుతుంది. అంటే ఈ గాడిదకు బరువే ఇష్టం అన్నమాట.

'తేలిక' అనే భావం నెమరువేసుకుంటే అదే ధ్యాస ఉంటుంది. కాని తపనతో సాక్షాత్కారం కొరకు ధ్యానం చేస్తే అదే దొరుకుతుంది.

**ప్రశ్న: సత్సంగ్‌లో నిద్రపోతున్నట్లు ఎందుకు ఉంటుంది?**

**జవాబు:** ఈ నిద్ర రెండు రకాలుగా ఉంటుంది. మొదటి దానిలో అభ్యాసీ ధ్యానంలో ఉండగా దివ్యశక్తిని గ్రహిస్తూ, కొన్ని అనుభూతులు పొందుతూ ఉంటాడు. ధ్యానంలో మునిగిపోయి తనను తాను మరచిపోయినందువలన భౌతిక స్పృహ ఉండదు. తాను ఎక్కడ ఉన్నదీ కూడా తెలియని పరిస్థితిలో ఉంటాడు. రెండవ రకమైన నిద్రలో అభ్యాసీ శారీరక నిద్రను అనుభవిస్తాడు. దివ్యానుభవాలు అతని అవగాహనకు రావు. ఈ స్థితి మంచిది కాదు. అభ్యాసీకి కొంత కాలానికి ఇది మత్తుగా అయి అలవాటుగా మారిపోతుంది. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి కొంత క్లీనింగ్ అవసరం. అంతేకాకుండా అభ్యాసీ ధ్యానం ప్రారంభించటానికిముందు తాను మెడిటేషన్ చేయబోతున్నట్లుగా భావన చేసుకోవాలి. మధ్య మధ్యలో స్పృహ వచ్చినప్పుడు తాను మెడిటేషన్‌లో కూర్చున్నట్లుగా గుర్తు చేసుకొని మళ్ళీ ధ్యానం చేయటానికి ఉపక్రమించాలి.

కొంతమంది అభ్యాసీలు ధ్యానంలో గురక పెడ్తారు. అది మంచిది కాదు. అటువంటి సందర్భాలలో ప్రక్కనున్న వారు అతడ్ని తట్టి ఆ స్థితి నుంచి మేల్కొల్పాలి.

**ప్రశ్న: అభ్యాసీ ధ్యానంలో ఉండగా కాంతి ఫోకస్ అవుతున్నట్లుగా అనుభవమైతే ఏమి చేయాలి?**

**జవాబు:** త్రికుటి మధ్యభాగంలో దృష్టి నిలిపి ధ్యానం చేయటం వలన ఇలాంటి అనుభవం కలుగుతుంది. అలా అభ్యాసం చేయమని బోధించే వారికి కూడా దాని ఫలితం తెలియకపోవటమేకాక దాని వలన కలిగే ముప్పును తొలగించటం కూడా తెలియదు. సహజమార్గ విధానంలో కూడా త్రికుటిలో ఉన్న ఆ కేంద్రం తెరవబడే అవకాశం ఉన్నప్పటికీ బాబూజీ మహరాజ్ దాని ప్రమాదం నుంచి అభ్యాసీని కాపాడుతారు. దీని నివారణకు క్లీనింగ్ అవసరం. అలాంటి పరిస్థితి కలిగినప్పుడు ఆ కేంద్రంలో బాబూజీ ఉన్నారని భావించుకుంటే ప్రమాదం తొలగిపోతుంది.

సంత్ కబీరు తన స్వానుభవాన్ని ఒక గీతంలో ఇలా వివరించాడు: స్వానుభవం లేకుండా ఒకరు వ్రాసిన దానిని చదివి, మరొకరు వ్రాసిన పుస్తకాలు చదవటం వలన సాధకుల మనస్సుల్లో సందేహాలు రేకెత్తుతాయి. కాని తాను (కబీరు) మాత్రం భగవత్ సాక్షాత్కారం కోసం చేసే సాధనలో పొందిన స్వానుభవాలను మాత్రమే వల్లిస్తున్నాను అని అన్నాడు. మానవుడు ప్రాపంచిక విషయ సంకీర్ణమైన భవసాగరాన్ని దాటటమే ముక్తికి మార్గమన్నాడు. పల్లెవాడు పడవ మీద నదిని దాటించినట్లే సద్గురువు సాధకునికి సుగమమైన మార్గం బోధించి భవసాగరాన్ని దాటించి గమ్యానికి చేర్చుతాడు. 'నేను' అనగా అహం మరచి ధ్యానం ద్వారా సాధన చేస్తే దివ్యశక్తి నుంచి నిర్మల ధార సమకూరుతుంది.

**ప్రశ్న: దివ్యత్వానికి, అంతిమానికి గల వ్యత్యాసం ఏమిటి?**

**జవాబు:** దివ్యత్వంలో మన ఆత్మ వ్యక్తిత్వం అప్పుడప్పుడు స్ఫురిస్తూ ఉంటుంది. అంతిమంలో అది ఉండదు. (ఆత్మగత విచారం ఉండదు.) అంతా ఒక్కటే అవుతుంది.

**ప్రశ్న: హృదయానికి, మనస్సుకు గల తేడా ఏమిటి?**

**జవాబు:** మనస్సు ఆలోచిస్తుంది. హృదయం గ్రహిస్తుంది.

**ప్రశ్న: నిద్రకు, యోగ నిద్రకు గల భేదం ఏమిటి?**

**జవాబు:** బాబూజీ ఇలా వ్రాశారు: యోగనిద్రలో మనకు స్పృహ ఉండదు. యోగనిద్ర నుంచి మేల్కొన్నప్పుడు తాను ఎక్కడ నుంచో ఊడిపడినట్లుగా అనుభవమవుతుంది. ఒక విధమైన శారీరక కంపనం ఉంటుంది. అంటే సుషుప్తావస్థలో అంతిమాన్ని దర్శించే దశలో విస్మృతి (ఎరుకలేకపోవటం) జరుగుతుంది.

నిద్రలో మేను (శరీరం) మరచినా, ఆధ్యాత్మిక అనుభూతి ఉండదు. శారీరకంగా విశ్రాంతి లభించినట్లు మాత్రమే అనుభవం అవుతుంది.

**ప్రశ్న: సహజమార్గ విధానంలో మనస్సు యొక్క పాత్ర ఏమిటి?**

**జవాబు:** నిరంతర దైవ స్మరణతో మనస్సులో మెదిలిన ఆలోచనలను హృదయం అనుభవించి పదిలపర్చుకుంటుంది. క్రొత్త అనుభూతులు వచ్చినా స్వీకరిస్తుంది. కాని పాతవాటిని విస్మరించదు. ఈ స్మృతి, నిక్షిప్తతలవల్లనే మనం గతవిషయాలను నెమరు వేసుకుంటాం. ఉదాహరణకు ఒక విషయమై ఉదయం ఇలా జరిగింది, సాయంత్రం ఇలా జరిగింది, అని నెమరు వేసుకొనేటపుడు మరో విషయం అడ్డురాదు.

మనస్సు విషయంలో – దానిలో ఒక ఆలోచన జరుగుతున్నపుడు మరో ఆలోచన రాగానే పాతదానిని వదిలివేయటం జరుగుతుంది.

"లక్నో నుండి తిరిగి వెళ్ళిన తరువాత మీకు కలిగిన అనుభూతి ఏమిటి?" అని నేను (కస్తూరీ) ప్రశ్నిస్తే మీరు ఏం సమాధానం చెప్తారు.

మీరు ఏమి చెప్పలేకపోతున్నారు కదా! నేను చెబుతాను.

ఒకసారి బాబూజీ నన్ను ఏమి పొందావు నీవు, అని అడిగినపుడు నేను ఏమి పొందలేదు కాని, నన్ను 'నేను' పోగొట్టుకున్నాను, అని చెప్పాను. 'నేను' అంటే 'అహం'ను బాబూజీ పవిత్ర పాదాలవద్దనే ఉంచాలి. 'వారి' పాదాక్రాంతులం కావాలి. దైవానుగ్రహం కోసం తపన ఉండాలి. నిరంతర స్మరణ, సాధన చేయాలి. మన ఆత్మను పరిశుద్ధంగా ఉంచటానికి, మన ఇంటి పనుల్లో, మాటల్లో, ప్రవర్తనలో, ఇతరులతో వ్యవహరించటంలో మృదుత్వం, పవిత్రభావాలు అలవరచు కోవాలి. ఇతరుల గుణదోషాలు వల్లించటం, ఇతరులను నిరసించటం, హేళన చేయటం సబబు కాదు. ఆధ్యాత్మిక ప్రగతికి సత్ప్రవర్తన చాలా అవసరం. బాబూజీ ఎవరినీ కోపగించేవారు కాదు. పిల్లలను బుజ్జగించి వారికి కావలసినవి సమకూర్చేవారే కాని కోపగించేవారు కాదు. వారిది చాలా సున్నితమైన హృదయం. 'వారి'కి ఎప్పుడు ఏది అవసరమో తెలుసు. స్వల్పవిషయాల్లో కూడా 'వారి'కి దృష్టి ఉండేది. అభ్యాసీలతో కాలం గడుపుతున్న సందర్భంలో కూడా వంట ఇంటిలో భోజన సదుపాయాలకు కావలసిన పిండి వగైరాలు సమకూరాయా లేదా అని గమనిస్తూనే ఉండేవారు. వారికే మనం అంకితమైతే అన్ని సమకూరుతాయి. మనం మన ప్రవర్తనను సత్ప్రవర్తనగా మార్చుకోవాలి. మాస్టర్ చెప్పిన దశ నియమాలు అనుసరించాలి. నిరంతర దైవ స్మరణ, సదాచారంతో వ్యవహరిస్తూ సాధన చేస్తే దశ నియామాలు (టెన్ కమాండ్‌మెంట్స్) వాటంతటవే మనల్ని అనుసరిస్తాయి. దైవ స్మరణకు ఉదయాస్తమయాలు, దివారాత్రులు అనే సమయ నియమం లేదు.

దైవ సాక్షాత్కారం పొందాలనే తపనతో సాధన చేస్తే శరీరం, మనస్సు నియంత్రించబడతాయి. తపనతో వ్యధ చెందినప్పుడు బాబూజీ మనకు సన్నిహితులవుతారు, మనలో ప్రవేశిస్తారు. ఉదాహరణగా చెప్పాలంటే, మీరు ప్రతిరోజు భోజనం చేస్తూ ఉంటారు. కాని ఒకరోజు ఉపవాసం చేయాలని అనుకుంటారు. ఆహారం శరీరానికి మాత్రమే అవుసరం కనుక, మనస్సు దానిని నిరోధిస్తూ ఉంటుంది. అలా ఉపవాసం ఉండాలని నిర్ణయించుకున్నప్పుడు మీరు ఆహారం గురించి ఆలోచించరు. అలాగే మనల్ని మనం మరచిపోయి మాస్టర్‌లో లీనమైపోవాలి – అలా అనుకోవటం కూడా అలాంటిదే (దృఢ నిర్ణయం).

సహజమార్గంలో ధ్యానం దైవం మీదనే చేయాలి. బాబూజీ తన రూపం మీద ధ్యానం చేయవద్దని చెప్పారు. దివ్యజ్యోతి మీదనే చేయమన్నారు. భౌతికం అంటే స్థూలరూపం మీద ధ్యానం చేయవద్దని చెప్పారు. ఇందులో ఒక కీలకం ఉంది. బాబూజీతో మనం అనుసంధానమైనప్పుడు 'వారు' మనకు ఏమి ఇస్తున్నదీ (ఆ కిటుకు) తెలియదు. దైవం ఒక్కటే. మనం దానితోనే అనుసంధానం కావాలని చెప్పారు.

మన మిషన్‌కు సంస్థాపక అధ్యక్షులు బాబూజీ మహరాజ్. ఉదాహరణకు రామకృష్ణ మిషన్, బౌద్ధమతం తీసుకుందాము. వాటి మూలపురుషులు రామకృష్ణ పరమహంస, బుద్ధుడు. ఇప్పటికీ వాటిని రామకృష్ణ పరమహంస, బుద్ధుడు –వీరి పేరిటే వ్యవహరిస్తున్నాము. కాని వారి శిష్యులు వివేకానంద తదితరుల పేర్లతో కాదు కదా!

బాబూజీ మనల్ని ఉద్ధరించి ముక్తి ప్రసాదించటానికి భూమా (అంతిమం) నుండి అవతరించిన దివ్య పురుషులు. దివ్యశక్తి తమ ఆధీనంలో కలిగినవారు బాబూజీ. జన్మ జన్మల పరంపరలో శరీరం మారుతుంది. కాని ఆత్మ ఒక్కటే. మన భౌతిక శరీరంలో దుస్తులు మార్చినట్లే ఆత్మ శరీరధారణ మారుస్తుంది. ఎప్పటికైనా మనకు మాస్టర్ ఒక్కరే!

**ప్రశ్న: భూమా నుండి అవతిరించిన బాబూజీ పతంజలి అయ్యే అవకాశం ఉందా? బాబూజీ తమ ఆత్మకథలో పతంజలి గురించి వ్రాసిన విషయాన్ని దయచేసి వివరించండి.**

**జవాబు:** లాలాజీ సాహెబ్ యొక్క దివ్య సంకల్పంతో బాబూజీ భూమా నుండి అవతరించిన దివ్యపురుషుడు. కనుక 'వారు' మరొకరు అయి ఉండే ప్రశ్నేలేదు. బాబూజీ పతంజలి ఉనికిని గూర్చి లాలాజీని అడిగినపుడు "అందరూ నీలోనే ఉన్నారు. కనుక నీలోనే వెదకు. నీవు ఎవరో నీకు తెలియదు. నీకు నకలుని తయారు చేయలేము" అని అన్నారు. అంటే బాబూజీ మానవాతీతుడు. అనంత శక్తి స్వరూపులు.

బాబూజీ పుస్తకాలు స్వయంగా వారి చేతితో వ్రాయలేదు. వారు చెబుతూ ఉంటే అనుయాయులు వ్రాస్తూ ఉండేవారు. అలా వ్రాసేటపుడు మధ్యలో ఎవరైనా అన్యవిషయాలు ప్రస్తావించి ఆటంకపరచేవారు. అపుడు వారు చెప్పే సమాధానాలు బాబూజీ చెప్తూన్న ఆత్మకథకు సంబంధించినవే అనుకుని లేఖకులు అదే వరసలో వ్రాయటం వలన ఇలాంటి తప్పులు జరిగాయి. వీటిని బాబూజీ దృష్టికి తీసుకొని వెళ్ళాను. అందుచేత ఎవరైనా ఏదైనా వ్రాసేటప్పుడు సావధానంగా (ఎలర్ట్‌గా) ఉంటే ఇటువంటి తప్పులు జరగకుండా ఉంటాయి.

**ప్రశ్న: ధ్యానంలో శ్వాసక్రియ నిలిచిపోయిందనే భావం ఏమి సూచిస్తుంది?**

**జవాబు:** సరైన పద్ధతిలో సాధన చేస్తూ ఎవరైతే ధ్యానంలో నిమగ్నమై తనను తాను మరచి అంతర్లీనమవుతారో వారికి శ్వాసక్రియ అనుభవం కాదు. ఆ సమయంలో నేను ఉబ్బసం మూలంగా శ్వాసక్రియతో బాధపడుతున్నప్పటికీ మెడిటేషన్‌లో నాకు అది గ్రహింపుకు రాదు. ధ్యానంలో నిమగ్నత, సాంద్రత అందుకు కారణం. అలా కాకుండా మన దృష్టి శ్వాసక్రియ మీదకు మరలినపుడు మనకు దాని ఉనికి తెలుస్తుంది.

**ప్రశ్న: యోగి తన పరిమిత జీవితకాలం కంటే ఎక్కువ కాలం జీవిస్తాడు? అలా ఎందుకు జరుగుతుంది?**

**జవాబు:** యోగికి తన ధ్యాన సమయంలో సహజసిద్ధంగా జరిగే శ్వాస ప్రక్రియలోని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు (పూరక రేచకాలు) కొన్ని ఆగిపోతాయి. అతడు అలా వినియోగించకుండా మిగిలిపోయిన శ్వాస ఘడియలు రిజర్వులో ఉండిపోతాయి. ప్రతిజీవికి జనన మరణాలకు మధ్య కొన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఒక సంఖ్యకు పరిమితమై ఉంటాయి. ఆ సంఖ్య పూర్తి కాగానే జీవితకాలం ముగిసి మరణం జరుగుతుంది. అందుచేత యోగి జీవితంలో రిజర్వులో ఉన్న ఉచ్ఛ్వాస నిశ్వాసాల వినియోగ ఫలితంగా అతని జీవితకాలం పొడిగించబడుతుంది.

బాబూజీ ఒకసారి తాను లాలాజీ సాహెబ్ శ్వాసతో జీవిస్తున్నానని చెప్పారు. బాబూజీ భౌతికంగా జీవిస్తున్నా 'వారి'కి ఆ ధ్యాస లేదు. ఎందుకంటే 'వారు' లాలాజీలో లయమైపోయారు కనుక. ఆ విధంగా లయావస్థలో ఉన్నప్పుడు శ్వాస జరుగుతున్నదా లేదా అన్న అవగాహన రాదు. అదే జీవన్ముక్తి. శరీరం నామమాత్రమే. అభ్యాసీ అంతిమంలో లయమైనప్పుడు భౌతికంగా భూమి మీద జీవిస్తున్నా, దాని యొక్క

స్పృహ ఉండదు. ఈ స్థితిలోనే బాబూజీ మహరాజ్ (లివింగ్ డెడ్) జీవిస్తూ మరణించటం అన్నారు. అతనికి తన జీవనస్మృతి ఉండదు. శరీరం యాంత్రికంగా పని చేస్తుంది.

**ప్రశ్న: ధ్యానంలో ఉండగా బాహ్యంలోని శబ్దాలను గుర్తించటం, మళ్ళీ ధ్యానంలో నిమగ్నం కావటం ఎలా సంభవం?**

**జవాబు:** ధ్యానంలో బాగా లోతుగా అంతర్ముఖమై ఉంటే బాహ్యంలోని శబ్దాలు మనకు వినిపించవు. ధ్యానంలో ఉండగా వచ్చే ఆలోచనలను మనం నిర్లక్ష్యం చేస్తే అవి ఎలా తొలగిపోతాయో అదే విధంగా మన దృష్టి బాగా ఆంతరికమై ఉన్నప్పుడు బాహ్యధ్వనులు అలా మనకు వినిపించవు, కలవరపరచవు. కనీసం స్వంత శరీరంలోని ధ్వనులు కూడా వినిపించవు. ధ్యానం మీద మన దృష్టి కేంద్రీకరణ కానప్పుడు అవి వినిపిస్తాయి.

ఒక అభ్యాసీ బాబూజీకి ఇలా ఫిర్యాదు చేశాడు: "మీరు సిట్టింగ్ ఇస్తున్నప్పుడు నేను కూడా సిట్టింగ్‌లో కూర్చున్నాను. మీ వెనుక ఇద్దరు వ్యక్తులు–నేను చెడ్డవాడినని, అర్హత లేకుండా సిట్టింగ్‌లో పాల్గొంటున్నాడు ఎందుకని చర్చించుకుంటున్నట్లు వినిపించింది నాకు" అని.

బాబూజీ అప్పుడు అతడ్ని ఇలా ప్రశ్నించారు: "మెడిటేషన్‌లో ఉండగా నీకు ఆ సంభాషణ ఎలా వినిపించింది? నీ దృష్టి హృదయం మీద అంతర్ముఖమై ఉండాలి కాని, వారి మీద ఎందుకు ఉంది?" అని.

ధ్యాన సమయంలో ప్రారంభ దశలో దృష్టి నిలిపేటప్పుడు కొంత భిన్నత్వం (ఎవేర్నెస్) ఉండవచ్చునుగాని క్రమంగా ధ్యానంలో (ఆసక్తి) తీవ్రతరమైనకొద్దీ ఆ (డైవర్షన్) ప్రక్కదారి పట్టడం ఆగిపోతుంది.

**ప్రశ్న: కరగిపోవటానికి, లయమైపోవటానికి మధ్య సంబంధం ఏమైనా ఉన్నదా?**

**జవాబు:** కరగిపోవటమంటే ధ్యానంలో మునిగిపోవటానికి చేసే ప్రయత్నం. లయంకావటం అంటే అందులో పూర్తిగా మునిగిపోవటం లేదా కలిసిపోవటం. ఒక పదార్థం నీటిలో పడినప్పుడు కరిగే ప్రారంభదశను, పూర్తిగా కరిగిపోయిన దశను ఉదాహరణగా చెప్పవచ్చు.

**ప్రశ్న: తేలికదనం, వ్యాకోచం (వ్యాప్తి చెందటం) అంటే ఏమిటి? ఆ రెండింటికి సంబంధం ఉందా? అభ్యాసీ వాటిని ఎలా గుర్తించగలడు?**

**జవాబు:** తేలికదనం (బరువులేమి) అనుభవమైనంతవరకు వ్యాపించటం ఉండదు. ప్రతి ఆధ్యాత్మిక దశలోను ముందుగా తేలికతనం వచ్చి తరువాత వ్యాపించినట్లు అవుతుంది. కాని రెండూ సమాంతరంగా ఒకేసారి అవగతం కావు. ఒక స్థితి యొక్క అనుభూతిలో తేలికైనట్లు ఉంటుంది. ఆ స్థితి దాటి పురోగమించినపుడు ఆ తేలికదనం తెలియదు. వ్యాపించటమన్నది హృదయంలో కొంత భాగానికి మాత్రమే పరిమితం. హృదయస్థానం దాటిన తరువాత పురోగమనంలో, హృదయంలో మిగిలిన భాగమంతా వ్యాపిస్తుంది. అంతకుమించి వ్యాప్తిచెందే అవకాశం లేదు.

దీనిని గ్రహించటం ఎలా? అని అడిగితే ఇందులో కిటుకు (టెక్నిక్) ఏమీ లేదు. నీవు ధ్యానంలో మరీ మరీ లోతుగా వెళ్ళినకొద్దీ దాని అనుభవమవుతుంది.

**ప్రశ్న: నిర్మాణం అంటే ఏమిటి? నశింపు అంటే ఏమిటి?**

**జవాబు:** మన సహజమార్గ పద్ధతికి ఈ ప్రశ్న సహేతుకం కాదు. అయినా విస్తరణ (ఎక్స్‌పాన్షన్) నిర్మాణాత్మకమైనదిగాను, సంకోచం (కాంట్రాక్షన్) వినాశకరమైనదిగాను చెప్పవచ్చు. మరో విధంగా చెప్పాలంటే సాధించేది దివ్యత్వం, నశించేది అహంకారం. ఈ రెండూ మన సిస్టమ్‌లో ఉన్నాయి.

**ప్రశ్న: ఉన్నత స్థాయిలోను, దిగువ స్థాయిలోను అంతర్వాణిని గ్రహించటం ఎలా?**

**జవాబు:** బాబూజీయే మాస్టర్! ఇంటర్ కమ్యూనికేషన్ అన్నది 'వారి'కే సాధ్యం కాని, అభ్యాసీకి కాదు. 'వారు' ఎప్పుడు తలిస్తే అప్పుడు తమ దివ్య శక్తితో 'అంతర్వాణి'ని వినిపించగలరు. అభ్యాసీ పూర్తిగా తనను తాను మరచి లయావస్థను కూడా దాటి ఇంకా ఉన్నత దశలలో ఉండి తాను ఒక కలం పట్టుకుంటే దానంతట అదే వ్రాసుకుంటూ పోతుంది. ఆలోచనతో పనిలేదు. చెప్పాలంటే నోటి నుండే అనర్గళంగా వాగ్ధార వెలువడుతుంది. అంతా ఆ దివ్యశక్తి ప్రభావమే. నేను వ్రాసేటపుడు ఏమి వ్రాస్తున్నదీ, ఏమి మాట్లాడుతున్నదీ నాకు తెలియదు. అంతా బాబూజీ మహరాజ్ ప్రేరితమే. బాబూజీ వ్రాశారంటే – వారు దివ్యపురుషుడు కనుక అది సాధ్యం. ఏ దివ్యశక్తికైనా ఆదేశాలు ఇచ్చి వ్రాయించగలరు. మనం 'మాస్టర్' కాదుగదా! మనం వారిలోనే మునిగిపోయి, వారు వ్రాయించగా, 'వారి' కృపతో వ్రాస్తున్నాం. ప్రశ్న ఉదయించగానే జవాబు వెలువడుతుంది. ఇది అభ్యాసీ స్థాయి. కాని 'మాస్టర్' స్థాయి మహోన్నతమైనది. ఆ స్థితిలో వారు అంతర్వాణి రచించారు.

**ప్రశ్న: అభావం (శూన్యత – నెగేషన్) అంటే ఏమిటి?**

**జవాబు:** తాను ఉన్నాననే భావన లేకపోవటమే అభావం (శూన్యత – నెగేషన్) అని, బాబూజీ చెప్పారు.

మనం పరమాత్మ (ఆదిశక్తి)లో లయమవుతున్నా, ఇంకా మన వెనుక ఏదో అంటి ఉన్నట్లు భావన అప్పుడప్పుడు కలుగుతుంది. ఈ భావం కూడా పోయి పూర్తిగా అభావం ఏర్పడినప్పుడు ఆ స్థితి (కండీషన్) అభావం నుంచి అభావం (నెగేషన్ ఫ్రమ్ నెగేషన్) అవుతుంది. ఇందుకు ఉదాహరణ ఏమిటంటే, మడుగులో నిశ్చలంగా ఉన్న నీటిలో చిన్న రాయి విసిరితే చలనం కలుగుతుంది. చిన్న తరంగాలు కదలాడుతాయి. కొంతసేపటికి అవి బలహీనమై మళ్ళీ నిశ్చలత ఏర్పడుతుంది. ఇంకా చెప్పాలంటే, తానులేను అనే భావం, తరువాత మాస్టర్ ఉన్నారనే భావం ఇంకా పురోగమించి 'వారి' ఉనికి కూడా లేదనే భావం! దీనినే అభావం, అభావం నుంచి అభావం (నెగేషన్ ఫ్రమ్ నెగేషన్) అని వర్ణించవచ్చు. దైవం మీద నిగ్రహంతో ధ్యానం చేస్తే 'నేను' (అహం) ఉన్నట్లుగా అనిపించదు. 'నేను' అన్న వేరు భావం ఉన్నట్లయితే 'లయ' ఎలా ప్రాప్తిస్తుంది?

ఒకసారి నేను బాబూజీకి ఇలా వ్రాశాను –

గతంలో నాలో మీరు ఉన్నట్లుగాను, మీలో నేను ఉన్నట్లుగాను భావన ఉండేది. ఇప్పుడు అలాంటి భావన రావటం లేదు. ఎందుచేత? బాబూజీ దానికి సమాధానంగా – "ఒకప్పుడు నీవు నన్నే ధ్యానించేదానవు, స్మరించేదానవు. నీ ధ్యాస అంతా నావైపు మరల్చబడి ఉండేది. కాని ఇప్పుడు అది నా వంతు అయ్యి, నా ధ్యాస నీవైపు మరలింది. కనుక నీకు ఆ అనుభవం రాదు" అని వ్రాసారు.

**ప్రశ్న: (డీప్) లోతుగా ధ్యానమయ్యింది – అంటే ఏమిటి?**

**జవాబు:** లోతుగా (డీప్) ధ్యానం జరగటమంటే అభ్యాసీ తన భౌతిక అస్థిత్వాన్ని (ఉనికిని) పూర్తిగా మరచి (కోల్పోయి) దృష్టిని అంతర్ముఖం చేసి దివ్యం మీదనే లగ్నం చేయటం. అలా తన ఉనికిని మరచి పోయినపుడు ధ్యానం బాగా లోతుగా ఉంటుంది. ధ్యానంలో మొదట మన ఉనికి యొక్క ఎరుక ఉన్నా క్రమక్రమంగా అది తగ్గి బాబూజీ మనకు దర్శనమిస్తారు. ఎల్లవేళలా అంతర్దృష్టితో జీవిస్తూ ఉంటే ధ్యానముద్రలో లేకపోయినా ధ్యానంలో ఉన్నట్లవుతుంది.

**ప్రశ్న: అస్థిత్వాన్ని కోల్పోవటం మరియు లోతుగా ధ్యానం చేయటం – ఈ రెండూ వేర్వేరు ఎందుకవుతాయి?**

**జవాబు:** ఈ రెండూ వేరుగా ఉంటాయి. ఉనికి తెలియని స్థితి ఒకటైతే ఇంకా పురోగమించి ధ్యానంలో నిశ్చలంగా మునిగిపోవటం డీప్ మెడిటేషన్.

**ప్రశ్న: ధ్యానం యొక్క పురోగతిలో స్థబ్దత (నిల్చిపోవడం) అంటే ఎలా ఉంటుంది?**

**జవాబు:** పురోగతిలో స్థబ్దత అనేది లేదు. ఆ భావానికి మన మనస్సే కారణం. ఒక స్థితిలో మనకు ఆనందం కలిగాక అక్కడే ఉండాలి అని కోరుకుంటాం. కనుక అదే దర్శనం కలుగుతూ ఉంటుంది.

మాస్టర్ యొక్క ఇచ్ఛాశక్తితో మన పురోగతి ముడిపడి ఉంటుంది. అందుకు మన 'అహం' (నేను) వదిలిపెట్టాలి. ధ్యానంలో ఉండగా దివ్యశక్తితో అనుసంధానమవుతాం. కళ్ళుతెరవగానే మళ్ళీ 'నేను' (అస్థిత్వం) ప్రత్యక్షమవుతుంది. మనలో ఉన్నది దివ్యప్రకాశం. ఆ దివ్య ప్రకాశం 'వారి'దే. మనం పురోగతి (ప్రోగ్రెస్) చెందాలంటే బాబూజీతో మనకు ఎప్పుడు (లంకె) కనెక్షన్ అవుతుంది, ఎప్పుడు సాక్షాత్కారం లభిస్తుంది అనే ఉద్వేగం, తపన ఉండాలి. అప్పుడే ప్రోగ్రెస్ (పురోగతి)కి అవకాశం ఉంటుంది.

నేను (కస్తూరిగారు) ఇప్పుడు పాడిన ఈ పాట యొక్క భావాన్ని వివరిస్తాను. మనందరిని తరింపజేసి భూమా (అంతిమం)కి చేర్చటానికి బాబూజీ ఆ భూమా నుండి అవతరించారు. మనం గతి తప్పకుండా పురోగమించటానికి జాగ్రత్త చర్యలు తీసుకుంటూ, వారు బాధ్యత వహిస్తున్నారు. లాలాజీ సాహెబ్ సాధనా ఫలంగా అనంతం నుండి బాబూజీ అనే అమూల్య రత్నాన్ని సంపాదించి మనకు అందించారు. మన 'అహం' పూర్తిగా కరిగిపోతే మనకూ ఆ రత్నం లభిస్తుంది. అంటే బాబూజీలో మనం లయం అవుతాం. అప్పుడు బాహ్య ప్రపంచం మనల్ని ఆకర్షించలేదు. ప్రాపంచిక దృష్టి మనలో నశించి బాబూజీలోనే లయమైపోతాము. అలా లయమైనప్పుడు బిందువు, సింధువు (సాగరం)లో కలిసి, సింధువే తాను అయినట్లుగా, బాబూజీ యొక్క దైవశక్తి మనదే అవుతుంది. ఆ ఆనందం వర్ణనాతీతం.

సంధ్యా సమయంలో సూర్యుడు సింధూర వర్ణంలో ప్రకృతిచేత మనోహరంగా భాసిస్తున్నట్లే భూమా నుంచి అవతరించిన బాబూజీ ఈశ్వరీయ ప్రకాశంతో వెలుగొందుతూ ఉంటే, ఆ మనోహర రూపం ఒక్క కస్తూరికే కాదు సమస్త మానవాళికీ మనోహరంగా దృశ్యమాన మవుతుంది. సూర్యుడు తన కాంతి కిరణాలను అంతటా ప్రసరింప జేస్తున్నట్లే బాబూజీలో లయమైపోయిన తరువాత మనం వారి దివ్యశక్తి కిరణాలను అందరికీ ప్రసరింపచేయాలి. మనం పొందిన ఆనందాన్ని అందరికీ పంచి ఇవ్వడం మన విధిగా గుర్తించాలి. అంటే దివ్యత్వం వైపు ఇతరులను కూడా ఆకర్షింపజేయాలి.

**ప్రశ్న: బాబూజీ మహాసమాధి పొందకపూర్వం వారి జీవిత ఘట్టాలను వర్ణించి చెప్పండి.**

**జవాబు:** అన్ని విషయాలు నేను వ్రాసిన "వారు ఎవరంటే..." మరియు "సాక్షాత్కారం నుండి అనంతం వరకు" అను గ్రంధాలలో ఉన్నాయి. వాటిని చదివి గ్రహించండి. మీరు గ్రహించటమే కాదు, ఇతరులచేత కూడా చదివించండి.

ఈ సందర్భంగా నేను ఒక సంఘటనను వివరిస్తాను.

ఒకసారి బాబూజీ కొన్ని రోజులపాటు అనారోగ్యంగా ఉన్న సందర్భంలో 'వారి'కి పరిచర్యలు చేస్తున్న వారు, 'వారి' దర్శనానికి వచ్చిన అభ్యాసులను ధ్యానం చేయవద్దని ఆదేశించారు. అప్పుడు బాబూజీ వారిని అలా చెప్పవద్దని అన్నారు. "అనారోగ్యం భౌతిక శరీరానికిగాని, హృదయానికి కాదు. లోపల ఉన్న దివ్యశక్తి పనిచేస్తూనే ఉంటుంది. దాని ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది. ఆంతరికం, శరీరం అదుపులో ఉండదు" అని తెలియ చెప్పారు. మనం కూడా అనారోగ్యంగా ఉన్నా ట్రాన్స్‌మిషన్ గ్రహిస్తూనే ఉంటాము.

ఒకసారి మా సోదరికి అస్వస్థతగా ఉన్నప్పుడు బాబూజీకి లేఖ వ్రాశాను. 'వారు' తమ కృపను ప్రసాదించారు. ఆమెకు గుండె జబ్బు ఉన్నదని కూడా మాకు తెలియదు. బాబూజీ ట్రాన్స్‌మిషన్ ఇచ్చారు. అప్రయత్నంగానే ఆమె తన చేతిని గుండె మీద ఆన్చి ఉంచేది. బాబూజీ ప్రసారం చేసిన ఆ దివ్యశక్తి ఆ భాగాన్ని ప్రభావితంచేసి ఆరోగ్యం చేకూర్చింది. శారీరక దౌర్బల్యం వలన ఆ శక్తిధాటిని తట్టుకోలేదు కనుక, రక్షణగా బాబూజీ సంకల్పం ప్రకారం, చేతిని అలా అడ్డుపెట్టు కోవటం జరిగింది.

మనం ధ్యానంలో ప్రోగ్రెస్ అవుతున్నకొద్దీ బాబూజీ మనకు బాగా సన్నిహితం అవుతున్నట్లు గ్రహిస్తాము. బాబూజీ మహాసమాధికి పూర్వం షాజహాన్‌పూర్‌లో వారు ఉన్నా, మనకు ట్రాన్స్‌మిషన్ వచ్చింది. బాబూజీ మహాసమాధి అనంతరం కూడా మనకు ట్రాన్స్‌మిషన్ వస్తూనే ఉంది. మహాసమాధి భౌతిక శరీరానికిగాని ఆత్మకు కాదు.

**ప్రశ్న: బాబూజీకి, మీకు మధ్య ఉన్న అంతర్వాణి గురించి వివరించండి.**

**జవాబు:** అంతర్వాణి (ఇంటర్ కమ్యూనికేషన్) ఎవరికి లేదు. మీ అందరికి కూడా ఉంది. బాబూజీ అందరికీ దర్శనం ఇస్తూనే ఉన్నారు. ప్రతి కండీషన్‌లోనూ ప్రోగ్రెస్‌తో మాస్టరీ అవుతుంటే ఇంకా ఏముంది, మాస్టరీయే మాస్టర్.

**ప్రశ్న: ఒక అభ్యాసీకి వ్యక్తిగతంగా సిట్టింగ్ తీసుకునే అవకాశం లేకపోయి నప్పటికి ధ్యానంలో తపన ఉంటే ఇతర అభ్యాసీలతో సమానంగా దివ్యశక్తిని పొందే అవకాశం ఉందా?**

**జవాబు:** బాబూజీని ఒక అభ్యాసీ తనకు వ్యక్తిగతంగా సిట్టింగ్ ఎందుకు ఇవ్వటంలేదని అడిగినప్పుడు – వ్యక్తిత్వాన్ని నశింపు చేయటానికే ధ్యానం కాగా ఇంకా వ్యక్తిత్వం ఎందుకు? అని సందేహ నివృత్తి చేశారు.

మీకు మీరుగా ఇంట్లో కూర్చున్నా, సత్‌సంగ్‌లో కూర్చున్నా, వ్యక్తిగతంగా సిట్టింగ్ తీసుకున్నా, అభ్యాసీ యొక్క స్థాయినిబట్టి బాబూజీ నుండి ట్రాన్స్‌మిషన్ అందుతూ ఉంటుంది. సత్‌సంగ్‌కు రాలేకపోతున్న సందర్భాలలో ప్రశిక్షకునికి తెలియపరచి నిర్ణీత సమయంలో ఇంటివద్ద ధ్యానంలో కూర్చుంటే కూడా ఫలితం దక్కుతుంది.

**ప్రశ్న: సహజమార్గ అభ్యాసీకాని దైవ భక్తుని యొక్క హృదయం తెరువబడే అవకాశం ఉందా?**

**జవాబు:** భక్తుడు తన సాధనా స్థాయికి తగినట్లుగా లబ్ధి పొందవచ్చునుగాని సహజమార్గం అందుకు బాధ్యత వహించదు.

నా (కస్తూరీ గారు) స్మృతిపథం నుంచి మరికొన్ని విషయాలు చెప్తాను.

దివ్యపథానికై ఇతర మార్గాలలో సాధనచేసి, సహజమార్గం సర్వోత్కృష్టమైనదని దీనిలో ప్రవేశించిన వారిని, గత సాధనలను విడిచి పెట్టమని ఆంక్ష పెట్టలేదు. సహజమార్గం గొప్పదనే విశ్వాసంతో ఆచరణకు పూనుకున్నపుడు ఇతర పద్ధతులను విడనాడటానికి భయపడరాదు; దివ్యతేజస్సు లోపల ఉన్నప్పుడు లోపల ఉన్న దానినే ఆరాధించండి, బాహ్య పూజలు అనవసరం అన్నారు బాబూజీ.

బాబూజీ నాకు ఒకసారి ఉత్తరంలో ఇలా వ్రాశారు: "నీవు పొందవలసినది అంతా పొందావు. నీకింక నా సహాయం అవుసరం లేదు" అని. నేను బాబూజీని కలిసినప్పుడు "మీ సహాయం అవసరం లేదని ఎందుకు అంటున్నారు. మీరు నాకు ఆహారం పెట్టారు. ఆకలైతే తింటాను, ఆకలి లేకపోతే అవసరమని అనుకున్నపుడు తింటాను. శరీరానికి ఆహారం అవసరం లేదని ఎలా అంటారు. కనుక మీ సహాయం నాకు ఎప్పుడూ ఉండాలి" అని అన్నాను.

ఇదే విధమైన జాబు బాబూజీ వరదాచారి గారికి కూడా వ్రాశారు. వారు ప్రత్యుత్తరం ఇవ్వలేదు. నేను వరదాచారిగారిని కలిసినప్పుడు ఈ విషయం ప్రస్తావించాను. వారు తన పొరపాటును గుర్తించారు.

యుగపురుషులు అని చెప్పబడే రాముడు, కృష్ణుడులాగానే మన **బాబూజీ కూడా యుగపురుషుడు. మళ్ళీ వేల సంవత్సరాల వరకు ఇటువంటి అవతరణ ఉండదు. అటువంటి దివ్యపురుషుని శిరోధార్యం గావించి వారిలో లయం కావాలి.**

మీవంటి పారమార్థిక వ్యక్తిని బాబూజీ మాలో పారమార్థిక చింతన చిగురింపజేసి మార్గదర్శకత్వం వహించటానికి మాకు ప్రసాదించారని భావిస్తున్నాము. అవునా? ఇలా అడగటం అసమంజసమే అయినా నేను బదులిచ్చాను.

బాబూజీ మా తండ్రిగారితో చెప్పారు, "మీ కస్తూరీ ఇంక లేదు. ఆమె నాది" అని. ఇప్పుడు మీముందు ఉన్న కస్తూరి బాబూజీ కస్తూరి. మీరు కోరినపుడు బాబూజీలోనే దర్శించవచ్చు.

మనందరినీ దివ్య గమ్యానికి తీసుకొని వెళ్ళాలనేదే బాబూజీ సంకల్పం. అందుకు అనుకూలంగా మన తరపు నుంచి మనస్ఫూర్తిగా, దీక్షగా ధ్యానంచేస్తూ మనల్ని స్వయంగా 'వారి'లో లయంచేసుకోవటానికి సాధన చేస్తే మనల్ని పైకి తీసుకొని వెళ్ళటానికి సహకరిస్తారు. తమ కృపను మనకు దానంగా ఇచ్చారు. ఇప్పుడు కేంద్రంలో ఉన్న అభ్యాసీల ఆత్మలు తమ స్వశక్తితో అక్కడకు చేరుకోలేదు. కేవలం బాబూజీ అనుగ్రహంతోనే వారికి ఆ స్థితి సంప్రాప్తమయ్యింది. 'వారి' పాదాల మీద మనం మోకరిల్లి అర్పణ చేసుకుంటే, 'వారి' ఆశీర్వాదం మనం పొందుతాము.

లయావస్థను గురించి మరొకసారి వివరిస్తాను. లయావస్థలో మనం ఉన్న కండీషన్ మనకు అనుభవమవుతుంది కాని, దానిని వివరించలేము. ప్రగతి ఉంటుంది కాని, దాని గమనం మనకు తెలియదు. నేను బాబూజీకి వ్రాశాను – నేను అద్దంలో చూసినపుడు నా ముఖం కనిపించటం లేదు. మీముఖమే

కనిపిస్తోంది– అని. లయావస్థలో ఆత్మ యొక్క ఉనికి తెలియదు. అంతటా 'వారే' దర్శనమిస్తారు.

ప్రిసెప్టర్లు (ప్రశిక్షకులు) బాగా కృషి చెయ్యాలి. ఇరవయ్యో, ముప్ఫయ్యో సిట్టింగ్స్ ఇవ్వటం ముఖ్యం కాదు. ఏది అభ్యాసీలు పొందాలని అనుకుంటారో, చెబుతారో, ప్రిసెప్టర్లు వాటిని ఆ స్థితులను పొంది, అనుభూతి చెందటం వలన అభ్యాసీలకు ఉపయోగం ఉంటుంది. ఉదాహరణగా – బాబూజీ ప్రెజన్స్ (సన్నిధిని) ఫీల్ (అనుభూతి) అవటం.

ప్రిసెప్టర్ల ముఖ్య కర్తవ్యం ఏమిటంటే, అభ్యాసీలలో ఆధ్యాత్మికతపట్ల, సాక్షాత్కారంపట్ల తపన పెరిగేలా చేయాలి.

సంస్కారాలను దూరం చేయమని, రోగాలను పోగొట్టమని శ్రీ బాబూజీని కోరరాదు. దీని వలన వాటితో ఎటాచ్‌మెంట్ (బంధం) పెరుగుతుంది.

గమ్యం పొందాలని దృఢత్వంతో ఉంటే గమ్యం చేరటం తేలిక.

నలుగురికి తల్లి అయ్యి ప్రేమ పంచితే ప్రపంచంలో అందరికి ప్రేమ పంచవచ్చు – అందరికి తల్లి కావచ్చు.

ఒకసారి రాయ్‌జాదా గారు బాబూజీతో "మీరు సమయానికి సద్గురువులు" అని అన్నారు. అప్పుడు బాబూజీ "మీరు సహజమార్గపు లిటరేచర్ (వాఙ్మయం – పుస్తకాలు) చదవలేదా! సమయమే సద్గురువు. ఈ సమయంలో ఇది చేయి, అది చేయి, అని చెబుతుంది. కనుక సమయమే సద్గురువు" అని అన్నారు.

పెద్దవాళ్ళు చెప్పే మాటల్లో చాలా నేర్చుకోవాల్సింది ఉంటుంది. ఒకసారి భీమసేనరావు అనే అభ్యాసీ వ్యాపారంలో చాలా నష్టపోయి బాబూజీ వద్దకు వచ్చారు. సంభాషణలో మిర్చి గురించిన విషయం వచ్చింది. ఆ తరువాత భీమసేనరావు మిర్చి వ్యాపారంచేసి బాగా గడించారు. తరువాత ఆయన బాబూజీగారి వద్దకు వచ్చి "అంతా మీ కృప" అని అనగానే బాబూజీ "నేనేమి చేశాను. అంతా ఆ భగవంతునిదే నాదేముంది" అన్నారు. ఇక అర్థం చేసుకోండి మీరే!

బాబూజీపట్ల ప్రేమ, సాక్షాత్కారం కోసం తపన ఉన్న అభ్యాసులే ఇక్కడకు వస్తుంటారు. అందుచేతనే వారిని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం. అలాగే బాబూజీపట్ల ప్రేమ ఉన్న వారే స్థిరంగా అభ్యాసంలో ఉంటారు. ఇంకొకరి మెప్పుకోసం వచ్చేవారు నిలవరు.

ఈ సంస్థకి ఇతర కేంద్రాల నుండి వచ్చేవారు బాబూజీని, 'వారి' కృపను పొందాలని, సాక్షాత్కారం పొందాలని – ఆ సంకల్పంతో వస్తారు. ఇది చాలా మంచిది.

మమ్మల్ని ఎంతమందో పిలుస్తారు. కొన్నిచోట్లకు వెళ్ళితే శ్వాస ఆడదు.

అన్నిటికంటే ముఖ్యం సహజమార్గ సిస్టమ్‌ని అర్థం చేసుకోవటం. ఆధ్యాత్మికత కోసం, సాక్షాత్కారం కోసం తపించాలి.

ఏవైనా చెడ్డ ఆలోచనలు వచ్చినా బాబూజీ వాటిని సరిచేస్తారు. అలాంటి సమయంలో మనం బాబూజీ చరణాల మీద ఉన్నామని భావిస్తే వాటంతట అవే పోతాయి.

ఈ సంస్థలో చేరినవారు– శ్రీ బాబూజీని పొందటం కోసం, 'వారి' చరణాలవద్ద జీవించటం కోసం మరియు మన జీవితం ఆధ్యాత్మికత కోసమే –అని అనుకోవాలి. ఎవరూ దీనిలో ఎక్కువ కాదు, తక్కువ కాదు.

శ్రీ బాబూజీ అనేవారు – ఆధ్యాత్మికతలో వినయం గొప్ప వరం. ఎందుకంటే, దానిలో ఆత్మ సమర్పణ ఉంటుంది. కాని కృత్రిమమైన వినయం మంచిది కాదు. అందులో ఆత్మ సమర్పణ ఉండదు. బాబూజీ అందరి గుణదోషాలను చూస్తారు.

సిట్టింగ్ ఇస్తున్నప్పుడు మాత్రమే ప్రిసెప్టరు. మిగతా సమయంలో ఆయన కూడా ఒక అభ్యాసీయే.

ప్రపంచంలో అందరూ ఉంటారు. మన మిషన్ (సంస్థ)కు సంబంధం లేనివాళ్ళు కూడా ఉంటారు. అంతమాత్రంచేత వారి మాటలు, సంభాషణలు నచ్చలేదని, వేరుగా ఉండాలని మనం అనుకోకూడదు. అందరితోనూ కలసిపోవాలి. సహజమార్గ విధానం సరళమైనది, అమూల్యమైనది.

'పూజ' మొదలుపెట్టమని (స్టార్ట్) అంటారు కదా 'పూజ' అంటే విగ్రహారాధన కదా – అని ఒకరు నన్ను అడిగారు. దానికి నేను (కస్తూరిగారు) ఇలా చెప్పాను: "బాబూజీ పూజ అని అనరు. ధ్యానంలో కూర్చోండి" అని అంటారు. అలానే "మెడిటేషన్ ఓవర్" అంటారు. తప్పు కదా! అనంతాన్ని పొందేంతవరకు ధ్యానం అంతం కాదు కదా!

నేను (కస్తూరీ) ఇప్పుడు పాడిన పాటలోనే భావాన్ని వివరిస్తాను.

శ్రీ లాలాజీ ప్రార్థన వలన అంతిమం (అనంతం) నుండి దివ్యపురుషులు శ్రీ బాబూజీ అవతరించారు. 'వారి' ధ్యానంలో మునిగి ఉన్న అభ్యాసుల హృదయాల్లోకి చూసిన అంతిమశక్తి, మరియు లాలాజీ ఎంతో ఆశ్చర్యపోయారు –తాము ఒక్క బాబూజీని పంపగా వందల వేల బాబూజీలను ఆ హృదయాల్లో గమనించి. కనుక ఆ విధంగా అవటానికి మనం తయారు కావాలి. ఇదే ఆనందభరిత సమయం!

మనం బాబూజీకి అంకితమైతేవారిలో లయావస్థ మనకు లభిస్తుంది. అప్పుడు మన అంతరంగంలో 'వారు' ప్రత్యక్షమవుతారు. కనుక అలాంటి భక్తి ప్రేమలతో అంకితమై శరణాగతి పొందాలి. ఇదే అంతిమత్వానికి, లాలాజీకి, మనందరకీ కూడా ఆనందకర సమయం. దీని కోసం మనకు తీవ్రమైన కోరిక ఉండాలి.

మెడిటేషన్‌లోను, నిరంతర స్మరణలోను బాబూజీ మనలను పైకి తీసుకొని వెళ్ళేటప్పుడు ఆనందం లభిస్తుంది. కాని కొన్నిసార్లు లభించదు. అలా ఎందుకంటే, అభ్యాసీ తాను ఉన్న స్థితి నుంచి తరువాత స్థితికి చేర్చటానికి బాబూజీ చేసే ప్రయత్నంలో అలా ఉంటుంది. అందువలన ఆనందం పొందలేకపోతున్నామన్న సందేహం వీడి తరువాత స్థితికి చేరుకోవటానికి మనం సిద్ధంగా ఉండాలి.

ఆధ్యాత్మికతలో శ్రీ బాబూజీ ఈ విధంగా తయారుచేస్తూ తీసుకొని వెళ్ళతారు. దేనిలో మనం ఉంటామో (సహజమార్గం) దానిని గురించే మాట్లాడాలి.

**ప్రశ్న: మనం మంచి విషయాలు ఆలోచించాలని అనుకుంటాము. కాని మెడిటేషన్ (ధ్యానం)లో చెడ్డ ఆలోచనలు ఎందుకు వస్తాయి?**

**జవాబు:** సహజమార్గ విధానంలో బాబూజీ యొక్క నిరంతర స్మరణ అవసరం. స్మరణ అంటే – లక్ష్యం, లక్ష్యాన్నికి సంబంధించిన వాటిని జ్ఞాపకంలో ఉంచుకోవటమే. అభ్యాసీ ఎప్పుడూ 'వారి'నే చూస్తూ ఉంటే 'వారు' కూడా అభ్యాసీని చూస్తూనే ఉంటారు. 'వారి'నే ప్రేమతో మనం స్మరణలో ఉంచుకోవాలి. 'వారి'తో నేరుగా అనుబంధం ఏర్పరచుకోవాలి. అప్పుడు చెడు ఆలోచనలు అనేవి రావు. లోపల, బయట 'వారి'తోనే

ఉన్నప్పుడు చెడు ఆలోచనలు రావు. 'వారు' మన ఎదుటనే ఉన్నారు; ప్రాణాహుతి ఇస్తున్నారు; మనం 'వారి' దివ్యశక్తి ధారలో మునిగి ఉన్నాము – అన్న భావనలో ఉంటే చెడు ఆలోచనలు రానేరావు.

మనం పూర్తిగా 'వారి'లో మునిగిపోయి ఉండేంతవరకు ఆలోచనలు వస్తాయి. ఈ ప్రయత్నంలో బయటి ఆలోచనలు రావు. ఆలోచనా ధార తప్పు కాదు. కాని ఆలోచనలపై దృష్టి ఉంచటం తప్పు.

**ప్రశ్న: అభ్యాసీగా చేరాలంటే 18 సంవత్సరాల వయస్సు ఉండాలన్న నియమం ఉంది. కాని 16 సంవత్సరాల వయస్సులో తపన ఉంటే, మిషన్‌లో చేరవచ్చా?**

**జవాబు:** వద్దు. వాళ్ళని చదువుకోనివ్వండి. జీవితానికి కావలసినవి నేర్చుకోనివ్వండి. చేరిన తరువాత "ఉదయం గంట ధ్యానం చేసుకోవాలి, సాయంకాలం క్లీనింగ్ (నిర్మలీకరణ) చేసుకోవాలి" అని బలవంత పెట్టవద్దు. పది నిమిషాలు కూర్చోనివ్వండి. పడుకోబోయేముందు ప్రార్థన చేసుకోమని చెప్పండి. విద్య బాగా రావాలని కోరుకోమనండి.

వాళ్ళు ఎందుకు చేరుతున్నారో వాళ్ళకు తెలుసా? సాక్షాత్కారం అంటే తెలియదు. ప్రేయర్ (ప్రార్థన) చెప్పుకోమనండి. రెండు విధాలుగా అంటే ఒకటి అర్పణ (ఆఫరింగ్), రెండవది – చదువు బాగా రావాలని. అంతరంగం (ఇంటర్నల్)లో బాబూజీతో ప్రేమ కుదరాలని –ఈ విధానం (సిస్టమ్) గురించి పిల్లల ముందు మాట్లాడండి. ఆధ్యాత్మికతకు యజమాని బాబూజీ. వారిదే స్పిరిట్యుయాలిటి (ఆధ్యాత్మికత). మనం ఏమీ చెప్పరాదు.

మొదట సాక్షాత్కారం పొందండి. తరువాత ప్రపంచంలో ఎంతైనా చెయ్యండి. అప్పుడు బంధం (అటాచ్‌మెంట్) ఉండదు.

మా (కస్తూరి) ఇంటిలో ఒక అబ్బాయి పరీక్షకు వెళ్ళేటప్పుడు బాబూజీ ఫొటోకు దణ్ణం పెట్టి వెళ్ళాడు. కాని పరీక్ష బాగా వ్రాయలేదు. ఇంటికి వచ్చి బాబూజీగారిని –మీరు ముసలి వాళ్ళయిపోయారు– నాకు వద్దు. నేను వివేకానందునికి నమస్కారం చేస్తాను, అన్నాడట. మరుసటి రోజు పరీక్ష బాగా వ్రాశాడు. ఇంటికి రాగానే బాబూజీకి నమస్కారం చెప్పుకున్నాడు. అంటే ప్రేమ అంతరంగంలో కాకుండా బాహ్యంగా వ్యక్తమైంది ఆ చిన్నవాడికి. మనం చేయాల్సిన పని చేయాలి. పెద్దలపట్ల ప్రేమ, గౌరవం పెంచుకోవాలి.

**ప్రశ్న: ఎప్పుడూ మెడిటేషన్ మూడ్ (ధ్యాన స్థితి)లో ఉండాలి అంటారు– అంటే ఏమిటి?**

**జవాబు:** హృదయంలో బాబూజీ ఉన్నారన్న భావన, రోజంతా అలా ఉండవచ్చునుగాని మనస్సు మాత్రం ఎలర్ట్ (సంసిద్ధం)గా ఉండాలి. ఏమి జరుగుతుందో తెలుసుకోవాలి. మనస్సు, భౌతిక, ఆధ్యాత్మిక విషయాల్లో చురుగ్గా, నిశితంగా ఉండాలి.

ఒకసారి శ్రీ రాయ్‌జాదాతో శ్రీ బాబూజీగారు "సహజమార్గం అనేది నిద్ర పోవటానికి కాదు, అంతరంగంలో మేల్కోవటానికి. అంటే ఏదో ఆనందం పొంది ఊరుకోవటం కాదు, ఎలర్ట్ (సంసిద్ధం)గా ఉండి, కరిగి, కలిసిపోవాలి" అని అన్నారు.

నివేదన అంటే బాబూజీ, మనం వేరు కాదు – అనే భావన కాదు. 'వారి' హృదయంలో మనం మునిగి ఉండటం.

మనం భగవంతుని అంశ (భాగం). మొదట్లో అలానే ఉంది. తరువాత ఇది గ్రాస్ (స్థూలత)గా మారింది. కనుక సెల్ఫ్ (అహం -నేను)ను ఆ దివ్య సాగరం (దైవం)లో కరగిపోయేలా చేయాలి. ఎలా అంటే నీటిని చూడండి. ముందుగా అది నీరు, తరువాత అది ఐస్‌గా మారింది. ఐస్ (అహం–నేను)ని నీటి (దైవం)లో వేస్తే కరగి, ఆ నీటిలో కలిసిపోతుంది.

సెల్ఫ్ (అహం -నేను)ను చల్లబరచటం వలన స్థూలత్వంగా తయారైపోయాము. మొదట ఇది స్థూలత్వం కాదు. నీటిని మాములుగా (సహజంగా) తొలిస్థితిలోనే ఉంచితే దాని (ద్రవ) స్థితి మారదు. ఆ నీటిని 'ఫ్రిజ్'లో ఉంచితే (స్థితి) మారిపోయి ఐస్ అవుతుంది. అనగా సెల్ఫ్ (ఎగో–నేను, నాది) అనే అహంకారపు పొరలను ఏర్పరచు కుంటున్నాము. అంటే ఈ తొట్టతొలి (దైవ) అంశకు అహంకారం, సెల్ఫ్ (నేను, నాది) అను పొరలను కప్పి 'అతని' (దైవం)కి దూరంగా ఉంచుతున్నాము.

మనం బాబూజీకి దగ్గరితనం కలిగి, 'వారి'లో మునిగి ఉండటం ద్వారా స్థూల రూపం (గ్రాసర్ ఫామ్) పోతుంది.

ఎగో (అహంకారం) ఎందుకు? ఎక్కడ నుండి వచ్చింది? -అన్న దానికి బాబూజీ ఇలా చెప్పారు.

సత్యయుగంలో అందరూ పని చేస్తూనే అంతరంగంలో భగవంతుని దర్శించుకుంటూ (చూస్తూ) ఉండేవారు. అందువలన బాహ్య కార్యాలకు ఏ ఆటంకం కలిగేది కాదు. తరువాత కాలం జరగ్గా జరగ్గా మనం మరెంతగానో భౌతికత్వంగా మారిపోయాము. భౌతికతే మనం అయిపోయాము. పూర్తిగా భౌతికతలోనే నివసించటం వలన 'అహంకారం' ఏర్పడింది. అందుకని శ్రీ బాబూజీ అంతరంగ విధానం తెచ్చారు. ధ్యానంలో అంతర్ దృష్టి (లోపలి చూపు) ఉంటుంది. దానితో సెల్ఫ్ (నేను, నాది – పొరలతో సహా) కరగిపోతుంది.

ఎప్పుడైతే అంతరంగంలో 'వారి'ని నిలుపుకొని, మునిగి ఉంటామో అపుడు భౌతిక విషయం ఏదైనా హృదయంలో చొరబడదు. మనస్సు చూసినా హృదయం చూడదు. నోరు చెబుతుంది, చెవి వింటుంది కాని, ఇవేవీ హృదయంలోకి చేరవు. శ్రీ బాబూజీని ప్రేమతో హృదయంలో నిలుపుకుని, ఏ పని చేసినా, 'వారి' పైనే దృష్టి నిలపాలి.

జనక మహారాజు దగ్గరకు ఎవరో ఒక గురువు తన శిష్యుణ్ణి బ్రహ్మజ్ఞానం తెలుసుకోవటానికి పంపాడు. ఆ శిష్యుడు జనకుని వద్దకు వెళ్ళి ఆ విషయం చెప్పి, మాట్లాడాలి అన్నాడు. జనకుడు "నేను ఇప్పుడు మరో కార్యంలో నిమగ్నమై ఉన్నాను. తర్వాత మాట్లాడుదాము. ఈలోగా మీరు మా అంతఃపుర శోభను తిలకించి రండి" అన్నారు. శిష్యుడికి ఆశ్చర్యం వేసింది. నిరసనా కలిగింది. జనసామాన్యంతో లౌకిక కార్యాల్లో మునిగిపోయిన ఈ రాజు వద్ద బ్రహ్మజ్ఞానం ఏమి నేర్చుకోవాలి -అని. అయినా గురువుగారి ఆజ్ఞ ప్రకారం జనక మహారాజు మాట గౌరవించి 'సరే' అన్నాడు.

అప్పుడు జనకుడు "అయ్యా! అంతఃపురం చూసేటప్పుడు మీరు మీ చేతిలో ఈ ఆముదపు దీపాన్ని ఉంచుకుని – అది ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరిపోకుండా చూసుకోవాలి. అప్పుడే మీ కోరిక తీరుతుంది" అన్నాడు. శిష్యుడికి ఈ నిబంధన వింతగా ఉన్నా, అంగీకరించి అలానే దీపాన్ని చేతిలో ఉంచుకొని విజయవంతంగా తిరిగి వచ్చాడు.

జనకుడు తిరిగివచ్చిన శిష్యుణ్ణి చూసి "అయ్యా! మా అంతఃపుర శోభ మిమ్మల్ని ఆనందపరచి ఉంటుంది. మీరు చూసిన విశేషాలు చెప్పండి" అని కోరాడు. శిష్యుడు క్షణం ఆలోచించాడు. ఏమి చెప్పటానికి నోరు పెగల్లేదు. ఇక తప్పక "రాజా! మీరు చెప్పినట్లే దీపాన్ని తీసుకుని అది ఆరిపోకుండా చూసుకుంటూ తిరిగి వచ్చాను. ఏకాగ్రతతో దీపాన్నే చూసుకుంటూ తిరగటం వలన మీ అంతఃపుర శోభ సంగతే గమనించలేకపోయాను. మన్నించండి" అన్నాడు.

జనక మహారాజు నవ్వుతూ "మహాశయా! అదే దృష్టితో అంటే నా అంతరంగంలో నా దైవాన్నే చూస్తూండగా నా ఎదుటనే ఈ రాజ్య వ్యవహారాలు, లౌకిక కార్యాలు అన్నీ జరిగిపోతున్నాయి. నాకు ఇవేవీ దృష్టిలో లేవు – నాకు నా దైవం తప్ప. నీవు తెలుసుకోవాల్సిందీ ఇదే! ఇంతే" – అన్నాడు.

మనందరి దృష్టి అలా అంతరంగంలో ఉన్న దైవంపై ఉండాలి. అపుడు మన దైనందిన కార్యాలు నిర్విఘ్నంగా జరిగిపోతాయి ఏ ఆటంకం లేకుండా.

మనకు ఇష్టమైనవారు (అతిథి) మన ఇంటికి వస్తే ఎంత పనిలో మనం ఉన్నా వారిపైనే మన దృష్టి ఉంటుంది. మనస్సంతా ఆ వైపే ఉంటుంది. అలా కాకుండా ఎవరో మనకు ఇష్టంలేని వారు వస్తే ఎదురుగా ఉన్నా మనం చూడం. ఎప్పుడు పోతారా అనుకుంటూ చిరాగ్గా ఉంటాం.

అంటే దైవం (బాబూజీ) మనకు ఇష్టమైన వారు. వారి పైననే మనస్సు, దృష్టి ఉంటుంది, ఉండాలి! అలా కాని ఇతర ఆలోచనలన్నీ – ఇష్టం లేనివన్నమాట, వాటిపై మనస్సు ఉండదు. దృష్టిపోదు.

ఇలా మన దృష్టి, మనస్సు ఆ దైవం, మన బాబూజీ మీదనే ఉండాలి. ధ్యానంలో తపన ఆ విధంగా ఉండాలి. మనం అంటాము – ఆలోచనలు వదలటం లేదని. కాని బాబూజీ అంటారు – మనమే ఆలోచనలను వదలటం లేదని.

మన ప్రేమ 'వారి' కోసమే. మనం ప్రేమతో 'వారి' ఎదురుగా కూర్చొని దృష్టి 'వారి' మీదనే ఉంచితే, మనం ఏమీ కోరుకోకపోయినా మాస్టర్ ఏదో ఒకటి ఇస్తూనే ఉంటారు.

అభ్యాసీలు కొందరు సిట్టింగ్ కొరకు వస్తారు. కాని లోపల సిట్టింగ్ కావాలని కాదు. అప్పుడు బాబూజీ అతనిలో ఆ కోరిక కలిగిన తరువాతనే సిట్టింగ్ ఇస్తారు.

మరికొందరు మెడిటేషన్ (ధ్యానం) మొదలుపెట్టమని అడుగుతారు. కాని అప్పటికే ట్రాన్స్‌మిషన్ జరిగిపోయి ఉంటుంది. మనం అడగకపోయినా బాబూజీపై మనలోగల ప్రేమ వలన 'వారు' మనకు సిట్టింగ్ ఇస్తారు.

లవ్ మోర్ – సీ నియర్.

చూపు – ఎంతో ప్రేమ. చూడు మరెంతో దగ్గరగా ఉండి.

శ్రీ రామచంద్ర మిషన్‌లో చాలామంది అభ్యాసీలు ఉన్నా, బాబూజీని అంతరంగంలో కలిగిన వారే నిజమైన అభ్యాసీలు.

అందరూ అనంతంలోకి వెళ్ళితే నా ఇల్లు చిన్నదైపోతుంది, అని ఆ అనంతం అనుకుంటుందా!

మెడిటేషన్ అంటే 'వారి'ని ధ్యానంలో ఉంచుకోవటం. 'వారి' చరణాలపై ఉన్నామని భావించాలి. మంచి ఆలోచనలు, మంచి భావనలు ఉండాలి.

**ప్రశ్న: సెల్ఫ్ (నేను, నాది)కు, అంతిమంకు లింక్ ఉంటుందా?**

**జవాబు:** ఉండదు.

బ్రైటర్‌వరల్డ్ దాటిన తరువాత ఏడు వలయాలు ఉంటాయి. ఆ బ్రైటర్‌వరల్డ్‌లో శ్రీ లాలాజీ, శ్రీ స్వామి వివేకానంద ఉన్నారు. వారి "స్థితి"ని వదలి వచ్చి బాబూజీకి సహాయం చేస్తారు. ఎవరైనా, ఈ బ్రైటర్‌వరల్డ్ దాటగానే 'వారి' కంటే గొప్పవాళ్ళమనుకొనరాదు. 'వారు' సహాయం చేయాలంటే అక్కడకు రావలసిందే!

మాస్టర్ (బాబూజీ) అంతిమం నుండి వచ్చారు మనందరిని తీసుకొని వెళ్ళటానికి. మనకు 'వారు' ఇల్లు చూపించారు. అక్కడకు వేగంగా (త్వరగా) చేరుకోవాలంటే మధ్యలో డీవియేషన్స్ (ప్రక్కదారులు) ఉండరాదు. ఎలాగంటే చిన్నపిల్లలు మధ్యలో ఆటలాడుకుని ఇంటికి ఆలస్యంగా వస్తారు. అలాకాక నేరుగా వచ్చేస్తే త్వరగానే ఇంటికి చేరుకుంటారు కదా! – అలాగన్నమాట.

మనం కలం పట్టుకుంటాము. ఏది వ్రాయాలో, ఎవరు వ్రాయిస్తున్నారో ఆ కలానికి తెలియదు. మనకూ తెలియదు. ఏది ప్రశ్నయో, మరేది సమాధానమో మనకు తెలియదు.

శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పినవి ఎక్కడా చెప్పబడలేదు. ఆధ్యాత్మికతలో ఏ లిటరేచర్ (వాఙ్మయం)లో లేనివి 'వారు' చెప్పారు. "ఇక్కడ నుండి అనంతం వరకు అన్ని రహస్యాలను విశదమయ్యేలా ఉంచాను" అని 'వారు' అన్నారు.

సహజమార్గం ప్రవేశపెట్టింది రోగాలను నయం చేయటానికి కాదు (భవరోగాన్ని నయం చేయటానికి).

మనం సహజమార్గ విధానం అనుసరిస్తున్నాం అంటే– మెడిటేషన్, నిరంతర స్మరణ, నిర్మలీకరణ (క్లీనింగ్), రాత్రి చెప్పుకునే ప్రార్థనా – ఇంతే కాదు. సహజంగా ధ్యానంలోకి వెళ్ళగానే బాబూజీ సాన్నిధ్యాన్ని అనుభూతి చెందటం కావాలి.

మంజిల్ (గమ్యం) చాలా ఎత్తులో ఉందనుకుంటే, 7 అంతస్థుల భవనం ఎక్కాలన్నా కష్టం. కాని లిఫ్ట్‌లో ఉంటే కష్టం తెలియకుండా పైకి వెళ్ళతాము. అలాగే సహజమార్గం అనుసరిస్తే (లిఫ్ట్ అనుకుంటే) సునాయాసంగా గమ్యం చేరతాము.

గురువు శరీరంపైన ధ్యానం చేసేవారు గురు పశువు అవుతారు.

గురువు దేహం విడచిపోయినా వారినే, భగవంతునిగా భావించి శక్తి పొందితే వారు గురు భక్తులవుతారు.

మనలను 'సాక్షాత్కారము'నకు దివ్యశక్తితో 'వారు' తీసుకొని వెళ్ళతారు. ఆ శక్తిపై అధికారం ఎవరికి ఉంటుందో వారే డివైన్ మాస్టర్.

ప్రేమతో వారి సాన్నిధ్యాన్ని పొందవచ్చు.

రెండు రకాల వాలంటీర్లు ఉంటారు. అందులో ఒక వర్గం వి.ఐ.పి వాలంటీర్లు. వీరు ఆజ్ఞలు జారీ చేస్తారు. అంతే! రెండవరకం వారు –మాస్టర్ భావనలో మునిగి పని చేసేవాళ్ళు. వీరికి బాబూజీ ఆశీస్సులు ఉంటాయి. మొదటి వర్గం వారికి ఏమి ఉపయోగం ఉండదు.

మాస్టర్ దృష్టి అందరి మీదా ఉంటుంది. 'వారు' అందర్నీ పరిశీలిస్తూ ఉంటారు.

ఇక్కడ గ్రహించినదంతా పూర్తిగా ఎబ్జార్బ్ చేసుకోవాలి (జీర్ణించుకోవాలి).

రోజువారి పనులు ఏమేమి చేయాలి, ఎలా చేయాలి అనుకుంటూ విపరీతపు ఆలోచనల్లో మునిగిపోరాదు. బదులుగా ఆ సమయమంతా నిరంతర స్మరణలోనే ఉంటూంటే ఆయా పనులన్నీ సరైన పద్ధతిలో ఎలా జరగాలో అలా సవ్యంగానే జరిగిపోతాయి. ఆయా కార్యకలాపాలన్నీ నిరంతర స్మరణలోనే జరిగిపోవటం వలన మీ ప్రమేయం ఉండక పోవటంవలన ఏ సంస్కారాలు మీకు అంటవు.

**లోతుగా ధ్యానంలో మునుగు!**

**వాస్తవానందం పట్టి తెచ్చుకో.**

ఎవర్నీ ద్వేషించకుండా ఉంటే, అందర్నీ ప్రేమించవచ్చు. అందర్నీ ప్రేమించగలగటం అనేది ఎంతకాలంలో సిద్ధిస్తుందంటే, మొదలు పెట్టడమే తరువాయి వెంటనే పూర్తవుతుంది –అన్నారు బాబూజీ.

బాబూజీ అన్నారు కదా –"అందర్నీ నేను ప్రేమిస్తాను. కాని ఎవరూ అది చూడరు (గుర్తించరు)." బాబూజీ చెప్పే ప్రతి మాటలోనూ ఎంతో లోతైన అనుభవం ఉంటుంది.

"నేను నిజం చెప్పటానికి ప్రయత్నిస్తాను. కాని కొన్నిసార్లు (అప్రయత్నంగా) దానంతట అదే అబద్ధం వచ్చేస్తుంది" అని కొందరు అంటారు. దీనికి మంచి మార్గం మౌనంగా ఉండటమే.

**ప్రశ్న: సంస్కారాల నుండి మనం ఎప్పుడు విడుదల అవుతాము?**

**జవాబు:** చిన్న పిల్లవానిగా అయితే సరే! ఇంక స్థూలత్వం రాదు. చిన్న పిల్లవానిగా మారిపో. కాని తనంత తానుగా అలా అవటం కష్టం. కాని బాబూజీ (సముఖంలో) ముందు అది తేలిక. బాబూజీ ఎదుట పెద్ద మనుషులు కూడా చిన్న పిల్లలైపోతారు.

"సాధకునికన్నా నాకు సైనికుడే మిన్న", ఇది బాబూజీ మాట. క్రమశిక్షణ ముఖ్యాతి ముఖ్యం – అని 'వారి' ఉద్దేశ్యం.

"సమస్యలకు బానిస కారాదు" అన్నారు బాబూజీ. వంద విషయాల్లో మనకు సంతోషం కలిగినా ఒక్క విషయంలో కలిగిన బాధనే పట్టుకుని వ్రేలాడి కృంగిపోతాము. అలా సంతోషం కలిగించని వాటికే ప్రాముఖ్యతనిచ్చి ఉండిపోవటంతో ఆనందకర విషయాలు కూడా మనం గుర్తించకుండానే మనల్ని దాటి పోతాయి. కష్టాలు వస్తాయి అనే బాధతో, ఉన్న సుఖాలను కూడా కోల్పోతాము.

ప్రతివారు చెడుపైనే ధ్యాస ఉంచి, మంచిని అశ్రద్ధ చేస్తారు. ప్రజలు విచారపు ఆలోచనలనే ఇష్టపడతారు. అలా కాకుండా మనం మంచి పనులకు, మంచి వార్తలకే ప్రాముఖ్యత నివ్వాలి. సంతోషకరం కాని వాటిని, చెడ్డ వాటిని మనం వదలివేయాలి. ఈ సంఘటయే అందుకు ఉదాహరణ:

ఒకసారి మన అభ్యాసీలు ప్రయాణిస్తున్న రైలుకు ప్రమాదం జరిగింది. గురుదేవుల కృప వలన ఏ ఒక్కరూ గాయపడలేదు. కాని వారు ఏడవటం చూసి, నేను ఆశ్చర్యపోయి "ఎందుకు అలా ఏడుస్తున్నారు? ఎవరికీ ఏమీ కాలేదు కదా!" అన్నాను. దానికి వారు "ఒకవేళ దెబ్బలు తగిలితే మేము ఏమయి పోయేవారం?" అని ఏడ్చేశారు.

"మొదట స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ఝాన్సీ లక్ష్మీబాయికి ముక్తి లభించింది." అని బాబూజీ చెప్పగానే ఆమెతోపాటు యుద్ధం చేసిన వారందరికి ముక్తి ఎందుకు రాలేదు మరి – అని ఒకరు అడిగారు.

దానికి బాబూజీ ఝాన్సీరాణి గురించి ఇలా చెప్పారు: ఆమె ఎప్పుడు ఏ పనిచేసిన భగవాన్ శ్రీకృష్ణుని స్మరించి చేసేవారు. ఆ యుద్ధ సమయంలో ఆమె ఏడు రోజులు ఏమీ తినకుండా, త్రాగకుండా యుద్ధం చేసింది. ఆ విషయం దాసీలు అడుగగా – నేను భగవాన్ శ్రీకృష్ణ కృపారసాన్ని పానం చేస్తున్నప్పుడు మిగతా రసాలతో నాకు పనేముంది– అని ఝాన్సీరాణి అన్నారు.

బాబూజీ మహరాజ్ – తమ ఎదురుగా అభ్యాసీలు కూర్చున్నప్పుడు తానిచ్చే దానిని (దివ్య కృపను) స్వీకరించటానికి ఆ అభ్యాసీలు ఎలర్ట్‌గా (సంసిద్ధంగా) ఉండాలని అన్నారు. తమ ఎదుట మెడిటేషన్ మూడ్‌లో అభ్యాసీలు కళ్ళు మూసుకుని కూర్చుంటున్నారు. అలా కూర్చోవటం వలన అభ్యాసీలు తమ ప్రపంచంలో తాము మునిగిపోయి ఉంటారు. ఆ ఆలోచనలలోనే వారు తిరుగుతూ ఉంటే, బాబూజీ మహరాజ్‌గారు ఇచ్చేదానిని పొందలేరు. అంతరంగికంగాను, బాహ్యంగాను ఎలర్ట్‌గా ఉండాలి. అప్పుడే 'వారు' ఇచ్చే దానిని పొందగలరు, ప్రసారం చేయగలరు. దానిని హృదయంలోకి స్వీకరించగలరు. అందుచేత సంసిద్ధతతో కూర్చోవాలి. అదే మర్యాద, గౌరవం.

తిరుపతిలో దేవుని చూడటానికి ఎంతోమంది కొండపైకి వెళ్ళుతున్నారు. జనాలను చూడటానికి ఆ దేవుడే ఒకసారి క్రిందకు రాకూడదా! అని అన్నారు బాబూజీ.

కళ్ళు మూసుకుని మెడిటేషన్ మూడ్‌లో ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చెందిన వారి ముందు కూర్చున్నప్పుడు ధ్యానంలో ఏమి పొందగలవో దానినే పొందగలవు. కాని అంతర్ బాహ్యాల్లో ఎలర్ట్‌గా వారి ఎదుట ఉన్నప్పుడు, అంతకన్నా ఎక్కువ పొందగలవు. అప్పుడే బాబూజీని 'చూడటం' సాధ్యపడుతుంది. అందుచేత ఉన్నత స్థాయిలో ఉన్నవారి ఎదుట కూర్చున్నప్పుడు కళ్ళు మూసుకుని ధ్యానములోకాని, ధ్యానస్థితిలోకాని ఉండరాదు. వారు ఏమి ఇస్తారో అని ఎదురుచూస్తూ సంసిద్ధంగా ఉండాలి.

ఒకసారి నేను బాబూజీని కలిసి తిరిగి వెళ్ళిన తరువాత జాబు వ్రాశాను– "బాబూజీ! ఈసారి మిమ్మల్ని (బాహ్యంగా) చూసినట్లే లేదు నాకు" అని. దానికి ప్రత్యుత్తరంగా బాబూజీ "ఇంతకుముందు వచ్చావు కాని నన్ను చూడకుండానే వెళ్ళిపోయావు. ఇప్పుడు మొదటిసారిగా నన్ను చూసావు" అని. అంటే ఇంతవరకు చూసింది బాహ్య రూపాన్ని. కాని ఇప్పుడు చూసింది అంతరంగ రూపాన్ని, నిజతత్వాన్ని.

**ప్రశ్న: ప్రేమకు, దివ్యప్రేమకు గల భేదం ఏమిటి?**

**జవాబు:** ప్రేమ ఇద్దరు వ్యక్తుల మధ్య ఉంటుంది. ప్రేమించే వారొకరు, ప్రేమించబడే వారొకరు. ఇద్దరు ఉంటారు ఇక్కడ. ఇది ప్రేమ.

బాబూజీని ప్రేమిస్తాము. అది బాబూజీకి అర్పణమైపోతుంది. మనం వారిని ప్రేమిస్తున్నామన్నదే మరచిపోతాము. ఇక్కడ ప్రేమించబడే వారు ఒక్కరే. వారే దైవం. 'వారు' మన జ్ఞాపకంలో ఉన్న ధ్యాసే మనకు ఉండదు. 'వారు' మనల్ని గుర్తు పెట్టుకోవటం వలన మన ధ్యాస (దృష్టి) వారి మీదే ఉంటుంది. ఇదే దివ్యప్రేమ!

తెలివితక్కువ వానికి ఒకేబాట (దేవుని త్రోవ), తెలివితేటలు ఉన్న వానికి (ఎంతో ఆలోచిస్తారు కనుక) ఎన్నెన్నో దారులు.

బరువు ఎత్తుకున్న గాడిద వెనుక నుండి ఎవరూ తోలకపోయినా తిన్నగా దాని స్థానానికి అది వెళ్ళిపోతుంది. కాని తెలివి ఉన్నవారు అలా (త్రోవల్లో) తిరుగుతూనే ఉంటారు.

బాబూజీ హాస్యంగా ఈశ్వర్ సహాయ్‌గారితో "నేను అభ్యాసులను బుద్ధిహీనులుగా తయారు చేస్తున్నానని అందరికి చెప్పకండి" అన్నారట ఈ విషయాలు చెబుతూ.

ప్రతి అభ్యాసి ధ్యానంలో ఎంతో కొంత పొందుతాడు.

సంతోషంగా ఉండటానికే నీవు సహజమార్గంలో చేరావు. కనుక ఉద్రేకపడవద్దు, అరవ వద్దు. వాస్తవంగా ఉద్రేకాలు తొలగించుకోవాలి. అరవటం అనే విధానం మార్చుకోవాలి. బాబూజీ నీ ఎదుటనే ఉన్నారు. సంతోషంగా ఉండండి.

**ప్రశ్న: లయావస్థకు, మెర్జింగుకు గల భేదం ఏమిటి?**

**జవాబు:** 'లయ' అభ్యాసీ నుండి మాస్టర్‌లోకి ఉంటుంది. మెర్జింగ్ అనేది ఒక్కసారే జరిగింది. ఇకముందు జరగబోదు. అంటే లాలాజీ బాబూజీలో 'మెర్జ్' అవటం.

నది సముద్రాన్ని చేరటం –లయ. సముద్రం వచ్చి నదిలోకి చేరదు (రాదు). అభ్యాసీ అంటే నది. బాబూజీ అంటే సముద్రం –అన్నమాట.

దివ్య సాగరంలో మునిగిపో. ఎన్నటికీ బయటికి రావద్దు. ఎంత లోలోతుల్లో ఆ దివ్య సాగరంలో నీవు మునిగిపోయి పైకి రాకుండా ఉంటావో అదే లయావస్థ. లోలోతుల్లో ఆ దివ్య సాగరంలో మునిగిపోయి, లయావస్థ స్థితిపై, స్థితిగా నీవు చేరతావు. నీవు మునిగిపోయినకొద్దీ నీ అహంకారం కరగిపోతుంది. అప్పుడు లయావస్థలోని అంత్యస్థితికి చేరతావు.

దివ్య పురుషుని అవతరణకోసం లాలాజీ 'భూమా'ను ప్రార్థించగా బాబూజీ అవతరించారు. భూమాశక్తి అత్యంత శక్తివంత మైనది. కనుక బాబూజీ భౌతిక శరీరం దానిని తట్టుకోలేకపోవచ్చు. ఆ శరీర రక్షణ కోసం లాలాజీ బాబూజీలో మెర్జ్ అయ్యారు.

లాలాజీ తన అన్ని శక్తులను బాబూజీపరం చేసినా లాలాజీ అనుమతి లేనిదే ఏ శక్తినీ బాబూజీ వినియోగించలేదు. ఎప్పుడూ వారిని క్షణమైనా మరువలేదు. అదే 'వారి' మర్యాద, మన్నన.

బాబూజీ మహరాజ్ చెప్పిన విషయం – నన్ను గుర్తుకు తెచ్చుకోండి. అక్కడ నేను ఉంటాను. అది ఎలాంటి గుర్తు (స్మరణ)? ఆ గుర్తు, ఆ స్మరణ హృదయానికి బంధమై (కనెక్షన్ అయి) ఉండాలి.

జీవితానికి పరమలక్ష్యాన్ని ముందు ఏర్పరచుకోవాలి. ఈ లక్ష్యం యొక్క స్మరణ ఎటాచ్‌మెంట్ (అనుబంధం)కు దారితీస్తుంది. అనగా మన లక్ష్యాన్ని ఎన్నడు మరువరాదు. ఈ విధంగా లక్ష్యాన్ని నిరంతరం

జ్ఞాపకం చేసుకుంటే అది సంకల్పంగా మారుతుంది. ఒకవేళ మనం లక్ష్యం నుండి దూరంగా వెళ్ళినా, ఈ సంకల్పమే మనల్ని చేరువ చేస్తుంది. ఈ సంకల్పం దృఢమైతే అది మనల్ని లయావస్థకు చేర్చుతుంది.

అభ్యాసీ సంకల్పం, బాబూజీ సంకల్పానికి భేదం ఉంది. అభ్యాసీ సంకల్పం బాబూజీ (దైవం)లో లయమవటం. కాని బాబూజీ, వారి సంకల్పంలో సమస్త ప్రాణులలో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుటం ద్వారా లయావస్థకు చేర్చటం. కాని కొంతకాలం తర్వాత రెండూ ఒక దానితో ఒకటి సమానమవుతాయి.

సత్యపథ్, దైవశక్తి (గాడ్లీ రీజియన్) పైన ఉన్నది. భూమా, అంతిమం (అల్టిమేట్) ఒక్కటే.

దేని నుండి అయితే సృష్టి ప్రారంభమైనదో ఆ అంతిమంలో దివ్యశక్తి (గాడ్లిపవర్) ఒక బిందువు మాత్రమే. బాబూజీ అంతిమం నుండి వచ్చారు. అవతారం దివ్యశక్తి నుండి వచ్చింది. ఇదే ఒక అవతారానికి, బాబూజీకి గల భేదం.

"మిమ్మల్ని సంతోషపెట్టాలంటే ఎంతగా ప్రేమించాలి" అని బాబూజీని ఒకరు అడిగారు. "నిన్ను నీవు ప్రేమించుకునే దానికన్నా ఎక్కువగా" అని అన్నారు బాబూజీ.

'నేను' అనేది బాబూజీతో సంధానమై ఉండాలి.

"నిన్ను నీవు మరచావు (కోల్పోయావు) అంటే నన్ను గుర్తుంచుకున్నావు" అని బాబూజీ అన్నారు. గుర్తుంచుకోవడమంటే నిన్ను నీవు మరిచిపోవటమే! నిన్ను నీవు మరచిపోవటానికి నీవు బాబూజీకి సంధానం చేసుకోవాలి అంతే!

'నేను' చెబుతున్నాను, 'నేను' చేస్తున్నాను అనుకున్నప్పుడల్లా బాబూజీకి ఆ 'నేను'ను అనుసంధానం చేయి –అంతే. ఇంక ఎల్లప్పుడూ 'వారే' గుర్తుంటారు. ఇక నీవు ఉండవు. ఇది అసాధ్యం కాదు కాని కొంత సాధన అవసరమని అన్నారు.

మోడరేషన్ అనగా సమభావం సమస్థితి. ఇది ప్రయత్న పూర్వకంగా గాని, కృతకంగా గాని రాదు. ధ్యాన సాధన ద్వారా ఇది పొందగలం. ఎవరినీ ద్వేషించరాదు. అందరూ నా వారే అనుకోవాలి.

అవసరాన్నిబట్టి ఆగ్రహం వ్యక్తీకరించినా ఆ వెంటనే మామూలు స్థితికి రావాలి. మాట కరుకుగా ఉన్నా హృదయం మెత్తగా, సున్నితంగా ఉండాలి.

షాజహాన్‌పూర్‌లో ఒకసారి బాబూజీ ఒక నౌకరుతో బిగ్గరగా మాట్లాడారు. ప్రక్కనే ఉన్న వరదాచారిగారు "బాబూజీ మీకు కోపం వస్తుందే" అన్నారు. దానికి బాబూజీ "నాకేమీ కోపం రాలేదే! నేను ఆ నౌకరుతో అలానే మాట్లాడుతాను. అయినా నా అంతర్ స్థితిలో భేదం ఏమీలేదు" అన్నారు.

బాబూజీతో అనుబంధాన్ని మీరు పెంచుకొని ధ్యానం మొదలు పెడితే తక్షణం ప్రాణాహుతి ప్రసారం (కృపాధార) మొదలవుతుంది. బాబూజీ నావారు –అనే భావన ఉండాలి. అప్పుడే ధ్యానంలో ధార మొదలవుతుంది. అంతేకాని మనస్సుతో లగ్నం చేయటానికి ప్రయత్నిస్తే జన్మంతా వృధా అయిపోతుంది కాని 'వారి'ని పొందలేము.

బిడ్డ అవసరాలు ఏ ప్రయత్నం లేకుండానే తల్లికి సహజంగానే తెలుస్తాయి. సరియైన అభ్యాసీ ఎప్పుడూ బాబూజీ స్మరణలోనే ఉంటాడు. అతడు ఆ స్మరణకోసం మనస్సు పెట్టనవసరం లేదు. నిరంతర

(సతత) ధ్యానంతో బాబూజీని నీ వారిని చేసుకోవాలి. ప్రయత్నపూర్వకంగా స్మరణలోకి తెచ్చుకోవటం కాదు. 'వారు' మనలోనే ఉన్నారు. మనం 'వారి'తోనే అనుబంధాన్ని స్థిరపరచుకోవాలి. బాబూజీ జ్ఞాపకం అప్రయత్నంగా దానికదే అప్పటికప్పుడు వచ్చి గాఢమైన ప్రేమ కలిగినదై ఉండాలి. ఇలాంటి గాఢప్రేమ కొనసాగితే, కొంతకాలానికి ప్రేమ మిగిలి 'జ్ఞాపకము'నే మర్చిపోతాము.

అనుభూతియే భగవంతుని భాష –అంటారు బాబూజీ.

బాబూజీని "మీకు ఏ సెంటర్ అంటే ఇష్టం" అని ఒకరు అడగ్గా "నేను వారివైపు దృష్టిసారించేలోగా, వారే నా దృష్టి తమవైపు మళ్ళించే విధంగా నా శ్రద్ధను త్రిప్పుకుంటూ ఉన్న సెంటర్ అంటే నాకు ఇష్టం" అన్నారు. అంటే బాబూజీపట్ల ప్రేమ, భక్తి ఉన్నవారే 'వారి'ని పొందగలరు.

"నా దగ్గరకు వచ్చి వెళ్ళిపోతున్న ఆభ్యాసులు తిరిగి నా వద్దకు ఎప్పుడు మరల వద్దామా అనే తపనతో ఉంటారు. అలాంటి వారి రాక కోసం ఎదురు చూస్తుంటాను" అన్నారు బాబూజీ.

వెళ్ళిపోతున్న అభ్యాసులు –బాబూజీ ఇల్లు మనది. ఈ ఇంటికి తిరిగి ఎప్పుడు వస్తామా అన్న తపనతో ఉండాలి. తినటానికి, ఉండటానికి అన్ని ఉంటాయా, సమకూరతాయా అన్నదాన్ని పట్టించుకోరాదు.

ఏ పని చేసినా ఆఫీసు పనిగాని, ఇంటిపనిగాని ఏదైనా సరే బాబూజీ కోసమే, 'వారి' సంతోషం కోసమే ఆ పనులు నిర్వహిస్తున్నామన్న భావనతో చేయాలి. అప్పుడు, వాటివలన లభించే కష్ట సుఖాలు, సమస్యలు అన్నీ 'వారి'కే చెందుతాయి.

ఫకీర్ అంటే ఏమిలేనివాడు. దైవ సన్నిధికి వచ్చినప్పుడు, తిరిగి వెళ్ళేటప్పుడు కూడా ఏమీ లేనివాడే! ఏ బంధాలు లేవు. పూర్తి బంధ విముక్తుడు అతడు. సెయింట్ స్థితికి, ఫకీర్ స్థితికి భేదం ఉంది.

ఏ అవస్థలో (స్థితిలో) ఈశ్వర సాక్షాత్కారాన్ని సహజ పద్ధతిలో పొందుతామో దానినే 'సహజ అవస్థ' అంటారు. ఈశ్వరుని పొందటం ఈ విధంగా సహజం.

ఈశ్వరుడు ఒక్కడే – రెండు, అను భావన (ద్వైత భావన) లేని చోటనే ప్రేమ ఉంటుంది – అని కబీరు చెప్పాడు.

తపన పెరిగిపోయినప్పుడు ఎరుకలేని మగత స్థితిలోని ఆ సమయమంతా మనం భగవంతుని యొక్క అంతరములోనే ఉన్నామను ఎరుక (జ్ఞానం) మనకు కలుగుతుంది. వారు మనలోనే ఉన్నారు –అను విషయం తెలిసి ఆశ్చర్యపోతాము.

సంకల్పం సిద్ధించిన తర్వాత దానిని ఇక 'స్థితి' అనము. ఎందుకంటే, ఎన్నెన్నో స్థితులు దాటి లక్ష్యసిద్ధి పొంది 'స్థితి లేని స్థితిని' (బేహాల్) చేరుకున్నాము.

సంకల్పం (భగవత్ సాక్షాత్కారం) పొందిన వ్యక్తి మాత్రమే స్థితిలేని స్థితిని పొందినవాడు.

ఈశ్వరునితో యోగం (కలయిక) కోసం కోరిక పెరిగినంతనే అభ్యాసీలో పురోగతికోసం కోరిక అంతమవుతుంది. ప్రధాన లక్ష్యం (ఈశ్వరుడు) కనుచూపు మేరలో యోగానికి సాధ్యముగా ఉన్నందున అభ్యాసిలో పురోగతి కోసం కోరిక తొలగిపోయి ఈశ్వర యోగానికై తపన పెరుగుతుంది. లక్ష్యం చేరేంతవరకే ఉన్నతి అవసరమై ఉన్నది. యోగం కోసం తపన పెరిగి, గాఢమై చివరకు ఈశ్వర యోగం ప్రాప్తించి తపన పరిసమాప్తమవుతుంది.

ఈశ్వరునిలో లయం పొందిన స్థితిలో మనకు మన భౌతిక దేహంతో సంబంధం తెగిపోయి ఈశ్వరునితో సంబంధం ఏర్పడుతుంది. ఇట్టి స్థితిలో మనకు మన భౌతిక దేహం చైతన్యం లేని మృత దేహంగా కనిపిస్తుంది. ఉన్నతమైన దానితో లయం పొందిన కారణంగా మన దేహంతో మనకు సంబంధం తెగిపోయి అది మృతదేహంగా కనిపిస్తుంది. భౌతిక దేహంతో మన సంబంధం కంటే ఈశ్వరునితో కలుగు సంబంధం (లయం) ఉత్తమమైనది.

ఒక స్థితి యొక్క అంతం మరొక స్థితి యొక్క ప్రారంభం. అనగా ఒక స్థితి యొక్క అంతం తరువాత స్థితి యొక్క ప్రారంభానికి లంకె (ఆధారం) అవుతుంది.

సహజమార్గ విధానంలో అద్భుతాలు (మిరకిల్స్) అప్పటి అవసరాన్నిబట్టి జరుగుతాయి. వాటిని చూపటం లేక బహిర్గతం చేయటమనేది ఉండదు.

ఒకసారి బాబూజీతో కారులో ప్రయాణానికై సన్నాహం చేసుకున్నాము. పదే పదే దాన్ని గూర్చిన జాగ్రత్తలు బాబూజీ విచారించారు. “పెట్రోలు నిండుగా నింపాము. కారుకు సర్వీసింగ్, చెకప్‌లు వగైరా క్షుణ్ణంగా చేయించాము” అని నేను బాబూజీతో చెప్పాను. బాబూజీతో సహా మేమందరం కారులో ఎక్కాము. కారు స్టార్ట్ చేశారు. ఆశ్చర్యంగా అది రెండు ముక్కలైంది. అద్భుతం ఏమిటంటే ఎవరికీ ఏ ప్రమాదం జరక్కుండా అందరూ క్షేమంగా బయటపడ్డాం.

బాబూజీ ప్రయాణం చేసే కారు ఇలా రెండు ముక్కలవుతుందని ఎవరం అనుకోలేదు. ఈ విషయమై బాబూజీ మరీ మరీ పట్టించు కోవటమూ, కారు ముక్కలైనా, చమత్కారంగా అందరూ క్షేమంగా బయటపడటం మామూలుగానే జరిగినట్లయింది.

రాముడు కోదండపాణియై తనకు దర్శనం ఇచ్చాడని రామభక్తుడు ఒకాయన బాబూజీతో అనగా, వారు “నీవు చూసింది సరైన భావ రూపం కాదు. రాముడు అంతర్వ్యాపి–అని తెలుసు కోవటమే వాస్తవార్థం. చిత్రాలు, ఫొటోలు చూసి అలా దర్శనం పొందామని చెప్పటం సరైన పద్ధతి కాదు. బదులుగా నిర్గుణ, నిరాకార, నిరామయ భావమే సరైన భావం” అని అన్నారు.

శ్రీ రామచంద్ర మిషన్ యొక్క తేజాన్ని (ప్రభావాన్ని) దృఢ దీక్షతో భవిష్యత్‌లోకి తీసుకొని వెళ్ళగల న్యాయశీలత కల పది మంది అభ్యాసీలను ప్రతి ప్రిసెప్టరు తీర్చిదిద్దాలి.

తక్కువ మందే అయినా ఈ అభ్యాసులు సహజమార్గపు ప్రభావాన్ని, కాంతిని ఎక్కడైనా, ఎప్పుడైనా విస్తరింపజేయాలి.

బాబూజీ మహరాజ్ యొక్క ప్రేమపూరిత ప్రాణాహుతి ప్రసారం వలన, అభ్యాసీల స్వయంకృషి లేకపోయినా, అప్రయత్నంగానే పరిసరాల వాతావరణం మారిపోయి, సహజమార్గపు ప్రభావం (వెలుగు) విస్తరిస్తుంది.

ఇటువంటి అభ్యాసీలు నలుగురైదుగురు ఉన్నా, వారి పరస్పర ప్రభావ కారణంగా, వారు ఉన్న ప్రదేశం సహజమార్గపు దివ్యత్వంతో ఉంటుంది. వారితోపాటు ప్రాణాహుతి ప్రసారం కూడా ఉండటం వలన ఇతరులు కూడా లబ్ధి పొందుతారు. ఈ విధంగా సంస్థ అభివృద్ధి చెందుతుంది – అని అన్నారు బాబూజీ.

బాబూజీ మహరాజ్‌ను ఒక పండితుడు "సత్యం, శివం, సుందరం అంటే ఏమిటి?" అని అడిగాడు. "ప్రతిదానికి రెండు అర్థాలు ఉంటాయి. ఒకటి కృతకమైంది. రెండవది వాస్తవమైనది. నా గురుదేవులు లాలాజీ నాకు వాస్తవ అర్థాన్నే చెప్పారు" అంటూ "నేనే సత్యం, శివం, సుందరం" అన్నారు బాబూజీ. ఇక్కడ 'నేను' అంటే సృష్టికర్త (క్రియేటర్).

"పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళు; ధనికులు, పేదలు అనే తారతమ్య (భేద) భావంలేని వాడే అభ్యాసీ" అని చెప్పారు బాబూజీ.

తమ తమ హృదయాల్లో బాబూజీని నిలుపుకుని వారి సన్నిధిని అనుభూతి చెందునట్టి అభ్యాసులను ఉన్నతిలో ఉంచుతారు బాబూజీ.

అనంతం యొక్క దివ్య సౌందర్యమే సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం). ఈ విషయం ఆధ్యాత్మిక గ్రంథాలలో ఎక్కడా వివరింప బడలేదు. ఎందుకంటే, అక్కడ నుండి అవతరించిన వారెవరూ లేరు; అక్కడకు చేరిన వారెవరూ లేరు. అవతారాలన్నీ కేంద్ర మండలపు అధోఃస్థానం నుండి ప్రత్యేక విషయమై ప్రత్యేక శక్తితో అవతరించారు. బాబూజీ మహరాజ్ మాత్రమే ఇదంతా వివరించి అందరికి అర్థమయ్యేట్లు వెల్లడి చేసారు. బాబూజీ మహరాజ్ అనంతం నుండి అవతరించేంత వరకు ఆధ్యాత్మిక గ్రంథాలు; మీరా, తుకారాం వంటి ఆధ్యాత్మిక మహనీయులు దైవం యొక్క నామరూపాల గురించిన భావనయే వివరించగలిగారు.

మంచితనం, సన్మార్గం అలవరచుకున్నప్పుడే మనలో ఆధ్యాత్మికతకు అర్హత లభిస్తుంది.

ప్రతివారికి నివసించటానికి ఒక ఇల్లు ఉంది. అందరు కలసి ఉండే ఒకే ఇల్లు కావాలి. అందులో ఉన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక బంధంతో ముడిపడి ఉండాలి. భౌతిక విషయాల్లోని దగ్గరితనం కాకుండా దైవిక స్వభావతత్వంతో కూడిన దగ్గరితనంతో మనం ఉండాలి. అప్పుడే మనలో సామీప్యత లభించి ఆత్మీయత ఏర్పడుతుంది.

"బాహ్య బంధంకన్నా అంతరంలోని బంధం మిన్నగా ఉండాలి" అని బాబూజీ నొక్కి చెప్పారు. బాహ్యాడంబరాలు బాగా తగ్గించుకోవాలని బాబూజీ చెప్పేవారు.

ఎవరినీ ద్వేషించకూడదు. ఎవరినైనా ఇష్టపడకపోయినా దానిని అంతరంగ భావనలోకి రానివ్వకూడదు. అవమానాలు పొందినా, వాటిని ఓర్చుకోమని ఆధ్యాత్మికత నొక్కి చెబుతుంది. ఓర్పును అలవరచుకోవాలి. ఆయా పనులు చెడ్డవి కాని, ఆ పనుల వెనక ఉన్న వ్యక్తి చెడ్డవాడుకాడు. బాహ్యంగా ఎంత ద్వేషం చూపిస్తే, అంతగానూ అంతరంగంలో అది ఇంకుతుంది.

బాహ్యంలో నీవు ఎంతగా మునిగిపోతావో అంతగా బాహ్య ప్రపంచం పెంచుకుంటావు. దీనికిబదులుగా నీవు అంతరంగంలో (దైవంలో) ఎంతగా మునిగితే అంతగానూ దివ్యత్వాన్ని పొందుతావు. బాహ్యం (ప్రపంచం) మాయా పూరితం. అంతరం దైవరస పూజితం.

సృష్టికర్త ఒక్కరే! కాని సృష్టి కడు విశాలమైనది. సృష్టి పెరిగినకొద్దీ సృష్టికర్తకు దానిమీద ప్రేమ పెరుగుతుంది. అలాగే బాబూజీ శ్రీ రామచంద్ర మిషన్ సృష్టికర్త. శ్రీ రామచంద్ర మిషన్ ఎంతగా వ్యాప్తి చెందితే 'వారి' ప్రేమ మిషన్ కొరకు అంతగానూ పెంపొందుతుంది. ఈ పెంపొందిన ప్రేమను పొందిన అభ్యాసీలు అదృష్టవంతులు.

# లయావస్థ

ఐసు నీటి యొక్క ఘనరూపం. దీనిని నీటిలో ఉంచితే క్రమంగా కరిగిపోతుంది.

దైవం మనలో ఉన్నా మనం గుర్తించటం లేదు. అంతర్ నేత్రంతో అంతరంగంలో వారిని చూసినప్పుడు, ఆ వెంటనే అలా చూస్తున్న భావన కోల్పోయినప్పుడు, తిరిగి రేకెత్తించి ప్రోత్సహిస్తుంది. దైవం గురించిన ఈ ప్రోత్సాహం 'నేను' అన్న దానిని మాత్రం వదలి అహంకారపు పొరలను, అహంను కరిగించి వేస్తుంది. ఆపై ఆ 'నేను' కూడా దివ్యత్వంలో కరిగిపోగానే అప్పటి ఆ స్థితిని 'లయావస్థ' అంటారు.

సముద్రంలో అట్టడుగుకు చేరిన వ్యక్తి యొక్క స్థితితో లయావస్థను పోల్చవచ్చు. ఆ సముద్రంలో పూర్తిగా మునిగిపోయి, తన్ను తాను కోల్పోయిన వ్యక్తి యొక్క అనుభవాన్నే లయావస్థ అంటారు.

మనం నిరంతరం బాబూజీ మహరాజ్ స్మరణలోనే ఉండాలి.  ఈ స్మరణకు అడ్డు వచ్చే ఆలోచనలన్నీ వదలివేయాలి. మనం బాబూజీకే చెందినవారమని దృఢంగా అనుకుంటే, అంతరాత్మ దానిని ధృవీకరించి నప్పుడు, మన అనుబంధం 'వారి'తో పాదుకొల్పబడుతుంది మరియు మన ప్రయత్నం సఫలమవుతుంది.

ఒక అభిలాషి బాబూజీ వద్దకు వచ్చి వారికి లక్షలాది రూపాయలను ఇవ్వజూపాడు. "ఈ లక్షాధికారులు, కోటీశ్వరులు శాశ్వతమైన ధనవంతులు కారు. వాస్తవానికి వారికి ఏ విలువా లేదు. ఎందుకు నీవు వచ్చావో, అందుకు నీ (సెల్ఫ్) హృదయాన్ని అర్పించు" అన్నారు బాబూజీ.

"ఏ కోరికలు లేకుండా హృదయాన్ని అర్పించటమే అత్యంత విలువైన అర్పణ" అని నొక్కి చెప్పారు బాబూజీ.

సృష్టిలో ఏది సుందరంగా ఉంది అనుకుంటామో అది అంతిమంలోని దివ్య సౌందర్యపు ప్రతిబింబమే! ఆ దివ్య సౌందర్యాన్ని చూడగలిగినప్పుడు, దాని విలువను, గుణాధిక్యతను గ్రహించినపుడు ఆకర్షించబడతాము. ఆ తరువాత దాని నిజ సౌందర్యం దర్శించటం జరుగుతుంది. ఆపై పురోగమించటానికి బాబూజీ మహరాజ్ వారి దివ్యాకర్షణతో సాక్షాత్కార స్థితికి తీసుకొని వెళ్ళుతారు.

బాబూజీ మహరాజ్ యుగంలో జన్మించటం ఒక్కటే మనకు గర్వకారణం.

గురువు తన పేరు, ప్రఖ్యాతులు చెప్పుకుని ప్రజలను అసహజంగా బందీలుగా చేసుకుంటున్నాడు. ఇలాంటి గురువుల అధ్యాయాల్ని ముగింపు చేయటానికే తాను వచ్చానని, బాబూజీ చెప్పారు.

భౌతిక బంధాన్ని త్రుంచి అంతిమానికి మనల్ని అనుసంధానం చేయటానికే వారు వచ్చారు.

గొప్ప (ఋషులు) సెయింట్స్ అయిన మీరాబాయి, తులసీదాస్, సూరదాస్ తదితర మహనీయులకు గురువు లేరు. వారు ఆధ్యాత్మిక గ్రంథాలు, పెద్దల సూచనల వలన భగవంతుని పొందవచ్చని తెలుసుకుని నేరుగా ఆ భగవంతునితో అనుసంధానించుకున్నారు. ఈ ఆలోచన భగవంతునిపట్ల అంతరంగంలో ప్రేమ ఏర్పరచుకోవటానికి దోహదమిచ్చింది. భగవంతునికోసం అంతరంగంలోకి చూడాలి. ఎంతగానంటే అంతర్ నేత్రాలు దైవాన్ని చూస్తుండగానే బాహ్య నేత్రాలు బాహ్య ప్రపంచాన్ని చూసుకుంటాయి. ఇది నీ అంతరంగంలోని దైవానికి నిన్ను నీవు సంధానం చేసుకున్నప్పుడు జరుగుతుంది.

దైవ భావన రాగానే హృదయంలో దైవ సాన్నిధ్యాన్ని అనుభూతి చెందాలి. బాబూజీ స్మరణలోకి రాగానే ప్రాణాహుతి ప్రసారం మొదలైనదని భావించాలి.

హృదయపూర్వకమైన (నీ) ఒక్క ప్రార్థనతో నీవు అంతిమ సాక్షాత్కారం పొందడాన్ని త్వరితం చేస్తారు బాబూజీ.

ప్రాణాహుతి ధారాపాతం స్వీకరించేవాని లేక జీర్ణంచుకోగలిగే వాని సామర్థ్యంతో ముడిపడి ఉంది.

**కృప:** భగవత్ కృపను జీర్ణించుకునే శక్తి కావాలంటే, కావలసింది ఆ దైవానుగ్రహమే. అంతిమ స్థితిని పొందినవారి హృదయపూర్వక ప్రార్థన మాత్రమే ఈ అనుగ్రహాన్ని అందించగలదు.

అంతిమ స్థితిని పొందిన వారి ప్రార్థన వలన లభించిన కృపను సంపూర్ణముగా జీర్ణించుకునే శక్తిని కూడా అనుగ్రహించమని వారే ప్రార్థిస్తారు.

భగవదనుగ్రహం అనగా, దివ్య కృపాధారను జీర్ణించుకునే స్థితి.

మానవాళిని ఉద్ధరించటానికి గురువు బాధ్యత వహిస్తారు. ఆత్మను అంతిమంతో అనుసంధానించగల ప్రావీణ్యత కలిగి ఉన్న దివ్యపురుషుడే సద్గురువు.

మీరందరూ నన్ను 'సోదరి' అని పిలవటం వలన నాకు ఎంతో సాన్నిహిత్యం కలుగుతుంది. అలా పిలుపించుకోవటమే నాకు ప్రియం – ఇష్టం. 'సోదరి' అని కాకుండా మరోలా పిలిపించుకుంటే సాన్నిహిత్యం కలగదు.

సహజమార్గ విధానంలో ధ్యానం చేయనప్పటికి అంతరంగంలో దైవ సాన్నిధ్యం అమితంగా అనుభవించాను, కాని ఈ సహజమార్గ విధానం అనుసరించిన తర్వాత కలిగిన ఆధ్యాత్మిక అనుభవాలు, ఉన్నతి అప్పుడు కలగలేదని నేను బాబూజీతో ఒకసారి అన్నాను.

"ఒక విధానంలో మనం సాధన చేసేటప్పుడు గురువు భౌతిక పరిధిలో ఉంటాడు. ఆ సాధన దాటి మనం ముందుకు వెళ్ళి అంతరంగంలో స్థిరంగా 'వారి'ని మాత్రమే చూడగల క్రమశిక్షణ అలవడినప్పుడు, దివ్యానుభవాన్ని పొందుతాము" అంటూ బాబూజీ విపులీకరించారు.

"స్పృశించకుండా (అభ్యాసీ చేయి కూడా పట్టుకోకుండా) దివ్యత్వానికి తీసుకొని వెళ్ళగలిగేవారే సద్గురువు" అని బాబూజీ విడమరచి చెప్పారు.

బాబూజీ మహరాజ్ నన్ను అనంతంవైపు వెంటతీసుకొని వెళ్ళుతూ చిన్నపిల్ల చేతులను పట్టుకున్నట్లు నా చేతుల్ని పట్టుకున్నారు. తిరిగి చేతుల వైపు చూసుకున్నప్పుడల్లా బాబూజీ నా చేతుల్ని పట్టుకున్నట్లే లేదు. కాని అదే సమయంలో ముందుకు చూస్తే శ్రీ బాబూజీయే ముందుకు తీసుకొని వెళ్ళటం కనపడింది.

ఈ యాత్రలో సద్గురువులు శ్రీ బాబూజీ మహరాజ్‌కు నాకు మధ్య కొంత దూరాన్ని (ఖాళీ) నేను చూసాను. ఆ దూరం నాకు బాబూజీ మహరాజ్ వారి రెండు చేతులకు మధ్యనే అన్నది తెలిసింది. ఈ దూరమే, ఖాళీ– ఈశ్వరుడు లేదా భగవంతుడు. ఈ ఖాళీ 'రూపము'ను దాటించటానికే, బాబూజీ మహరాజ్ తానే అట్టిపెట్టారు.

బాబూజీ మహరాజ్ తమ దివ్య కృపాధారతో సాధకులను అంతిమ స్థితికి తీసుకువెళ్ళి, 'వారు' భూమా నుండి అవతరించిన కార్యం నెరవేరేట్లు చేస్తారు.

ఈ వర్తమాన కాలం, మానవులందరిలో ఆధ్యాత్మిక మార్పు కోసం ఆధ్యాత్మికతతో పరిపుష్టి నొందినది. యోగ్యతా యోగ్యతలు ఎలా ఉన్నా దివ్య ప్రాణాహుతి ద్వారా అందరికి ఆధ్యాత్మిక శక్తినిచ్చి స్వగృహానికి (అసలు ఇంటికి) తిరిగి రమ్మనిన దాని పిలుపును గుర్తించవలసి ఉంది. క్లుప్తంగా చెప్పాలంటే, జనన మరణ చక్రం నుండి మానవుని విడుదల చేయటం ప్రస్తుతానికి 'అంతిమం' యొక్క బాధ్యత.

బాబూజీ మహరాజ్ ఎప్పుడూ ఇలా అంటూండేవారు: "కాలంతో కొలిస్తే మానవుని పతనం కూడా విస్తారమైనదే. సత్యయుగం నుండి కలియుగానికి మానవుని పతనం తలచుకుంటే, అంటే మానవుని ఇప్పటి గుణహీనతకు (దిగజారి పోవటానికి) నాలుగు యుగాల కాలం పట్టింది" అని.

మరో మాటలో చెప్పాలంటే కాలం, అవతరించిన అవతారాలు అడ్డుకోవటం వలన, అవి దిగజారి పోవటానికి ఇంకా ఎక్కువ సమయం పట్టింది. అందుచేత మానవ పతనంతో పోలిస్తే అతనిలో ఆధ్యాత్మిక పరిణామం మృదువుగా, శీఘ్రంగా జరిగింది. మానవుని విముక్తికోసం భూమా నుండి అవతరించిన బాబూజీకి ఆ పని చాలా తక్కువ సమయంలోనే పూర్తి అయ్యింది.

ఒకసారి దొంగతనం చేసినంతమాత్రాన వానిని దొంగ అని అనకూడదు. దొంగతనం మరోసారి చేసినప్పుడు, ఆ దొంగతనం చేశానన్న అపరాధ భావం అతనికి లేనప్పుడుతప్ప అతడిని దొంగ అని పిలువరాదు.

కాబట్టి దొంగతనం చేస్తున్నానన్న అపరాధ భావం అంతరంగంలో లేనివాడే దొంగ. అదే విధంగా మానవాళి కూడా ఒకరిని ఒకరు –ఏ విధమైన జాలి, కరుణ అనేవి లేకుండా చంపుకునే స్థాయికి చేరారు. ఇలాంటి దిగజారిపోయిన మానవ విలువలను (జాలి, దయ) పునరుద్ధరించటానికే దివ్యపురుషులు (స్పెషల్ పర్సనాలిటి) అవతరించారు.

పోగొట్టుకున్న మానవ విలువలను ఉద్ధరించటానికి మానవుడు తనకు తానే విముక్తుడు కాలేడు. కనుక అతని సహాయార్థం 'అనంతం' నుండి దివ్య ప్రాణాహుతి ప్రసారం అతనిలోకి, అతని అభివృద్ధి నిమిత్తం ప్రవేశపెట్టబడుతుంది.

**ప్రశ్న: ధ్యానం కొనసాగటంలో అడ్డు ఎందుకు వస్తుంది?**

**సోదరి:** మన గతజన్మ లన్నింటిలోను మన మనస్సుకు ఏ లక్ష్యం లేకుండా తిరగటాన్ని నేర్పాము. బాబూజీ తెలియపరచినది ఏమిటంటే, ఆంతరికం ఎప్పుడూ మెడిటేషన్‌లోనే ఉన్నందున ధ్యానం కొనసాగుతూనే ఉంటుంది. మనస్సు మీద ఉన్న గతజన్మల సంస్కారాల ప్రభావం వలన మనస్సు అంతరంలోని మెడిటేషన్‌కు ఎలర్ట్ (సంసిద్ధం) అవడంలేదు. కనుక ఎప్పుడైతే కొనసాగుతున్న ధ్యానం తప్పుతుందో, అప్పుడు మనస్సును సున్నితంగా 'అంతరం'లోకి త్రిప్పాలి.

అంతరంగంలో మెడిటేషన్ (ధ్యానం) కొనసాగుతూ ఉంటుంది. కనుక దినచర్యలన్నీ పూర్తి చేసుకుంటూనే అంతరంగానికి అంటుకుని ఎలర్ట్‌గా (సంసిద్ధంగా) ఉండాలి.

బాబూజీ మహరాజ్ ఒక మాట అంటూ ఉంటారు, "పూజలో కూర్చోండి" అని. దీనిలో మనం గ్రహించవలసిన సూక్ష్మమైన విషయం ఏమిటంటే, అంతరంగంలో మెడిటేషన్ (పూజ) ఎప్పుడూ జరుగుతూనే ఉంది. మనం దానికి సంసిద్ధంగా ఉండటమనేదే సాధనలో ఒక భాగం. కాబట్టి "పూజ మొదలు పెట్టండి"

అని చెప్పటం సరికాదు. ఎందుకంటే, పూజ (మెడిటేషన్) జరుగుతుంది – ఆగుతుంది, అన్న విధంగా ఇది ఉంది. కనుక 'పూజ'లో కూర్చోండి అన్నదే సరైన మాట.

**ప్రశ్న: ఆలోచనలు రావటానికి కారణం ఏమిటి?**

**జవాబు:** అవి మనకు ఇష్టం, కనుక వస్తాయి. ప్రతి ఆభ్యాసీ దైవ సాన్నిధ్య భావంతో ఒక గంట ఆంతరిక 'పూజ' చేయాలి.

దైవ సాన్నిధ్య భావానికి బదులుగా పూజలో మనం ఆలోచనల మీదనే ధ్యాసపెట్టడం వలన ఆలోచనలు వస్తున్నాయి. దీనికి కారణం ఆలోచనపై కలిగే ఇష్టమే. ప్రతి అభ్యాసీ పూజలో కూర్చున్నప్పుడు 'వారి' (దైవం) సాన్నిధ్యం కోసం ఎదురు చూస్తాడు. కాని 'వారి' సాన్నిధ్యాన్ని పొందలేకపోతున్నాడు. ఎందుకంటే, తన ఆలోచనల్లో తాను ఉండిపోయి, అటూ ఇటూ (చెదరి) పోవటం వలన. బాబూజీ మాత్రం సిద్ధంగా ఉండి, ఆ అభ్యాసీ ఎప్పుడు తనపై దృష్టిపెడతాడా, అని చూస్తూనే ఉన్నారు. ఇది ఎలా ఉందంటే, బాబూజీని అతనిపై (అభ్యాసీపై) పూజ చేసేందుకు పిల్చినట్లుంది. వాస్తవంగా బాబూజీపై ధ్యానం చేసుకోవటానికి 'వారి'ని అంతరంగంలోకి తెచ్చుకోవాలి. ఈ విధంగా మానవుడు తన ఆలోచనల్లోనే మునిగిపోవటం స్వాభావికమైపోయింది.

ఒక పిల్లవాడు యువకుడైన తరువాత ఉద్యోగం కోసం తిరుగుతూ ఉంటాడు. రు. 3,000/– జీతంతో ఒక ఉద్యోగం దొరుకుతుంది. ఆ తరువాత అది చాలక కుటుంబ పోషణకని రు. 6,000/– జీతమున్న ఉద్యోగం కోసం వెదుకుతూ బాధపడతాడు. అతడి తండ్రీ అదే విధంగా ఈ జీతంతో తన బిడ్డ కుటుంబాన్ని ఎలా పోషించగలడా, అని బాధపడతాడు.

కనుక మానవుడు ఇలాంటి ఆలోచనలతో, బాధలను పెంచుకు పోతాడు. అందుచేత ఆంతరికంగా మన దృష్టి మరల్చుకోవటం మంచిది. అంతరంగంలో 'వారి'ని ఇంకా ఇంకా పొందటం ఉత్తమోత్తమమైనది.

మాటల్లో అందరూ జ్ఞానులే కాని చేతల్లో కాదు, అని తమాషాగా అనేవారు బాబూజీ.

**ప్రశ్న: ఆలోచనలు రాకుండా మనస్సును ఎలా కట్టడి చేయాలి?**

**సోదరి:** మనస్సును అంతరంగంలోకి పూజ (ధ్యాన) విధానం ద్వారా తీసుకొని వెళ్ళవచ్చు. ఈ విషయమై బాబూజీ ఇలా అనేవారు– హృదయం, మనస్సు సన్నిహిత మిత్రులు. ఎంతగానంటే, హృదయమనే ఆటస్థలంలో మనస్సు ఆడుకుంటుంది. కాని మనం వాటిని విరోధులుగా చేశాం.

మన హృదయానికి, మనస్సు మంచి మిత్రురాలని పదే పదే సూచనలు ఇవ్వడం ద్వారా వాటి మధ్య విరోధ భావం తగ్గిపోతుంది. అవి మిత్రులైనప్పుడు ఆ సమస్య (ఆలోచనల సమస్య) తీరిపోతుంది.

**ప్రశ్న: మనస్సును, హృదయాన్ని దగ్గరగా చేర్చిన తరువాత ఏమిటి?**

**సోదరి:** ఇవి దగ్గరైన తరువాత (సోదర) స్నేహ భావం ఏర్పడుతుంది. కాని వీటి మిత్రత్వం నిలబెట్టడం చాలా కష్టం. ఎందుకంటే, స్నేహం త్యాగం కోరుతుంది.

బాబూజీ ఎంతో మంచివారని అనుకుంటాము. తరువాత ఒక కార్పెట్‌ను చూసి –ఇది చాలా మంచిగా బాగుంది అన్న ఆలోచన వస్తుంది. అప్పుడు హృదయానికి మిత్రురాలైన మనస్సు ఇలా అడుగుతుంది: "ఇంతకుముందే ఒకరికి మనస్సు ఇచ్చావు, మంచివారని అన్నావు. ఇప్పుడు ఈ కార్పెట్‌ను చూసి ఇదీ

బాగున్నదని ఎలా అంటున్నావు", అంటూ ఈ విధంగా మన మనస్సు, మన ఆలోచనలను సరి చేస్తుంది.

**ప్రశ్న: వ్యక్తిగత సిట్టింగ్స్, సత్‌సంగ్‌లలో వారి స్థాయి (కండిషన్) ఎలా తెలుసుకోవటం?**

**సోదరి:** మనం ధ్యానంలో ఉన్నప్పుడు, సహజంగా వాటి పని చూసుకునే జ్ఞానేంద్రియాలతో చూస్తే తేలికదనం ప్రశాంతతల భావన అనుభవ మవుతుంది. ఇంకా ఆ స్థాయి తెలుసుకోవాలంటే, ఆ స్థితిలో పూర్తిగా మునిగిపోవాలి. ప్రతిసారి మనం చేసే ధ్యానంలో బాబూజీ మనకు కృపాదానం చేస్తారు. ఈ కృపాదానములే వారు ఇచ్చే స్థితులు.

బాబూజీ ఒకసారి ఒక అభ్యాసీని సిట్టింగ్ తరువాత అతడిని, అతడి స్థాయిని పరిశీలించుకుని చెప్పమన్నారు. దానికి సమాధానంగా ఆ అభ్యాసీ "అంతా బాగుంది" అన్నాడు.

"అది సరే! అంతా బాగున్నదన్నదని నాకు తెలుసు. నీవు బాగున్నావు. నేను బాగున్నాను. ఈ గది బాగుంది. ఈ బాగుండటానికి కారణమైన విషయం ఏమిటి?" అని బాబూజీ అడిగారు.

కాబట్టి ప్రతిసారి మనం చేసే ధ్యానంలో బాబూజీ సాన్నిధ్య స్థితిని పొందుతాము. ఆ స్థితిలో మునిగిపోతాము. అప్పుడు, ఈ తరువాత స్థాయిల అనుభూతి కూడా లభిస్తుంది.

**ప్రశ్న: సెయింట్, ఋషిలకు గల తేడా ఏమిటి?**

**సోదరి:** సెయింట్‌కు 'శక్తులు' ఉంటాయి. కాని అవి (మోడరేట్) సమభావ స్థితిలో ఉంటాయి. సెయింట్‌కు తను పొంది ఉన్న శక్తులను గురించి తెలియదు. దైవం నుండి ఆజ్ఞ రాగానే ఉజ్జీవం అవుతాయి అవి.

ఇందుకు బదులుగా ఋషివద్ద ఏ శక్తులూ లేవు. క్రమత్వం, అదుపు అన్నవీ ఉండకపోవచ్చు.

**ప్రశ్న: ప్రార్థన ఎలా చేయాలి?**

**సోదరి:** కేవలం మాటలతో ప్రార్థన చెప్పటం కాదు. హృదయాంత రాళంలో నుండి అది వ్యక్తం కావాలి. అస్వస్థతగా ఉన్న బిడ్డ గురించి తల్లి హృదయంలో నుండి, దానికదే బయటికి దుమికేదే ప్రార్థన. బయటకు చెప్పేదంతా అంతరంగం నుండి గాఢమైన భావరూపంగా రావాలి –ఇది ప్రార్థన అంటే.

ప్రార్థన బాబూజీ మహరాజ్‌తో యోగం (కలయిక) కోసమే జరగాలి.

మన సంస్థ యొక్క ప్రార్థన పూర్తిగా దివ్యశక్తితో నింపబడింది. ఈ ప్రార్థన భావాన్ని అర్థం చేసుకుని అదే భావస్థితిలో ఉంటే అమోఘంగా ఉంటుంది. అర్థం గ్రహించకుండా, ఆ భావస్థితిలోనూ లేకుండా ప్రార్థన వల్లించుకుంటే, ఎంతవరకు అణకువగా ఉంటావో అంతే ఫలితాన్ని పొందుతావు. వినమ్రత, నివేదనలతో బాబూజీ ముందు అర్పించుకునే భావాన్ని పెంపొందించుకునేదే ప్రార్థన.

భౌతిక సమస్యలు, విషయాలు గురించి ప్రార్థనలో పరిష్కారం కోసం సర్వం వారికి నివేదించుకోవాలి. చేయదగిన విధంగా 'వారు' చేస్తారు. అందుచేత ఆ సమస్యల పరిష్కారం గురించి మన ప్రార్థనలో వత్తిడి చేసే ప్రమేయం ఉండరాదు.

**ప్రశ్న: సంస్కారాల నిర్మలీకరణ ఎలా?**

**సోదరి:** సంస్కారాలు భోగింపబడాలి. అనుభవింపబడాలి.

సంస్కారాలు కూడా ఏదో ఒక విధంగా నిర్మలీకరిస్తే (పోగొడితే) ఈ భోగాలన్నీ (సదుపాయాలు, సుఖాలు) వాటంతటవే నశించిపోతాయి. అప్పుడు ఈ భోగాలన్నీ ఊహల్లోనే ఉంటాయి. మనం దైవంలో కరిగిపోయినప్పుడు మాత్రమే సంస్కారాలు, మాలిన్యం కూడా కరిగిపోతాయి. బాబూజీ కృప, దయాగుణాల వల్లనే అవి అలా కరిగిపోతాయి.

లయావస్థ కోసం 'వారి'తో అనుసంధానించుకున్నప్పుడు ఆనంద ప్రశాంతతలు, ఆరోగ్యాదులు మాత్రమే మిగిలి ఉంటాయని అనుకోరాదు. భోగించవలసినది ఈ భూమి మీదనే, కర్మలు అనుభవించవలసినదీ ఈ భూమి మీదనే. కనుక ఈ భూమితో మనకు సంబంధం ఉన్నంతవరకు ఈ సంస్కారాలన్నీ మనం అనుభవించటం కోసం, అవి మనల్ని అంటిపెట్టుకునే ఉంటాయి.

మన సంస్కారాల్ని మనం తుడిచేసుకోవచ్చుగాని మన కుటుంబంలోని వారి సంస్కారాలను (భరించి) ఓర్చుకోవాల్సిందే. ఎలాగంటే – కుటుంబంలోని ఒక వ్యక్తి అనారోగ్య బాధకు స్పందించి మనం బాధపడతామే అలాగన్నమాట.

**ప్రశ్న: యూనివర్సల్ ప్రేయర్ (విశ్వవ్యాప్త ప్రార్థన) ఎలా చేయాలి?**

**సోదరి:** అన్ని ప్రార్థనలు ఆయా పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. విశ్వప్రేమ నీలో లుప్తమైనంత (లేనంత) కాలం నీవు ఆ ప్రార్థన చేయలేవు, 'వారి'కి అది చేరదు. విశ్వవ్యాపియైన 'వారు' ఒక్కరే విశ్వవ్యాప్త ప్రార్థన చేయగలరు. ఇంకా చెప్పాలంటే విశ్వప్రేమ లేనివాడు విశ్వవ్యాప్త ప్రార్థన ఎలా చేయగలడు (చేయలేడు).

ఈ సందర్భంలో బాబూజీ మహరాజ్ వివరణ వినండి. మానవాళి నంతటినీ ఆది తత్వానికి చేర్చేందుకే 'తాను' వచ్చాననీ, అందుకుగాను దైవానికి వినమ్రులై మానవులందరూ అనంత తత్వానికి చేరే కార్యాన్ని నెరవేర్చండి – అన్నారు.

ఇక్కడ ఉన్న చెత్త చెదారాన్ని ప్రోగు చేయాటానికి పైనుండి దిగి వచ్చిన బ్రహ్మాండమైన క్రేన్‌లాగ ఉంది ఇది. అలాగే మానవాళిని ఆది తత్వానికి (తొలి స్థితికి) తిరిగి తీసుకొని వెళ్ళటానికి అనంతం నుండి మార్గదర్శకులుగా దిగివచ్చారు బాబూజీ.

**ప్రశ్న: బాబూజీకి కృతజ్ఞతలు ఎలా చెప్పాలి?**

**సోదరి:** సమున్నతులైన పెద్దలకు వట్టిమాటలతో కృతజ్ఞతలు అందించకూడదు. వినయంతో మనల్ని మనం అర్పించుకోవటం ద్వారానే కృతజ్ఞతలు చెప్పుకోగలం. అనంతం నుండి బాబూజీ మహరాజ్ మన కోసం వచ్చారు కాబట్టి మన ప్రాపంచిక కార్యాలన్నీ చూసుకుంటూనే అనుక్షణం మనల్ని మనం (మన హృదయాన్ని) 'వారి'కి అర్పించుకుని కృతజ్ఞతాభావాన్ని చూపవచ్చు.

'వారి'కి ఎందుకు ఋణపడి ఉన్నామోనన్న జ్ఞానంలేని మనకు వినయంతో 'వారి'కి ఆత్మార్పణ చేసుకోవాల్సి ఉంది. కనుక అంత అర్పణ బుద్ధితో ఆత్మ నివేదన చేసుకోవటం ఒక్కటే 'వారి'కి కృతజ్ఞత చూపటం అవుతుంది.

**ప్రశ్న: శ్రీ బాబూజీ మహరాజ్ హుక్కా గొట్టంలో ఏదైనా రహస్యం ఉన్నదా?**

**సోదరి:** బాబూజీ అక్కడ లేనప్పుడు ఒకసారి ఆధ్యాత్మిక లాభం పొందాలని ఒక అభ్యాసీ హుక్కా పీల్చటానికి

ప్రయత్నించాడు. ఫలితంగా తీవ్రమైన దగ్గుతోను, హుక్కా గొట్టంలో నుంచి వచ్చిన నీరు గొంతుకు అడ్డంపడి ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. బాబూజీ తమ గది నుండి బయటికి వచ్చి ఆ అభ్యాసీతో "అదయ్యా! దాన్నుండి నీవు పొందింది, అంతేగా" అన్నారు హాస్యంగా.

"పెద్దల ముందు ఊరికే అలా తల వంచితే ఏమిరాదు, కాని తన్ను తాను అర్పించుకుంటే ఎంతో ఫలితం పొందుతాడు" అని బాబూజీ ఒకసారి అన్నారు.

**ప్రశ్న: ట్రాన్స్‌మిషన్ జీర్ణించుకునే సామర్థ్యం ఎలా పెంచుకోవాలి?**

**సోదరి:** మరో పొట్ట ఉంటే మరింతగా తినవచ్చు అన్నట్లు – అని నవ్వి –తపన వల్లనే ఆ సామర్థ్యం పెంచుకొనవచ్చు. తపన, సామర్థ్యం కలసే పెంపొందుతాయి.

**ప్రశ్న: శూన్యత (అభావం) అంటే ఏమిటి?**

**సోదరి:** 'నేను' అన్నది లేకపోవటమే శూన్యత (అభావం). ఇందులో 'నాది' అన్నది ఉండదు. 'నేను' అన్నదాన్ని అర్పించుకుంటే, అదే శూన్యత (అభావం).

**ప్రశ్న: ఇండివిడ్యుయల్ సిట్టింగ్, సత్‌సంగ్, ఇండివిడ్యుయల్ మెడిటేషన్‌లకు గల భేదం ఏమిటి?**

**సోదరి:** భేదం ఏమిలేదు. దాహార్తిగా ఉన్న మనిషి తన దాహాన్నిబట్టి నీటిని త్రాగుతాడు. ఎక్కువ దాహం వేస్తే ఎక్కువ నీటిని తీసుకుంటాడు. సత్‌సంగ్‌లో కాని, ఇండివిడ్యుయల్ మెడిటేషన్‌లో గాని మీ వ్యక్తిగత సామర్థ్యాన్నిబట్టే దాన్ని మీరు స్వీకరించటం జరుగుతుంది. ఇండివిడ్యుయల్ సిట్టింగ్‌లో క్లీనింగ్ (నిర్మలీకరణ) ప్రతి ఒక్కరికి విడివిడిగా చేయబడు తుంది. అయితే దాహార్తి, జీర్ణించుకునే సామర్థ్యం అతనికి గల తపనపై (గాఢమైన కోరికపై) ఆధారపడి ఉంది.

తపన, ఇష్టత, కోరిక, సామర్థ్యం –వీటిపై ఆధారపడి, ఇవి పెరిగిన కొద్దీ ప్రాణాహుతిని జీర్ణించుకోగలగడం అన్నది (పెరుగుతూ) ఉంటుంది. ఇది ఏ సిట్టింగ్‌కైనా వర్తిస్తుంది.

ప్రిసెప్టర్ వద్ద సిట్టింగ్ తీసుకునేటప్పుడు అభ్యాసీని క్షాళనచేసి అతడు ఎక్కువగా జీర్ణించుకునే సామర్థ్యాన్ని పెంపొందించే ప్రయత్నం ప్రిసెప్టర్ చేస్తారు.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీ మహరాజ్‌ను ఇండివిడ్యుయల్ సిట్టింగ్ ఒకటి ఇవ్వమని అడిగాడు. దానికి బాబూజీ సున్నితంగా స్పందిస్తూ "ఈ సంస్థలో నీవు చేరింది నీ వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోవటానికి. కాని నీవు ఇండివిడ్యుయల్ సిట్టింగ్ ఇవ్వమని అడక్కుండా నిగ్రహించుకో లేకపోతున్నావు" అని అన్నారు. శాంతి అంటే అసంతృప్తి, అసంతోషం లేనిదే – శాంతి! అప్పుడే ప్రశాంతత ఉంటుంది.

బాబూజీ మహరాజ్‌ను తప్ప అన్యము కోరనివాడే అభ్యాసీ.

సహజమార్గన్ని గూర్చి విన్నప్పుడు దాన్ని అనుసరించడం కష్టమని అనిపిస్తుంది, అని అందరూ అనుకుంటారు. కాని నేను గట్టిగా చెప్తాను, ఏమని అంటే– "మనం ఈ మార్గంలో సాధన చేస్తే అది చాలా తేలిక మరియు సులభం అనిపిస్తుంది" అని.

దేనిని అయినా తేలికగా (సులభంగా) చేయాలంటే దానిలో మనం పూర్తిగా మునిగిపోవాలి.

సహజమార్గ అభ్యాసం చాలా తేలిక, సులభం. కాని సహజమార్గ నియమాలు చదివినప్పుడు అది కష్టమనిపిస్తుంది.

**ప్రశ్న: సహజమార్గంలో లేనివారెవరైనా ప్రకృతి కార్యాలను నిర్వహిస్తున్నారా?**

**సోదరి:** ఎవరూ చేయటంలేదు, చేయలేరు. ప్రకృతి ఆజ్ఞలను ఎవరూ అర్థం చేసుకోలేరు. కాబట్టి ఇతరులు అంటే సహజమార్గంలో లేనివారు, ఆ పని చేయలేరు, చేయటం లేదు. సహజమార్గంలో బాబూజీ ఆయా పద్ధతులు చెప్పి, త్రోవచూపి ప్రకృతి కార్య నిర్వహణ చేయిస్తారు.

**ప్రశ్న: ఆధ్యాత్మికతలో పేరాశకు స్థానం ఉన్నదా?**

**సోదరి:** ఆధ్యాత్మికతలో పేరాశ బహుచెడ్డది. ప్రేమ, భక్తి వల్లనే ఆధ్యాత్మికతను పొందుతాం. పేరాశలో బంధనం ఉంటుంది.

ప్రాణాహుతి పొందటం, ఉత్తమంగా మారటం కంటే కూడా ఎక్కువమంది వద్ద ఎక్కువ సిట్టింగ్స్ తీసుకోవాలన్న తపన, ఆతృతయే పేరాశలో ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ సిట్టింగ్స్ తీసుకోవాలన్న తపన, ఆతృత – ఇది పేరాశయై బంధనంగా మారుతుంది.

ఇలాంటి పేరాశ, దురభిప్రాయం వలన అభివృద్ధి చెందకపోవటమే కాకుండా ఎంతోమంది దగ్గర సిట్టింగ్ తీసుకుంటున్నాను, అన్న అహం జనిస్తుంది. ఇలా ఈ విధంగా మారిన వ్యక్తులలో ఆధ్యాత్మికత ఏమీ ఉండదు.

పేరాశగల వానిలో ఆర్తి తీరుతుంది. తపనగల వానిలో ఈ ఆర్తి ఇంకా ఇంకా పెరుగుతుంది.

మాస్టర్ (బాబూజీ) మీద నమ్మకం ఉంచి విధేయంగా, వినమ్రంగా ఉండి, పూర్తి సహకారంతో ఉంటే, ఆధ్యాత్మికత అవసరాలకు పూర్తి బాధ్యత వహిస్తారు 'వారు'.

**ప్రశ్న: అహం యొక్క దశలను వివరిస్తారా?**

**సోదరి:** అహం యొక్క దశలలో వ్యక్తిత్వం నెమ్మదిగా కరిగిపోతుంది. దైవానికి అనుసంధానమైనప్పుడు అహం కరగనారంభిస్తుంది. నిజం చెప్పాలంటే, అహంకారంలో దశలు లేవు. ఎక్కడైతే ఆధ్యాత్మికతకు దశలు లేవో, అక్కడ 'అహం'నకు దశలు ఉంటాయి. ఎప్పుడైతే 'నేను' అన్నది కరుగుతున్న భావం కలుగుతుందో (ఏర్పడుతుందో) అప్పుడు 'అహం' దశలు కరుగుతాయి.

నేను (కస్తూరీ) వ్రాసిన క్రొత్త పుస్తకంలో 'మై'నెస్, 'ఐ'నెస్‌ల గురించి వివరించాను.

**'మై'నెస్:** ప్రాపంచిక విషయాలకు సంబంధించిన అహంకార భావ సూచన.

**'ఐ' నెస్:** ఇది దైవస్థితిలో ఆత్మ తత్వం యొక్క ఎరుకకు సంబంధించినది.

**నథింగ్‌నెస్ :** శూన్యత (అభావం). బాబూజీ మహరాజ్‌లో 'ఐ'నెస్ కరిగిపోయినప్పుడు శూన్యతే ఉంటుంది (మిగులుతుంది).

నథింగ్‌నెస్ నుండి ఈ 'నెస్'ను తొలగించినప్పుడు బాబూజీ మహరాజ్ (అనంతత్వం) మాత్రమే మిగులుతారు.

ధ్యానంలో లోతుగా వెళ్ళినప్పుడే నిజమైన ఆనందం కలుగుతుంది. ఆనందం అంటే ఏమిటి అనేది స్థితిలో మునిగినప్పుడు తెలుస్తుంది. బాబూజీ చెప్పింది ఏమిటంటే, సహజమార్గ సిస్టమ్ అంటే మరేదో కాదు, ఎలా జీవించాలో తెలుసుకోవటమే.

**ప్రశ్న: తురీయ స్థితి పొందాలంటే సహజంగా వస్తుందా? లేక సాధన చేయాలా? దేనికొరకు?**

**జవాబు:** నీవు ఇక్కడకు (లక్నోకి) వచ్చేటప్పుడు రైలు టిక్కెట్ కొనుక్కొని రైల్లో కూర్చుంటే మధ్యలో ఉన్న అన్ని స్టేషన్లు నీ ప్రమేయం లేకుండా యాంత్రికంగానే వస్తుంటాయి. అన్ని స్టేషన్లు దాటి నీ గమ్యస్థానం చేరుతావు. అలాగే ఆధ్యాత్మికతలో సాక్షాత్కారం పొందాలంటే భక్తి అనే టిక్కెట్ కొనుక్కోవాలి. భక్తి ఉంటే సాక్షాత్కారం వస్తుంది. ఆధ్యాత్మికత పొందటం అనేది చాలా కష్టమైనది. భక్తి ఉంటే పని చాలా సులభమై పోతుంది.

మనం మంచి చెడులను ఒకటిగా చూడటం అలవాటు చేసుకోవాలి. ఎవరైనా చెడుపనులు చేస్తున్నప్పుడు, చెడుగా అనిపిస్తే వారికి చెప్పవచ్చు. అంతేకాని వారు చెడు చేస్తున్నారని ద్వేషభావంతో చూడకూడదు. అలా చెడుభావనను మన మనస్సు వరకు రానివ్వకపోతే ఎదుటివారిలో కూడా పరివర్తన వచ్చి మంచి వైపుకు మరులుతారు.

అది చదువు, ఇది చదువు అని చెప్తుంటారు. చదవటంవలన భక్తి పెరగదు. భక్తి వల్లనే 'వారు' మనలో ప్రవేశిస్తారు. 'వారి' ప్రవేశం వల్లనే మనలో పరివర్తన వచ్చి మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతాము. 'వారు' మన హృదయంలో ప్రవేశించి ఒక చిత్రకారుడు ఒక చిత్రం తనకు నచ్చిన విధంగా ఎలా దిద్దుకుంటాడో బాబూజీ మనలను అలా మలచుకుంటారు. మనకు తెలియకుండానే మన ప్రవర్తనలో మార్పు వస్తుంది.

ఆశ్రమ భవనం నుంచి వెళ్ళగొట్టవచ్చునుగాని బాబూజీ హృదయమనే ఆశ్రమం నుంచి ఎవ్వరూ వెళ్ళగొట్టలేరు. అందువలన ఆశ్రమం అనేది 'వారి' హృదయంలోనే వుంది. ఆత్మ సాక్షాత్కారం అనగా మనం ఏ పని చేస్తున్నా, ఎవ్వరితో మాట్లాడుతున్నా నేను మాట్లాడుతూ ఉన్నాను, నేను చేస్తున్నాను అనుకుంటాము. అలాకాక ఆత్మ సాక్షాత్కార దశ చేరేటప్పటికి 'నేను' స్థానంలో 'బాబూజీ'యే (దైవమే) ఆ పనులు చేస్తున్నట్లు, 'వారే' ఆ స్థానంలో మాట్లాడుతున్నట్లు, అంతటా 'వారే' ఉన్నట్లు అనుభూతి కలుగుతుంది. ఆ స్థితియే ఆత్మ సాక్షాత్కారం! ఆత్మ సమర్పణ వలన ఆత్మ సాక్షాత్కారం లభిస్తుంది. "మీరు ఎల్లప్పుడు నాతోనే ఉండాలి" అని బాబూజీని ప్రార్థించాలి. 'వారు' మనతోనే ఉన్నప్పుడు మన మనస్సు చెడువైపుకు మరలదు.

అలా ఎందుకు చేశాము? ఇలా ఎందుకు చేశాము? అలా చేయవలసింది కాదు, అని పదే పదే బాధపడుతూ ఉండటం వలన మన హృదయం ప్రభావితం అవుతుంది. అందువలన మనం మళ్ళీ అలాంటి పని చేయకుండా ఉండాలని బాబూజీని ప్రార్థించుకొని ఇంక ఆ విషయం వదలివేయాలి. అలాంటప్పుడు మన స్థితి వికలం అవకుండా ఉండాలని ప్రార్థన చేసుకోవాలి.

బాబూజీ చెప్పేది ఏమంటే "నీవు సహజమార్గ సిస్టమ్‌లో చేరావు" అని. సహజ సిద్ధంగా అంటే – మొదటిది – నీలో భగవంతుడు ఉన్నాడని నీవు అనుభూతి చెందినప్పుడు, రెండవది – మన ఈ విధానంలో సోదరభావం పెంపొందాలి అని. బాబూజీ ఆశీర్వాదం వలన మనలో సోదరభావం పెంపొందుతుంది. బాబూజీ చెప్పారు–"నేను సోదరభావం అనే దానితోనే సహజమార్గ విధానానికి జీవం ఇచ్చాను" అని.

మనం సాధనను నిజమైన మార్గంలో చేస్తుంటే దశ నియమాలు మనకు తెలియకుండానే మన ఆచరణలోకి వస్తాయి. ఈ దశ నియమాలలోగల స్థితులను నీవు అనుభూతి చెందుతావు. కేవలం ఆచరణవలన ఈ దశ నియమాలను పాటించటం ఏ ఒక్కరికీ సాధ్యం కాదు. సాధనలో ఇవన్నీ నీ ఆచరణలోకి రావటం నీవు చూస్తావు.

సిట్టింగ్ అంటే ఆ భగవంతుని నీలోనికి ఆహ్వానించి, ఆ భగవంతునితో కలసి కూర్చోవటమేనని అర్ధం. కనుక ఆ ఈశ్వరునితో కలసి కూర్చోవాలి. అప్పుడే నీకు ఆ దివ్యత్వం లభిస్తుంది.

నీవు నిజమైన అభ్యాసీగా జీవించు. నీ దృష్టి అంతా ఆ దివ్యత్వం మీదనే ఎల్లప్పుడూ ఉంచాలి. అప్పుడే నీవు నిజమైన సహజమార్గ అభ్యాసీవని అనిపించుకుంటావు. బాబూజీ యొక్క ఆశీర్వచనం ఇప్పుడు ఇక్కడ ఒక వర్షంలాగా కురుస్తున్నది. 'వారు' మనకు, మన ఆధ్యాత్మిక పురోగతికి కావలసినదంతా ఇచ్చారు. మనం చాలా శ్రద్ధగా ఉండాలి. మనం దేనిని గురించి ఎటు వెళ్ళినా మన హృదయాన్ని మాత్రం సహజమార్గంవైపు త్రిప్పుకోవాలి. ఇదే నిజమైన అభ్యాసీ చేయవలసిన పని!

ఆధ్యాత్మికత అనేది స్వాగతవచనాలతో వచ్చేది కాదు. ఆధ్యాత్మికత – ఆ భగవంతుని కలవాలని మనం పడేబాధ, తపన వలన మాత్రమే వస్తుంది అన్నారు బాబూజీ.

"ఆధ్యాత్మికత ఉత్సవంలో అభ్యాసులందరూ ఒకచోట చేరి, ధ్యానం చేయటం వలన నేను అనంతం నుండి శక్తిని ప్రసారం చేస్తాను. అందువలన ఉత్సవం జరిగే ఆ మూడు రోజులు అభ్యాసులందరూ ఆధ్యాత్మిక ఆవరణచేత కప్పబడి ఉండటం, ఆ తరువాత రోజుల్లో అది లేకపోవటం నీవు చూశావు" అని బాబూజీ చెప్పారు.

వసంత పంచమి ఉత్సవంలోను, ఏప్రియల్ 30 – బాబూజీ జన్మదిన ఉత్సవాలలోను అభ్యాసీలు తమను తాము మరచిపోయేవారు. 'నేను' అనే భావన అభ్యాసీలలో దానంతట అదే మాయమైపోవటాన్ని నేను చాలాసార్లు గమనించాను. ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! మేము షాజహాన్‌పూర్‌లో మీ వద్దకు వచ్చినప్పుడు, ఇక్కడ మాకు చాలా ఆనందంగా, ప్రశాంతంగా వుంటుంది. ఇటువంటి స్థితి మాకు, ఇంటి వద్ద ఎందుకు కలగటం లేదు?' అని అడిగారు. అప్పుడు బాబూజీ – "ఇక్కడ 'నేను', 'నీవు' వేరే వేరే అనే భావన నీలో లేదు. మీ ఊరిలో – ఇది నా ఇల్లు – అక్కడ షాజహాన్‌పూర్‌లో అది బాబూజీ ఇల్లు అని భావించుకొని నేను వేరు, నీవు వేరు అనే బేధభావనలో ఉన్నావు. అందువలన నీకు అక్కడ మీ ఊరిలో ఈ ఆనందం, శాంతి కలగటం లేదు" అని అన్నారు. ధ్యానం చేయటం వలన వారి యొక్క సామీప్యత ఏర్పడి మీకు దానంతట అదే పూర్తి ఫలితం లభిస్తుంది. సత్సంగ్ అంటే సత్ + సంగ్ అనగా మనం దైవం యొక్క చరణాలను పట్టుకున్నామని అర్ధం. అనగా మనం ఎల్లవేళలా 'వారి' శరణులోనే ఉన్నాము, 'వారు' ఎల్లవేళలా మనతోనే ఉన్నారు అని అర్ధం. సామీప్యతా ఫీలింగ్ ఎంత ఎక్కువైతే అంతగా మీలో ప్రేమ, భక్తి,

వైరాగ్యం మరియు 'వారి'తో కనెక్షన్ అనేది అంతగా ఏర్పడుతుంది. ఇక్కడ మీరు ఏ విధంగానైతే సత్సంగ్‌లో ఉన్నారో, మీ ఇంటి వద్ద అదే విధంగా, బాబూజీలో ఉండి, 'వారి' (నియర్‌నెస్) సాన్నిధ్యతలో మునిగిపోయి ఉండటానికి ప్రయత్నించాలి.

చంటిపిల్లలు ఊహించలేరు. పెద్దలం మనం ఏదైనా ఊహించి మాట్లాడుతాము. ఈ ఊహ అనేది, మనలోపల దైవం (బాబూజీ) ఉన్నాడని అనుకుంటూ ఉంటే, 'వారి'లాగ ఉన్నతంగా ప్రవర్తిస్తూ ఉంటే 'వారి'తో మనకు సంబంధం ఏర్పడుతుంది. మన భావనలో అలా 'వారి'నే ఊహించుకుంటూ 'వారి' కొరకే 'తపన' చెందుతూ ఉంటే, మన శరీరం అక్కడ ఉంటుంది కాని మనం ఉండము. నోరు మెదుపుతూ ఉంటాము కాని, హృదయం 'వారి' కొరకే తపిస్తూ ఉంటుంది. ఇది అన్నింటినీ మించిన మంచి పద్ధతి. అధ్యాత్మికత అనేది అసలు ఈ తపనలోనే ఉంది. ఈ విధంగా దైవాన్ని నీవు చూడక పోయినప్పటికీ దైవాన్ని ఊహంచుకోవటం ద్వారా (కల్పనలో ఉన్నాడని అనుకోవటం ద్వారా) 'వారి'ని పొందటానికి తపన వృద్ధిచెందుతుంది. ఆ తపనతో దైవాన్ని దర్శించగలుగుతాం, ఆనందం కలుగుతుంది.

ప్రాపంచికంగా ప్రయాణించటమంటే మనకు ధనం, వాహనం టికెట్టూ అవసరమవుతాయి. కాని ఆధ్యాత్మిక ప్రయాణానికి ఇవేమీ అవసరం లేదు. నమ్మకం కావాలి. "మీరు లేకుండా నేను జీవించలేను బాబూజీ" అని 'వారి' వద్ద నుంచి అభ్యాసీ తిరుగు ప్రయాణమవుతుంటే "స్మరణ వెంట తీసుకువెళ్ళు, నిన్ను మాత్రం నా వద్ద వదలి వెళ్ళు" అన్నారు బాబూజీ. కనుక భౌతికరూపం కాకుండా స్మరణపైన ధ్యాస ఉండాలి. "బాబూజీ! నేను మీవాడిని, అన్నింటికి బాధ్యత మీదే" అన్నట్లుగా అర్పించుకోవాలి.

మీరా, కబీరుదాసు, సూరదాసు లాంటి వారు వారి యొక్క స్వయంకృషితో ఎంతో కష్టపడి వారున్న స్థితికి చేరుకున్నారు. అలా కాకుండా, బాబూజీ తమ సంకల్పంతోనే మనకు అన్నీ ఇస్తున్నారు. అందువలన మనం ఎంతో అదృష్టవంతులము.

దగ్గర బంధువులతో ఎవరితోనైనా సరియైన సంబంధాలు లేకపోయినప్పటికీ వాటిని తరువాత సరిచేసుకోవచ్చు, అంతేకాని ఫంక్షన్లకు ఆహ్వానించటం మానివేయకూడదు. మనం ఎల్లప్పుడు నిరంతర స్మరణతో ఉండి, ఎవరితోను చెడుగా మాట్లాడకూడదు, చెడుగా ప్రవర్తించకూడదు. ఒకవేళ ఏదైనా బాధాకరంగా మాట్లాడవలసి వచ్చినా ఎదుటివారి హృదయానికి గుచ్చుకొనేలా మాట్లాడకూడదు. బాబూజీని మన హృదయంలో నింపుకోవటం ద్వారా మనం మన ఆవేశ ఉద్రేకాలను కంట్రోలు చేసుకోవచ్చు.

బ్రహ్మవిద్య ఒకరు నేర్పించేది కాదు. ఒకరి హృదయం నుంచి ఇంకొకరి హృదయానికి వ్యాపించేది అది.

ఏ విషయమైనా అవతలివారి హృదయం బాధపడేలా పదే పదే చెప్పకూడదు. ఒకసారి చెప్పి వదిలి వేయాలి. మనకు ఎప్పుడైనా కోపం వచ్చినప్పటికి బాబూజీ యొక్క నిరంతర స్మరణలో ఉండటం వలన ఆ కోప తీవ్రత తగ్గుతుంది. ఎదుటివారిలో ఏదైనా విషయం మనకు చెడుగా అనిపించినప్పటికి ఆ విషయం పదే పదే వారితో అనకూడదు. అలా అనటంవలన ఆ విషయం మన హృదయాన్ని లోతుగా తాకుతుంది. ఒకసారి చెప్పి వదిలివేయాలి.

**దర్శన్:** ఇది సాక్షాత్కారానికి మొదటి స్థితి. ఈ స్థితిలో 'వారు' నా ముందే ఉన్నారు, ఒక దివ్యాభరణం భూమా నుంచి దిగివచ్చినట్లు. కాని నా హృదయంలో ఎలా అనిపిస్తుందంటే, సార్వభౌమాధికారి దిగివచ్చి హృదయంలో ఉండి మీకు శాంతి, బ్రహ్మానందం ప్రసాదిస్తున్నట్లు. ఇదే రియలైజేషన్ యొక్క స్థితి. నిన్ను నీవు మరిచిపోయే స్థితికి వచ్చావంటే, నీవు రియలైజేషన్ యొక్క రెండవ దశకు వచ్చినట్లు. నీ హృదయంలో 'వారి'యొక్క ప్రవేశాన్ని స్వాగతించటం ద్వారా ఈ స్థితి ప్రాప్తిస్తుంది. ఇది అందరికి చెందినది.

**ప్రశ్న: (Grace) కృపకు మరియు (Radiation) వ్యాపకానికి గల భేదం ఏమిటి?**

**జవాబు:** కృప (Grace) అనేది పైనుంచి వస్తుంది, దానిని జీర్ణించుకున్న వ్యక్తి, తాను ఎక్కడికి వెళ్ళినప్పటికి దానిని (Radiation) వ్యాపింపజేస్తాడు.

**ప్రశ్న: ధ్యానం చేసే సందర్భంలో, కొందరు అభ్యాసుల శరీరాలు నేలను తాకేటంతగా వంగుతాయి, ఎందుచేత?**

**జవాబు:** అది వారి అలవాటు. అటువంటివారు గోడకు సమీపంలో కూర్చుని నిటారుగా కూర్చోవాలి. ధ్యానంలో వారు అలా ముందుకు వంగిపోకుండా సక్రమంగా కూర్చోవటమే సరియైన విధానం. వారు శరీరాన్ని బలవంతంగా అరికట్టకూడదు.

ఒకసారి ప్రముఖగాయని లతామంగేష్కర్ యొక్క పాట రేడియోలో ప్రసారమవుతుండగా, బాబూజీ నన్ను, నాతో ఉన్న ఇతరులను ఆ పాడుతున్న ఆమె ఎవరు? అని అడిగారు. ప్రతి ఒక్కరూ ఆమె లతామంగేష్కర్ అని, ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతినందిన భారతీయ గాయకురాలు అని చెప్పారు. అప్పుడు బాబూజీ వెంటనే, "ఆమె గాత్రంలో ఏముంది? ఆఖరికి నా కుమార్తె కస్తూరీ ఆమెను సులభంగా ఓడించగలదు" అన్నారు. ప్రతి ఒక్కరూ ఆ మాటలకు విస్తుపోయి ఆ తర్వాత బాబూజీ ఇంకా ఏమి చెబుతారోనని ఎదురు చూస్తున్నారు. అప్పుడు బాబూజీ, "ఈ ప్రపంచంలోని రాగాలు అన్నీ నాకు తెలుసు. కస్తూరీ పాడుతున్నప్పుడు గనుక నేనొక బిందువును స్పర్శిస్తే, ఆ రాగం యొక్క ప్రభావాన్ని వింటున్నవారు అనుభూతి చెందుతారు" అన్నారు.

తెలివితేటలు అనేవి ఖర్చు చేయటంలో ఉండాలి గాని సంపాదించటంలో కాదు.

ప్రకృతికార్యం చేసే కార్యకర్తలు ప్రతిచోటా ఉన్నారు. వాళ్ళు ప్రిసెప్టర్లుతోపాటు అభ్యాసులను కూడా సంరక్షిస్తూ ఉంటారు. ఒకసారి శ్రీకాశీరామ్ అగర్వాల్ షాజహాన్‌పూర్ నుంచి డిల్లీ వెళ్తున్నారు. ఆయన కొద్ది రోజులు ముందు బాబూజీ ద్వారా షాజహాన్‌పూర్‌లో ప్రిసెప్టర్‌గా చేయబడ్డారు. డిల్లీ రైల్వేస్టేషన్‌లో ఒక అపరిచిత వ్యక్తి ఆయనను సమీపించి, తన సామానులు భద్రంగా ఉండటానికి సహాయపడగలరా అని అడిగాడు. శ్రీ కాశీరామ్ ఆ విధంగా అడిగిన వ్యక్తిని అర్థంచేసుకునే స్థితిలో లేరు. కాశీరామ్‌గారు సందిగ్ధంగా ఉండిపోయిన ఆ సందర్భంలో, బాబూజీ నుంచి ఆ అపరిచిత వ్యక్తికి ఆజ్ఞ వచ్చింది, ఏమని అంటే, "అతడు నా ప్రశిక్షకుడు. నీవు అతనికి రక్షణ కల్పించు" అని. బాబూజీ తన అభ్యాసులపట్ల, ప్రశిక్షకులపట్ల వర్షింపజేసే కృప ఆ విధంగా ఉంటుంది.

**ప్రశ్న: ధ్యానం జరిగేటప్పుడు, మనం ఒక నిశ్చలత మరియు శాంతిని అనుభవిస్తూ ఆ స్థితికి సంతోషపడతాం. అది సరైనదేనా?**

**జవాబు:** ఇది ఒక నిశ్శబ్ద దశ. అది సంతోషదాయకంగా ఉంటుంది. అయితే అభ్యాసులు ఆ స్థితిలో సంతృప్తి చెంది సంతోషపడరాదు. వారు ఆ సమయంలో బాబూజీని ఆలోచనలో పెట్టుకుని ఉన్నత దశల కొరకు తపన చెందాలి. మనం కనుక సరియైన లక్ష్యాన్ని గురిపెట్టుకుని దాని కొరకు పాటుబడితే, బాబూజీ తప్పకుండా మనల్ని ఉన్నత దశకు చేర్చుతారు. ఆ దశ ఆనందంగా ఉంటుంది కనుక, చాలామంది అక్కడే ఉండిపోవాలని అనుకుంటారు.

**ప్రశ్న: నేనయితే బాబూజీని భౌతికంగా చూడలేదు కాని, సాధన సమయంలో నేను బాబూజీ నుంచే ఆధ్యాత్మిక లబ్ధి పొందుతున్నట్లుగా అనిపిస్తుంది; అది ఎలా?**

**జవాబు:** నీవు బాబూజీని భౌతికంగా చూడలేదు. కాని నీవు సహజమార్గ సత్సంగ్‌లలో పాలుపంచుకుంటున్నావు. మరి సత్సంగ్‌లో బాబూజీ నిన్ను పరిశీలిస్తున్నారు. నీవు బాబూజీని నీ మానసంలో చూస్తున్నావు. 'వారు' అక్కడ ఉండి, నీ అవసరాలను తీరుస్తున్నారు. బాబూజీ అభ్యాసులందరి క్షేమం చూస్తుంటారు.

**ప్రశ్న: ఎవ్వరైనా గాని ప్రాణాహుతి యొక్క పరిపూర్ణ ప్రభావాన్ని ఎప్పుడు అనుభూతి చెందుతారు?**

**జవాబు:** మన అహం నశించినప్పుడు, ప్రాణాహుతి ఒక కాంతిపుంజం లాగా కనిపించి అదృశ్యమవుతుంది. ఈ అహం మూలంగానే సంస్కారాలు ఏర్పడతాయి.

**ప్రశ్న: బెహెన్‌జీ! లక్నోలో బాబూజీ జన్మదిన శతాబ్ది సందర్భంగా, అక్కడ హాజరైన 900 మంది అభ్యాసులందరికి కూడా బాబూజీ విముక్తి దశను అనుగ్రహించారని మీరు ప్రకటించి ఉన్నారు.**

**జవాబు:** లక్నోలో, విముక్తి మార్గం తెరవబడింది కనుక అభ్యాసులు అందరూ బాగా ధ్యానం చేసి ఆ దశను పొందాలని కోరటం జరిగింది.

**ప్రశ్న: "వారు అందరినీ ప్రేమిస్తారు" అను ఆంగ్ల పుస్తకం యొక్క 50వ పేజిలో, ఒక రేఖా చిత్రం జత చేయబడింది. ఆ పటంలో హృదయ మండలానికి, మనో మండలానికి మధ్యన ఒక విరామం (ఖాళీ-1), మనో మండలానికి దైవానికి మధ్య రెండవ విరామం (ఖాళీ-2) చూపబడ్డాయి. ఆ విరామాలు (ఖాళీలు) ఎందుకు ఉన్నాయి? ఆ ఒకటి, రెండవ విరామాల పనితనం ఏమిటి?**

**జవాబు:** మొదటి విరామం (ఖాళీ-1) -మనోమండలం యొక్క శక్తి ఆకర్షించి, ప్రాణాహుతి దిగువ ప్రాంతాలకు వస్తుంది. రెండవ విరామం (ఖాళీ-2) కూడా అదే పని చేస్తుంది. ఈ ఖాళీలు ప్రాణాహుతి ప్రయోజనం కొరకు మాత్రమే.

**ప్రశ్న: మన పురోగతికి ప్రిసెప్టర్లు అవసరమంటారా?**

**జవాబు:** అవసరమే. ప్రతి దశలోను వారు అభ్యాసీలపట్ల ప్రేమను కల్పించుకుని ఉన్నతికి మార్గదర్శనం చేస్తారు. ప్రిసెప్టర్లు కనుక స్వయంగా ఆ దశలను అనుభూతి చెంది ఉంటే అవి సంభవమవుతాయి.

ప్రిసెప్టర్లుకు ఇచ్చిన శక్తిని కనుక వారు జీర్ణించుకుని, వాటి మీద ఆధిపత్యం కలిగి ఉండనంతవరకు వారు ప్రిసెప్టర్లు కాలేరు.

నేను (కస్తూరీ బెహెన్) బాబూజీ ద్వారా ప్రిసెప్టర్ అయినపుడు, నేను ఒక ప్రిసెప్టర్ అను అనుభూతియే కలుగలేదు. అలా మూడు సంవత్సరాలు గడిచాక, నేను ఒక ప్రిసెప్టరును అను అనుభూతి కలిగింది. బాబూజీ ఇచ్చిన శక్తిని జీర్ణించుకోవటానికి నాకు మూడు సంవత్సరాలు పట్టింది.

ప్రతి ఒక ప్రిసెప్టర్, శక్తి యొక్క ఒక చిన్న కేంద్రానికి అనుసంధానించబడతాడు. ఈ చిన్న కేంద్రం ఒక పెద్ద కేంద్రంతో అనుసంధానించబడి ఉంటుంది. ఒక ప్రిసెప్టర్ అభ్యాసులకు ప్రాణాహుతి నివ్వతలపెట్టినప్పుడు, అతడు అనుసంధానించబడిన కేంద్రం నుంచి శక్తి ప్రవహిస్తుంది. ఒకవేళ, అతడు ఆ చిన్న కేంద్రాన్ని స్వాధీనంలో ఉంచుకొనగలిగినట్లయితే, అతడు వెంటనే లోపలి మరొక పెద్ద కేంద్రంతో అనుసంధానించబడతాడు.

అదే విధంగా, చక్రాల విషయంలో కూడ, ఒక చక్రం కనుక విచ్చుకున్నట్లయితే, భగవంతుని కోసం తపన పెరుగుతుంది. తత్ఫలితంగా మరొక చక్రం విచ్చుకుంటుంది. ఎవ్వరైనా గాని ఈ శక్తులను భౌతిక పరమైన అద్భుతాలు సాధించటానికి ఉపయోగించినట్లయితే అతడింక ఉన్నతి పొందలేడు.

అదే విధంగా ఎవరైతే (Re – Presents) తిరిగి ఇవ్వగలుగుతారో వారు రిప్రజెంటేటివ్ (Representative) అనగా ప్రతినిధి అని చెప్పబడతారు. బాబూజీ ఇచ్చిన శక్తి నంతటినీ అతడు జీర్ణించుకోగలిగిన తరువాతనే అతడు (రిప్రజెంటేటివ్) ప్రతినిధి అవుతాడు. అతనిలో మనం బాబూజీ ఉన్న అనుభూతిని పొందాలి. ఒక సమావేశానికి ఒక వ్యక్తి రాష్ట్రపతిగా ప్రాతినిధ్యం వహించాడనుకుందాం. అంతమాత్రాన అతడు రాష్ట్రపతిగా అయ్యాడనుకోవటానికి వీల్లేదు. అతడు కేవలం ఒక ఏజెంట్‌గా మాత్రమే వ్యవహరించటం జరుగుతుంది. అదే విధంగా, మిషన్ యొక్క ప్రతినిధి జాగ్రత్త వహించి అభ్యాసులకు మార్గ నిర్దేశం చేస్తూ, సహాయపడుతూ బాబూజీ సందేశాన్ని విస్తృతపర్చాలి.

అభ్యాసులలో ఒకరు, స్వామి వివేకానంద ధ్యానం చేసిన ప్రదేశం గురించి ఆలోచించాడు. స్థానికులు ఎవ్వరికీ ఈ విషయం తెలియకపోగా, స్వామీజీ ఆ రాతిబండలోనే ధ్యానం చేశారు అని చెప్పుకొచ్చారు. అప్పుడు వెంటనే నేను (కస్తూరీ) కల్పించుకుని, స్వామి వివేకానంద తన స్వంతం కోసమే ధ్యానం చేశారనీ, స్వామి రామకృష్ణ వారికి స్పర్శ దీక్షను మాత్రమే ఇచ్చారని చెప్పాను. దానిలో దివ్యశక్తి యొక్క ట్రాన్స్‌మిషన్ చోటుచేసుకోలేదు. సందర్శకులు కేవలం క్షేత్ర సందర్శన కోసమేకాని ఆధ్యాత్మిక దృష్టితో రానందువలన ఆ రాతిబండ ఇప్పుడు ఒక రాతిబండగానే ఉండిపోయింది. అయితే ఒక నిజమైన సహజమార్గ అభ్యాసీ ఆ ప్రదేశాన్ని సందర్శించినప్పుడు, ఆ శిల ఆధ్యాత్మికతతో శక్తివంతమవుతుంది.

**ప్రశ్న: 'అతడి'ని నేను తెలియకపోయినపుడు, 'అతడి కృప'ను నేను ఎలా పొందగలను?**

**జవాబు:** ఒక బిడ్డ తల్లి గర్భంలో ఉండగా, ఆ బిడ్డకు ఏమి కావాలో ఆ తల్లికి తెలియదు. అయినప్పటికి ఆ బిడ్డ అప్రయత్నంగానే తనకు అవసరమైన వాటి నన్నింటినీ తన తల్లి నుంచి పొందుతుంది. అదే విధంగా, సహజమార్గం యొక్క శక్తి క్షేత్రంలోనికి ఏ వ్యక్తి అయినా ప్రవేశించినపుడు, అతడు ఆ దైవం నుంచి అప్రయత్నంగానే తన వంతు పొందుతాడు.

ఒక నిజమైన సాధకుని యొక్క జీవితం 'అతని'కి అనగా 'ఒకే ఒక్కడు'కు మాత్రమే అర్పితం కావటానికి ఉద్దేశించబడింది. అలా ఎందుకంటే, ఆ 'అతడు' అను వాని నుండి మనం విడుదలైనప్పుడు మనం కోరుకుంటున్న 'దాని' (అతడు) నుంచి మనం భిన్నం కాదు కనుక. బాబూజీ విశ్లేషించినట్లుగా "ఏదైతే ఆరంభంలో ఉందో అంతంలో కూడా అదే ఉంది, రెండుగా భావించబడినప్పటికీ, ఆ ఇద్దరూ నిజంగా 'ఒకే ఒక్కరు'.

"ఆధ్యాత్మికతలో సంతృప్తి అను దానికి స్థానం లేదు. ఒకవేళ నీవు సంతృప్తి చెందినవాడవు అయితే నీ పురోగమనం అక్కడితో నిలిచిపోయినట్లే" –అని బాబూజీ మహరాజ్ ఎప్పుడూ చెబుతూ ఉండేవారు.

బాబూజీ ఈ విధంగా చెప్పారు: "నరకం ఉంది అంటే అది మన సృష్టి అన్నమాట. దానిని మనమే సృష్టించుకుంటున్నాము. నిరాదరణకు గురియైన ఆత్మలన్నీ అక్కడకు చేర్చబడతాయి అని, దానిని నరకం అని చెప్పుకోవటానికి వీలులేదు. మరి స్వర్గం ఎందుకు లేదు? అది అవుసరం లేదు. ఎందుకంటే, ఎప్పుడైతే దైవం నీలోనే ఉన్నాడో, నీకు నీవే స్వర్గమై ఉండగా, మరొక స్వర్గం యొక్క అవసరం ఏం ఉంటుంది. కనుక నరకాన్ని నీవు సృష్టించగలవు కాని స్వర్గాన్ని నీవు సృష్టించనవసరం లేదు, అది నీతోనే ఉంది కాబట్టి. నీవు అన్వేషిస్తున్న ఆ స్వర్గాన్ని, నీలోనే వెదికి పట్టుకో."

బాబూజీ చెప్పారు: "దోషులు కూడా తమలో ఈ కాంతిని కలిగి ఉంటారు" అని. అది ఒక దీపం వంటిది, దాని గాజు ఫలకం లోపలివైపున మసి పేరుకుంటుంది. దీపం వెలుగుతూనే ఉంటుంది కాని, కాంతి బయటకు వెదజల్లదు. దానిని బాబూజీ ఈ విధంగా వివరించారు: "దోషులు కూడా తమలో కాంతిని కలిగి ఉంటారు. వారు దానిని అనేక స్థూలత్వాలతో క్రమ్మి ఉంచిన కారణంగా మనం దానిని చూడలేక పోతున్నాం. ఎప్పుడైతే నీవు దానిని శుభ్రపరుస్తావో అప్పుడు నీవు వారిలో కూడా కాంతిని చూడగలవు."

ఒక పురుషుడుకాని, ఒక స్త్రీగాని ఎలా వ్యవహరించినప్పటికీ వారిని నిరసించాల్సివస్తే, వారు కూడా దైవాంశులే కనుక ఆ విధంగా నిరసించటం తగదని బాబూజీ నొక్కి చెప్పారు.

సమతూకంతో జీవితంలో మెలగాలి అని బాబూజీ చెప్పటంలోని ఉద్దేశ్యం – "నీవు ఏమి చెబుతున్నావో దానిని ఆచరించాలి, నీవు దేనిని ఆచరిస్తున్నావో దానిని చెప్పాలి" అని.

ప్రార్థనలోని మూడవ పంక్తి, "నీవే మా ఏకైక స్వామివి, ఇష్టదైవమవు, నన్ను ఆ దశకు చేర్చటానికి" అను దానిని గురించి బాబూజీ ఇలా చెప్పారు: "ఈ ప్రార్థనను అపార్థం చేసుకోవటం తగదు, అది అడగటంకాని, ప్రాధేయపడటం కాని కాదు. ప్రతి ఉదయం, నీ లక్ష్యాన్ని, నీ ఉనికి యొక్క ప్రయోజనాన్ని, నీ ప్రస్తుత స్థితిని సమీక్షించుకుని నీ అంతట నీవుగా పునఃస్మరించుకోవటం, నీవు చేరదలచిన లక్ష్యాన్ని / గమ్యాన్ని ఎవ్వరైతే చేర్చగలుగుతారో అట్టి 'వాని'ని పునఃస్మరించుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే. అది వాస్తవానికి ఒక ప్రకటన మరియు పునఃస్మరణ" అని చెప్పారు.

మాస్టర్‌కు చేసే ప్రార్థన –దానిని నిర్వచించాలంటే, దానిని నీ స్వంతానికి అడుగుతున్నట్లయితే, అది అర్థించటం లేదా ప్రాధేయపడటం అవుతుంది. అదే ఇతరుల గురించినయితే అది ప్రాధేయపడటం కాదు.

ధ్యానానికి ముందు ప్రార్థన చేయటం ఎందుకంటే, ఎవ్వరి మార్గదర్శకత్వం, ఎవ్వరి సహాయం నీవు అపేక్షిస్తున్నావో అటువంటి సర్వశక్తుణ్ని నీవు ఆ సందర్భంలో అనుసంధానించుకోవటమే. దానిని సక్రమంగా నివేదించగలిగినట్లయితే, నీ ధ్యానం ఉత్కృష్టమైనదిగాను, ప్రభావం కల్పించగలిగినదిగాను ఉంటుంది.

'అతని' హృదయ ద్వారాన్ని తట్టటానికి శక్తివంతంగా నీ ప్రేమ ఉత్పన్నమైనపుడు, 'అతడు' తనకు సరితూగనివానివైన నీ కొరకు ద్వారం తెరచి చూస్తాడు, దానితో నీ పని ముగిసినట్లే.

ఎప్పుడైతే మనం 'అతడి'ని పూర్తిగా సమ్మతించుతామో, అప్పుడు మనపట్ల 'అతడు' పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. అందుచేతనే శరణాగతి అనేది మాస్టర్ మీద సంపూర్ణ విశ్వాసం కలిగి ఉండటాన్ని సంక్షిప్తం చేస్తుంది. ఆ శరణాగతి అనేది ప్రేమతోనేగాని భయంతో కాదు.

బాబూజీ యొక్క సంపూర్ణ జీవితకాలంలో, మొదటి పాయింట్ దాటినవారై ఉండి 'వారి'వద్దకు వచ్చిన వ్యక్తి ఒకే ఒక్కడు, అది కూడా ఒకే ఒక్క సందర్భంలో జరిగింది. బాబూజీ చెప్పారు: "నేను అతనికి ఒక సిట్టింగ్ ఇచ్చాను. అతడు నాల్గవ పాయింట్‌లో ఉండటం చూసి నేను ఆశ్చర్యపోయాను. అతడు అక్కడ ఉండటానికి చేసిన కృషికి కూడా నేను విస్తుపోయాను" అని. మొదటి పాయింట్ (కేంద్రం) నుంచి ముందుకు కదలటానికి అంతులేని జన్మలు తీసుకోవలసి వస్తుంది. ఆ కారణంగానే మాస్టర్ యొక్క శక్తి అవసరమవుతుంది. పూర్వకాలంలో, ఆత్మ మొదటి పాయింట్ నుంచి రెండవ పాయింట్‌కు జరగటానికి ప్రారంభమైన తర్వాత, ఎంతో మిక్కిలి ఆధ్యాత్మిక క్రమశిక్షణ కలిగి, రోజంతా అనగా 24 గంటలూ, సాధన చేసిన హిమాలయ అడవుల్లోని గుహల్లో నివసించే ఋషులకు కనీసం 45 సంవత్సరాల కాలం పట్టేది. దానిని దృష్టిలో పెట్టుకుని, సహజమార్గంలోని రాజయోగ ప్రభావాన్ని మీరు అర్థం చేసుకుని దానిని గ్రహించగలుగతారు. రెండవ పాయింట్ నుంచి మూడవ పాయింట్‌కు కదలటానికి ఆ 45 సంవత్సరాలకు ఐదురెట్లు అనగా 225 సంవత్సరాలు పట్టుంది అని, అలాగే మూడవ స్థానం నుంచి నాల్గవ స్థానానికి చేరటానికి ఆ 225 సంవత్సరాలను 5తో గుణిస్తే వచ్చే సంఖ్య అనగా 1,125 సంవత్సరాలు, మళ్ళీ నాల్గవ స్థానం నుంచి 5వ స్థానానికి చేరటానికి 1,125 సంవత్సరాలను 5తో గుణించగా కలిగే సంఖ్య 5,625 సంవత్సరాలు పట్టుందని చేప్తే మీకు దానిలో ఎంత కృషి అవసరమవుతుందో అర్థం చేసుకోగలుగుతారు. అటువంటి 4వ స్థానానికి చేరుకున్న వ్యక్తి రావటం చూసి బాబూజీ ఆశ్చర్యచకితులైపోయారు. అటువంటి వ్యక్తి ఒక్కసారి వచ్చి మళ్ళీ రాకపోయినందుకు, అతని దురదృష్టానికి బాబూజీ చలించిపోయి, కన్నులలో కన్నీరు ఉబికినట్లయ్యింది. అతని సంస్కారాలు, అతని పోకడ అందుకు కారణమయ్యాయి. అందుకనే బాబూజీ,– **"పొందవలసిన దానిని ఇక్కడే, ఇప్పుడే పొందు, అంతేకాని 'నేను రేపు మళ్ళీ వస్తాను' అని తలంచవద్దు"** అని ప్రకటించారు.

నీవు గర్భం దాల్చవచ్చు కాని దానిని విచ్ఛినం (Abortion) చేయరాదు. నీకు గర్భందాల్చే హక్కు ఉంది. అయితే ఒకసారి గర్భందాల్చాక, నీకుగాని, ఇతరులు ఎవరికైనగాని ఆ గర్భంలో పెరుగుతున్న శిశువు మీద అధికారం ఉండదు. ఆ శిశువు ఇంక నీది కానేకాదు. అది భగవంతునికే చెందినదిగా ఈ ప్రపంచంలోకి వచ్చింది. దాని మనుగడ ఉన్నంతకాలం నీవు దాని సంరక్షకురాలివి మాత్రమే. దాని ఉత్పత్తిదారుడు (దైవం) దానిని ఎలా చేయాలనుకున్నాడో అలా నీవు ఉన్నంతకాలం చేతనైనంతగా చేయటానికి

సహకరించటమే నీ పని. అందుచేత, **ఆధ్యాత్మిక దృష్టితో చూసినట్లయితే, గర్భస్రావం ఒక నేరం (Abortion, is spiritually speaking, a crime)**.

మనం ఆధ్యాత్మికత కొరకు సాధన ఎప్పుడు ప్రారంభించాలి? లాలాజీ బాబూజీకి ఈ విధంగా చెప్పి ఉన్నారు: "ఈ మృతప్రాయమైన జీవనంలోకి ఆ జీవి గర్భంలో ప్రవేశించిన సమయమే సరైన సమయం." అదే యుక్తమైన సమయం. (అనగా పిండం ఏర్పడిన సందర్భంలోనే అని భావించవచ్చు.) అయితే దురదృష్టవశాత్తు అనేక కారణాలవలన నీవు ఆ సందర్భాన్ని కోల్పోయి ఉంటే, ఆ బిడ్డ దానిని ఎప్పుడు గ్రహిస్తుందో చెప్పలేం. అటువంటి అవకాశం జారిపోయినప్పుడు, సహజమార్గంలో మనం 18 సంవత్సరాల వయస్సు వరకు ఆగవలసి ఉంటుంది. ఎందుకంటే, ఈ మధ్యకాలంలో బిడ్డ చాలా అమాయకంగా ఉంటుంది.

బాబూజీ ఒక వ్యక్తికి ఇలా వ్రాశారు: "నేను నిన్ను కేంద్ర మండలంలోకి చేర్చి దైవంతో అనుసంధానం కావించాను. ఇప్పుడు నీ భవిష్యత్తు 'అతడి' చేతుల్లో ఉంది" –అని. అందుకు ఆ వ్యక్తి, "ఓహో, నేను దైవంతో సంబంధం కలిగి ఉన్నందుకు సంతోషిస్తున్నాను" అన్నాడు. దానితో అతని పతనం ప్రారంభమయ్యింది. అతడు ఎందుకు పతన మయ్యాడు? అన్న ప్రశ్నకు బాబూజీ ఇలా చెప్పారు: "ఎందుకంటే, అతడు తన మాస్టర్‌ను అనగా ఎవ్వరైతే తనను భగవంతునితో సంబంధం కల్పించారో వారిని విస్మరించాడు" అని.

మాస్టర్ (బాబూజీ) సహాయం లేకుండా నీవు ఏమీ ప్రగతిని సాధించలేవు. దైవానికి మనస్సు లేదు, కనుక 'అతడు' నిన్ను స్వాగతించ లేడు, 'అతడు' నీ ఉనికిని గుర్తించలేడు. అందుచేత ఈ యాత్ర ముగిసేవరకు మనకు మాస్టర్ (బాబూజీ) యొక్క అవుసరం ఉంది.

"సత్యవంతమైన మాస్టర్‌కు, పేరంటూ లేదు, రూపమంటూ లేదు, అయినా లాలాజీ మరియు నేను (బాబూజీ) ఒక్కటే, జీవిత లక్ష్యం ఇలాగే ఉండాలి" అని అన్నారు బాబూజీ. కనుక "మానవ జీవితానికి నీవే యదార్థ లక్ష్యం" అనేది భావ గర్భితమైన వాక్యం అని ఎవ్వరైనా అర్థం చేసుకోవాలి. మనం ఆశించదగినది, పొందగలిగినది మాస్టర్ (బాబూజీ)లో లయమైపోవటమే.

"మానవుని యొక్క అత్యంత బలహీనత అనేది, తనకు తాను బలహీనుడు అని భావించటంలోనే ఉంది" –అని పని గురించి వ్యాఖ్యానిస్తూ చెప్పారు బాబూజీ.

శరణాగతి గురించి బాబూజీ ఏమి చెప్పారంటే, ప్రేమతో లయం కావటం ప్రారంభమవుతుంది. శరణాగతి అనేది ప్రేమతోను, ఆధారపడి లేదా ఆశ్రయించుకుని ఉండటంతోను ప్రారంభమవుతుంది. ఈ శరణాగతి కొరకు ప్రయత్నించవద్దు. ఎందుకంటే, దాని కోసం మనం ప్రయత్నించినట్లయితే 'అహం' (సెల్ఫ్) అక్కడ ఉంటుంది కనుక, ఆధారపడి లేదా ఆశ్రయించుకుని ఉండటమే సరియైన విధానమవుతుంది. నీ శరణాగతి ఎప్పుడు పూర్తవుతుంది అంటే, ఒక మూర్ఖుడేకాని, జంతువేకాని, ప్రతి ఒక్కదానికి (అనగా సమస్తానికి) నీవు శరణాగతుడవైనట్లుగా నీవు భావించినపుడు.

"పూజలో శిరస్సు నివేదన భావంతో వంచి ఉండాలి. నీవు కనుక పూజ చేస్తున్నట్లుగా స్పృహ కలిగి ఉంటే అది పూజ కానేరదు. మనం పూజ చేస్తున్నాము అంటే, మనం భగవంతుణ్ణి అర్థించబోతున్నాము

అన్న మాట. **'అతడు' దైవమై ఉన్నాడు కనుక అతనికి అన్నీ ఉన్నాయి. మనం ఒక చిన్న సంచిని మన వెంట తీసుకు వెళ్ళినట్లయితే, దానిలో 'అతడు' ఎంత నింపగలడు? అందుచేత అందుకు తగిన పాత్రగా మనం కావలసి ఉంటుంది. మనం అందుకు అర్హులుగా తయారుకావాలి"** అని పూజను గురించి చెప్పారు బాబూజీ.

"అవసరమైన దానికి మించి ఒక్క సెకను కాలమైనా కూడా, ఏ దశలోనైనా ఒక మనిషిని నిలిచి ఉండనీయరు. అయితే అభ్యాసీలో దానికి తగ్గట్లుగా తపన ఉండి ఉండాలి" అన్నారు బాబూజీ.

ooOoo

# సందేశం

## (10.03.2007వ తేదీన సిస్టర్ కస్తూరీగారు ఇచ్చిన సందేశం, హైదరాబాద్)

ఈ సందేశం శ్రీ బాబూజీ మహరాజ్ ఇచ్చినది. దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత మీ అందరి మీద ఉన్నది. బాబూజీ ఈ సందేశం ఇచ్చారు అని అంటే, ఈ దివ్య సందేశం 'భూమా' (అల్టిమేట్) నుండి వచ్చింది అని అర్థం. ఇది కేవలం సందేశం కాదు, ఇది (Divine Reward) దివ్య బహుమానం, (Divine Blessings) దివ్య ఆశీస్సులతో నిండి ఉన్నది. శ్రీ బాబూజీ మహరాజ్ ఈ దివ్య బహుమానం (Divine Reward)తో నిండిన దివ్య సందేశం మన అందరి కొరకు తీసుకొని వచ్చారు. మన అందరం 'వారి' కృప వలన, 'వారి' చరణాల వద్ద శరణు లభించటం వలన 'వారి' (Divine Gift) దివ్య కానుక మనందరికీ ఆ 'భూమా' నుండి లభించినదని అర్థం చేసుకోవాలి.

'భూమా' గురించి ఇంతవరకు ఎవ్వరూ ఊహించను కూడా ఊహించలేదు. ఆధ్యాత్మిక సాహిత్యంలో ఇప్పటివరకు ఎక్కడ కూడా భూమా (అల్టిమేట్) అనే పేరు రాలేదు. ఇంతవరకు ఏ దివ్య పురుషుడు (డివైన్ పర్సనాలిటీ) కూడా భూమా శక్తితో అవతరించి, మానవాళిని పవిత్రంగా తయారుచేయలేదు. ఇంతవరకు ఇటువంటి దివ్య సందేశం మానవాళి కొరకు ఎవరు కూడా తీసుకొని రాలేదు.

కాని, ఈ రోజున, శ్రీ బాబూజీ మహరాజ్ భూమా యొక్క ఈ దివ్య సందేశాన్ని, ఈ దివ్య ప్రసాదాన్ని సమస్త మానవాళి కొరకు తీసుకొని వచ్చారు. అందువల్లనే మనమందరం 'వారి' పావన చరణాలవద్ద ఉన్నాము. ఈ దివ్య ప్రసాదం మనదే. ఇప్పుడు ఈ దివ్య ప్రసాదాన్ని ఎంత త్వరగా మన స్వంతం చేసుకోవటమనేది మన మీదనే ఆధారపడి ఉన్నది. ఉదాహరణకు బెనారస్ (వరణాసి) నుండి ఒక శాలువను నీకు (Gift) బహుమతిగా తీసుకొని వచ్చాను –అని మీకు ఒక మిత్రుడు ఉత్తరం వ్రాస్తాడు. నీవు ఆ మిత్రుని ఇంటికి వెళ్ళినప్పుడే ఆ శాలువా నీకు స్వంతం అవుతుంది.

అదే విధంగా బాబూజీ మహరాజ్ 'భూమా' (అల్టిమేట్) నుండి ఆ (Divine Gift) దివ్య బహుమతిని తీసుకొని వచ్చారు. ఆ దివ్య కానుక 'వారి' వద్ద సురక్షితంగా ఉంది. మీరందరు 'వారి'ని చేరుకొని, ఆ దివ్య కానుకను తీసుకొని రావాలి. ఇది కేవలం అభ్యాసం (సాధన) వల్లనే సాధ్యమవుతుంది, పూర్తవుతుంది.

అభ్యాసం (సాధన) అంటే ఏం చేయాలి? ఎవరైతే మన అందరి కొరకు దివ్యకానుకను తీసుకొని వచ్చారో, ఆ డివైన్ పర్సనాలిటీ శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ప్రెజెన్స్ (ఉనికి) అనుభూతి చెందాలి. సామీప్యత అనగా నియర్‌నెస్‌ను ఎంత వీలైతే అంతగా అభివృద్ధి చేసుకొంటే, అంతగా మనం 'వారి'కి దగ్గరగా చేరుకుంటాము. బాబూజీ భూమా నుండి మన కోసం అవతరించారు. 'వారు' మనవారు. వారికి ఎంత దగ్గరగా చేరుకుంటే, అంత త్వరగా మనం 'వారి'ని స్పర్శించగలం, 'వారి' దివ్యకానుకను స్వంతం చేసుకోవచ్చు.

నేను మరల వచ్చే సంవత్సరం ఇక్కడకు వచ్చినప్పుడు, అప్పటికి మీరందరు కూడా బాబూజీతో అతిసామీప్యతను పెంపొందించుకొని, 'వారి'కి చాలా దగ్గరగా ఉండే విధంగా మీరందరు కృషి చేయాలని నేను ఆశిస్తున్నాను. మనం ఒక్క అడుగు ముందుకు వేస్తే, 'వారు' వంద అడుగులు మన ముందుకు వేస్తారు. 'వారు' ఎంతో తొందరతో ఉన్నారు. మీరు కొంచెం దూరం నడిస్తే, మిగిలిన దూరం అంతా వారే స్వయంగా నడచి మీవద్దకు వస్తారు. మీ అందరికి ఈ అదృష్టాన్ని, ఈ దివ్య కానుకను ప్రసాదించటానికి బాబూజీ ఇక్కడకు వచ్చారు. మీరందరు ఆ దివ్య కానుకను, త్వరగా, అతిత్వరగా 'వారి' వద్ద నుండి స్వీకరించాలని, నేను బాబూజీని ప్రార్థిస్తున్నాను. ఇదే బాబూజీ యొక్క దివ్య సందేశం. ఈ దివ్య సందేశంతోపాటుగా, దివ్య బహుమతి కూడా వారివద్ద సురక్షితంగా ఉంది. మీరు వారికి దగ్గరగా చేరినప్పుడు, ఆ దివ్య కానుక మీకు లభిస్తుంది. (Remembrance with love) నిరంతర స్మరణ అనేది ప్రేమతో నిండి ఉండాలి అని బాబూజీ అనేవారు. బాబూజీపట్ల మీకు ఎంతగా ప్రేమ ఎక్కువైతే అప్పుడే ఆ దివ్య కానుక మీ స్వంతం అవుతుంది. దీనికోసం సాధన (అభ్యాసం) చేయాల్సినది ఏమిటంటే, "బాబూజీ నావారు, నాలోనే ఉన్నారు" అనే దానిని నిరంతరం గుర్తుపెట్టుకొని 'వారి' ప్రెజెన్స్‌ను (ఉనికిని) అనుభూతి చెందాలి.

## ప్రశ్నలు - జవాబులు

అభ్యాసులు మరియు సందర్శకుల అనేక రకాల ప్రశ్నలకు శ్రీ బాబూజీ మహరాజ్ ఇచ్చిన సమాధానాలు మరియు సందేహ నివృత్తులు:

**ప్రశ్న 1: సహజమార్గం మరియు రాజయోగం అనగా నేమి?**

**జవాబు:** రాజయోగం యొక్క నూతన పరివర్తన రూపమే సహజమార్గం. భగవత్ సాక్షాత్కారానికి రాజయోగం అనేది ఒక పురాతన విధానం.

**ప్రశ్న 2: సహజమార్గమునకు, రాజయోగమునకు గల భేదం ఏమిటి?**

**జవాబు:** సహజమార్గం భిన్నమైనది కాదు. నా మాస్టర్ (లాలాజీ సాహెబ్) యొక్క అనుభూతలమీద ఈ విధానం ఆధారపడి ఉంది. వారు చెప్పినట్లుగా, ఇది "క్రొత్త సీసాలో పాత ద్రాక్ష సారాయి వంటిది."

**ప్రశ్న 3: భగవంతుడు అంటే ఎవరు?**

**జవాబు:** ఎవ్వరైతే స్వయంగా వ్యక్తమవుతారో వారు.

**ప్రశ్న 4: భగవంతుడు మనలోపల ఉన్నాడా?**

**జవాబు:** ప్రతిదానిలోను భగవంతుడు ఉన్నాడు. ఇంతకీ ప్రశ్నించవలసింది ఏమిటంటే, "నీవు భగవంతుని లోపల ఉన్నావా" అని.

**ప్రశ్న 5: బాబూజీ! భగవంతుడ్ని అభివర్ణించటం ఎలా?**

**జవాబు:** ప్రాపంచిక విశ్లేషణాలన్నింటిని విస్మరించాక, ఏదైతే మిగుల్తుందో అది భగవంతుడు / దైవం.

**ప్రశ్న 6: ఎన్నో బాధలు, కష్టాలు ఉన్న ఈ ప్రపంచాన్ని భగవంతుడు ఎందుకు సృష్టించాడు?**

**జవాబు:** లక్షలకొలది సంవత్సరాలు ఆ పరమ శక్తి అభివ్యక్తం కాకుండా ఉన్నట్లయితే, అది ఘనీభవించిపోయి దాని ఉనికి లేకుండా పోవటమేకాక, భగవంతుని అస్థిత్వం కూడా అంతర్ధానమైపోయి ఉండేది. కనుక 'అతని' జీవనాన్ని నిలుపుకునేందుకు, 'అతడు' విడుదల చేసిన శక్తి ఫలితమే ఈ సృష్టి (Creation) రూపం.

**ప్రశ్న 7: సాక్షాత్కారం (Realisation) అనగా నేమి?**

**జవాబు:** నీవు ఎవ్వరివో నీవు ఎరుగుదువుగాని, 'అతడు' ఎవ్వరో నీకు తెలియదు. ఎప్పుడైతే నీవు 'అతడి'ని తెలుసుకోవటంకాని, నీలో అనుభూతి చెందటంగాని జరుగుతుందో అదే సాక్షాత్కారం అవుతుంది.

**ప్రశ్న 8: సత్యత్వం (Reality)అంటే ఏమిటి?**

**జవాబు:** సత్యత్వం (Reality) అనేది నిరాధారమైన ఆధారం.

**ప్రశ్న 9: పరిపూర్ణత (Perfection) అంటే ఏమిటి?**

**జవాబు:** శక్తులన్నీ సమకూరినప్పుడు, ఆ సమత్వం / సమతుల్యత అంతటా విస్తరించి ఉంటుంది. పరిపూర్ణత అంటే అదే.

**ప్రశ్న 10: బాబూజీ! మీరు నాకు 'అహం' (సెల్ఫ్) అంటే ఏమిటో వివరిస్తారా! ఋషులు 'అహం' అని వర్ణించటంలో వారి అభిప్రాయం ఏమై ఉంటుంది? దానిని దైవం అనవచ్చునా?**

**జవాబు:** అది దైవం కాదు. దానికి భిన్నమైనది. వ్యక్తిత్వం యొక్క భావనయే 'అహం'. దానిని కల్పించుకోవటం వల్లనే అది ఏర్పడుతుంది.

**ప్రశ్న 11: పరిపక్వమైన ఆలోచన అంటే ఏమిటి?**

**జవాబు:** ఒకే ఒక్క లక్ష్యం, ఒకే ఒక్క మాస్టర్ (దైవం) మరియు ఒకే ఒక్క విధానమునకు కట్టుబడి ఉండటమే.

**ప్రశ్న 12: మనస్సులో ఆలోచనలు ఎందుకు కలుగుతాయి?**

**జవాబు:** మనస్సులో ఆలోచనలు అంటూ ఏమీ లేకపోయినట్లయితే, మనం ఒక పరిపూర్ణమైన సమత్వ స్థితికి చేరుకున్నట్లవుతుంది. అప్పుడింక శరీరం ఛిద్రమైపోతుంది (తునాతునాకలైపోతుంది).

**ప్రశ్న 13: ఆలోచనలు ఎలా తలెత్తుతాయి?**

**జవాబు:** మన మనస్సు, ఆ పెద్ద మనస్సు లేదా దివ్యమనస్సు నుంచి ఆవిర్భవించింది. అందుచేత అది ఎంతగా పతనం చెందినప్పటికీ దానిలో పవిత్రత ఎప్పుడూ నెలకొని ఉంటుంది. ఈ పవిత్రత, దివ్యమనస్సుతో సంబంధం కలిగి ఉన్న కారణంగా, దానిమీద ఎటువంటి అపవిత్రత ఆపాదించబడటానికి అది అంగీకరించదు. అందుచేత, అపవిత్రతలన్నీ ఆ విధంగా నిరంతరం బయటకు విసిరివేయబడుతూ ఉంటాయి. ఈ విధంగా విసిరివేయబడిన అపవిత్రతలే ఆలోచనలుగా రూపందాల్చి, మనకు అనుభవమవుతూ ఉంటాయి.

**ప్రశ్న 14: ఆలోచనకు (Thought), అసంకల్పిత జ్ఞానం లేదా సహజ జ్ఞానం (Intuition) మధ్యగల వ్యత్యాసం ఏమిటి?**

**జవాబు:** ఉద్దేశ్యం (Idea) యొక్క వృద్ధి చెందిన దశ ఆలోచనగాను (Thought), ఆలోచన దాని పరిధిని దాటితే అది అసంకల్పిత జ్ఞానం లేదా సహజ జ్ఞానంగాను (Intuition) అవుతుంది.

**ప్రశ్న 15: మనం ఆలోచనారహిత స్థితిలో ఉండగా, అనుభూతికి అవకాశం ఉంటుందా?**

**జవాబు:** ఉంటుంది. కాని అది ఒక జంతువు యొక్క స్థితిగా మాత్రమే ఉంటుంది. అది దానిని ప్రభావితం చేసేవాటికి ప్రతిస్పందనగానే ఉంటుంది. పూర్తిగా ఆలోచనారహిత స్థితి అసంభవమని, అలా జరిగినప్పుడు జీవించి ఉండే అవకాశం ఉండదని నేను చెపుతున్నాను. అందుకు చేయవలసిందల్లా మన ఆలోచనాసరళిని లేదా స్వభావాన్ని మార్పు చేసుకోవటమే.

**ప్రశ్న 16: మతం అనగా నేమి?**

**జవాబు:** కొన్ని (dogmas) అభిప్రాయాలు లేదా సిద్ధాంతాలు ఒకచోట సమకూర్చినప్పుడు అది మతం అవుతుంది.

**ప్రశ్న 17: మతమునకు, ఆధ్యాత్మికతకు మధ్య ఉన్న భేదం ఏమిటి?**

**జవాబు:** అది అశుద్ధికి, శుద్ధికి లేదా సంస్కారలేమికి, సంస్కారవంతానికి మధ్యన ఉన్న భేదం వంటిది.

**ప్రశ్న 18: తత్త్వజ్ఞానం గురించిన అధ్యయనాల (Philosophic studies) విలువ ఏమిటి?**

**జవాబు:** తత్త్వశాస్త్రం ఏమీలేని దానితో (Without) ఆనందాన్ని కలిగిస్తుండగా, నేను అన్నీ సమకూరిన దానితో (Within) ఆనందాన్ని ఇస్తున్నాను. తత్త్వజ్ఞాన దృష్టి ఏమీ లేకుండా కూడా నేను సంతోషం కలిగిస్తాను. కనుక మీరు గ్రహించండి– నేను దానితోను, అది లేకుండాను కూడా సంతోషాన్ని సమకూర్చుతాను.

**ప్రశ్న 19: మీ సందేశం ఏమిటి?**

**జవాబు:** నిస్సందేహాత్మకమైన నిరంతర లేదా శాశ్వత శాంతి మాత్రమే.

**ప్రశ్న 20: అది ఎలా సాధ్యపడుతుంది?**

**జవాబు:** అది ప్రార్థన ద్వారాను, ప్రాణాహుతి ద్వారాను సాధ్యమవుతుంది.

**ప్రశ్న 21: అభ్యాసీ ఈ విధానాన్ని (సహజమార్గం) విడిచిపెట్టినప్పుడు ఏదైనా శిక్ష అమలవుతుందా?**

**జవాబు:** ఎటువంటి శిక్ష ఉండదు. నేనొక విషయం చెబుతున్నాను. కేవలం సహకారం (కో–ఆపరేషన్) మాత్రమే అవసరం. దీనికి పెద్దగా త్యాగం యొక్క అవసరం ఏమీలేదు.

**ప్రశ్న 22: మంత్రాలకు ఏమైనా శక్తి ఉన్నదా?**

**జవాబు:** బాగుంది. చాలామంది వాటిని గురించి ఆలోచించారు లేదా దృష్టిపెట్టారు కనుక, మంత్రాలకు శక్తి ఉన్నది అని చెప్పబడింది. నా ఉద్దేశ్యం ప్రకారం, ధ్యానం మాత్రమే మనల్ని గమ్యానికి చేర్చగలదు. మంత్రయోగం యొక్క అసలైన పద్ధతి ఏమిటంటే, దాని అర్థం మీదనే ధ్యానం చేయాలి. వేదసూత్రాలు ఆ విధంగా చెబుతున్నాయి. అలా కానప్పుడు అవి నిరర్థకం. మీరు మంత్రం యొక్క అర్థంపై ధ్యానం చేయకుండా కేవలం దానిని ఉచ్చరించటం / జపించటం జరిగినట్లయితే, దానివలన కొద్దిగా ప్రయోజనం ఉండవచ్చును కాని, పూర్తిగా మాత్రం కాదు. నా ఉద్దేశ్యం ప్రకారమైతే మీరు మీ పేరును అదే పనిగా ఉచ్చరించినట్లయితే అది కూడా ఒక మంత్రం అవుతుంది.

**ప్రశ్న 23: కుండలిని గురించి ఏమి చెబుతారు? మీ యోగ విధానంలో దానికి ఏదైనా భాగస్వామ్యం ఉందా? లేదా మీ యోగ విధానంలో అది ఏమైనా పాత్ర వహిస్తుందా?**

**జవాబు:** కుండలిని అనేది ఒక శక్తి; దానిని కనుక జాగృతం చేసినట్లయితే ఉన్నత లోకాలలో పని చేయటానికి అది ఉపకరిస్తుంది. అందుచేత అందరికీ ఈ శక్తి యొక్క అవుసరం లేదు. అటువంటి ఉన్నత కార్యానికి ఏ ఒక్కరిద్దరు మాత్రమే ఉంటారు. ఇంకా చెప్పాలంటే, ఆధ్యాత్మిక ఉన్నతికి దాని యొక్క అవుసరం లేనేలేదు.

**ప్రశ్న 24: సహజమార్గంలో ప్రాణాహుతి ముఖ్య భూమిక అని మీరు చెప్పారు కదా! అసలు అది ఏమిటో, అది ఎలా పనిచేస్తుందో, వివరించండి.**

**జవాబు:** ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) అద్భుతంగా పని చేస్తుంది. కాని దానిని మీరు పరీక్షించి చూడాలి. అది మానవుడ్ని రూపాంతరీకరణ గావించటానికి ఉపయోగించేటటువంటి ఒక దివ్యశక్తి. రూపాంతరీకరణం ప్రాణాహుతి ఫలితంగానే జరుగుతుంది.

**ప్రశ్న 25: మీరు మిషన్‌లో ఎక్కువమంది సభ్యులు ఉండాలని ఎందుకు అనుకుంటున్నారు? మీకు ఆరు లేదా ఏడు మంది సభ్యులు ఉంటే సరిపోదా?**

**జవాబు:** ఒక్క విషయం అర్థం చేసుకొనండి, నేను అనంతం నుండి వచ్చాను కనుక, ఆ అనంతం యొక్క బీజం నాలో ఉంది. నేను ఏ పని చేసినప్పటికీ, ఆ అనంతం నాతోను, అందరితోను ఉండాలి అని, అలాగే వారితో ఆ అనంతం యొక్క అనుబంధం ఉండాలని నేను సహజంగా వాంఛిస్తాను.

**ప్రశ్న 26: నేను సర్వజ్ఞానిగా కావాలనుకుంటాను. దానిని ఎలా సాధ్యం చేసుకోవాలి?**

**జవాబు:** పర్షియన్ భాషలో ఒక పద్యంగా ఒక సెయింట్ –"నాకు తెలిసినదల్లా నాకు ఏమీ తెలియదని మాత్రమే" అని అన్నాడు. (భక్త ప్రహ్లాదుడు కూడా ఇదే విధంగా చెప్పాడు.)

**ప్రశ్న 27: ఎవ్వరైనాగాని ప్రాణాహుతిని పొందాలంటే హృదయం మీద ధ్యానం చేయాల్సి ఉంటుంది, అని నాకు చెప్పబడింది. అది నిజమేనా?**

**జవాబు:** అవును. హృదయంలో కాంతి మీద మేము ధ్యానం చేస్తాము. జీవితానికి హృదయం ముఖ్య వేదిక (ముఖ్య భూమిక) కనుక, హృదయం అందుకు తగినదిగా ఉంటుంది. మేము మా సహజమార్గ విధానంలో, మానవుని రూపాంతరీకరణ కొరకు అవసరమైన ఆధ్యాత్మిక ప్రభావంతో పోల్చినట్లయితే, ముఖ్యంగా భౌతికమైనవిగానే మరికొన్ని కేంద్రాలు యోగ్యమైనవిగానే భావించబడినప్పటికీ, వాటి యొక్క ప్రయోజనం చాలా అల్పమైనదిగానే ఉంటుంది.

**ప్రశ్న 28: మాకు తోచిన ఏదో ఒక అవయం లేదా వస్తువు (Object) మీద మేము ఎందుకు ధ్యానం చేయకూడదు? నేను సముద్రం మీద ధ్యానం చేయటానికి ప్రాధ్యాన్యత నిస్తాను. నాకు అనంతం గురించి అది ఒక సరియైన భావాన్ని కల్పిస్తుంది. కనుక నేను ఆ విధంగా ఆచరించతగునా?**

**జవాబు:** దానిని నిర్ణయించుకొనవలసినది నీవే. మా మాస్టర్ రూపొందించిన విధానంలో, మేము హృదయంలోని ప్రకాశం మీదనే ధ్యానం చేస్తాము. అది కూడా ఒక భావన మాత్రమే.

**ప్రశ్న 29: మేము హృదయం మీదనే ఎందుకు ధ్యానం చేయాలి? నాకైతే, శిరస్సు మీద ధ్యానం చేస్తే బాగుంటుందని అనిపిస్తోంది?**

**జవాబు:** ఇది ఒక విధానం మాది. మాకు ఇది ఒక్కటే విధానంగా ఉంది.

**ప్రశ్న 30: ధ్యానంలో అనుభూతికి వచ్చేటటువంటి దృశ్యాలు, అనుభవాలు ఏమిటి?**

**జవాబు:** దృశ్యాలు అనేవి అనవసరమైనవి. నిజం చెప్పాలంటే, వాటికి విలువలేదు. నిర్మలీకరణ ప్రక్రియలో, బందీకృతమై ఉన్న సంస్కారం పైకి తేలటానికి అవకాశం కల్పించబడటం వల్లనే ఈ దృశ్యం గోచరిస్తుంది కాని, అంతకుమించి మరేమీ కాదు. కనుక మన ఆలోచనలు, కర్మల ఫలితంగా గతంలో ఏర్పడిన సంస్కారాలుతప్ప, ఈ దృశ్యాలుగా అవతరించేవి ఇంకేమీ కాదు. ఆధ్యాత్మిక జీవనంలో ఈ దృశ్యాలకు ప్రయోజనం లేదు.

**ప్రశ్న 31: ఒక అభ్యాసీ ధ్యానాన్ని సంవత్సరాలపాటుగా కొనసాగిస్తున్నట్లయితే, ఈ ప్రక్రియ సులభమవుతుందా లేక ఆలోచనలు కలుగుతునే ఉంటాయా?**

**జవాబు:** ఆ ఆలోచనల తీవ్రత కొంత తగ్గుముఖం పట్టుంది, అయితే అది ఒక్క రోజులోనే కాదు. ధ్యానాన్ని ఎక్కువసేపు ఆచరిస్తూ క్రమంగా దానిని ఒక గంటకు పరిమితం చేయి. ఫలితం ఏమిటో గ్రహించు.

**ప్రశ్న 32: ధ్యాన సమయంలో మేము ఆలోచనలు వంటి వాటితో భంగపాటు చెందుతాము. హృదయంలో ప్రకాశం నిలుపుకుని, మళ్ళీ మేము ధ్యానంలో నిమగ్నం కావటం ఎలా?**

**జవాబు:** దానికి ఒకే ఒక్క మార్గం ఉంది. హృదయంలోని ప్రకాశం నుంచి, ఎప్పుడైతే నీవు నీ దృష్టి ఎక్కడికో మరలిపోయింది అని గ్రహిస్తావో అప్పుడు నీ దృష్టిని మళ్ళీ నీ హృదయంలోని కాంతి మీదకు మరలించాలి. అయితే దీనిని బలవంతంగా చేయవద్దు. ఇతర ఆలోచనలను లక్ష్యపెట్టకూడదు. ఎప్పుడైతే

ధ్యానంలో మనకు ఆలోచనలు భంగం కలిగిస్తాయో, అప్పుడు మనం అటువంటి ఆలోచనలకు ఊతమివ్వటం మూలంగానే (అనగా శక్తి నివ్వటం మూలంగానే) వాటివలన మనకు భంగం కలుగుతుంది. స్వయంగా వాటికి ఎటువంటి శక్తి లేదు. వాటిని మనం ఆహ్వానించని అతిథుల్లాగా నిర్లక్ష్యం చేయాలి. వాటికి ఏ విధమైన గుర్తింపు ఇవ్వకపోయినట్లయితే, వాటంతట అవే తొలగిపోతాయి.

**ప్రశ్న 33: జ్యోతి (ప్రకాశం) అంటె ఏమిటి? దానిని మేము తిలకించాలా?**

**జవాబు:** అది ఒక భావ జనితమే (అనగా ఉన్నది అనుకోవటం మాత్రమే) అని నేను చెబుతున్నాను. హృదయంలో జ్యోతి, కాంతి లేదా ప్రకాశం ఉంది అని అనుకోవటం ఒక ఊహ మాత్రమే.

**ప్రశ్న 34: ధ్యానంలో కొంతమంది శాంతి యొక్క గాఢానుభూతిని ఎందుకు పొందలేకపోతారు?**

**జవాబు:** అటువంటివారు సక్రమంగా ధ్యానం ఆచరిస్తున్నప్పటికీ, ఆ దివ్యత్వం యొక్క ఉనికిని ఆకట్టుకోలేకపోతున్నారన్న మాట.

**ప్రశ్న 35: నిరంతర స్మరణ అనునది సహజంగా కలుగుతుందా లేక దాని కొరకు ప్రయత్నించాల్సి ఉంటుందా?**

**జవాబు:** ప్రేమ అనేది ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు, దానికి అదే ఉత్పన్నమవుతుంది.

**ప్రశ్న 36: నిరంతర స్మరణను అభివృద్ధి చేసుకోవడం ఎలా? దానికి ఏదైనా మార్గం ఉన్నదా?**

**జవాబు:** మనం ఒకే ఒక్క ఆలోచనను కలిగి ఉండి, అదే ఆలోచనను మరల మరల కలిగించుకుంటూ ఉండాలి. ఈ సంకల్పమనేది హృదయంలో ఉండాలి. దానిని ఒక మంత్రంలాగా పలుమార్లు ఉచ్ఛరించకూడదు.

**ప్రశ్న 37: సమాధి గురించి మీరు ఏమైనా చెప్తారా?**

**జవాబు:** సాంప్రదాయ యోగ పద్ధతిలోనైతే సమాధి అనేది యోగకు చివరిదిగా అనగా అంతంగా భావించబడేది. అది దానంతట అదే కలిగితే, అది చెడుకాదు. అయితే అక్కడ దివ్య చైతన్యం (Divine Consciousness) కలిగి ఉండి దాని సహాయంతో నీవు ముందుకు పోవాలి. ఆ దివ్య చైతన్యం (Divine Consciousness) కనుక లేకపోయినట్లయితే అది నిష్ప్రయోజనమవుతుంది.

**ప్రశ్న 38: ఎవ్వరైనాగాని తనలో ఆత్మవిశ్వాసం కల్పించుకోవడం లేదా దానిని అభివృద్ధిజేసుకోవటం ఎలా?**

**జవాబు:** వాస్తవం చెప్పాలంటే, మనం ఒక దానిలో విశ్వాసం కలిగి ఉండి దానిని ప్రారంభించాలి. నీవు దానిలో ముందుకుపోతున్నావు అని గ్రహించినప్పుడు, విశ్వాసం దానికి అదే వృద్ధి చెందుతుంది. నేను ఇప్పుడు చెప్పబోయేది ఏమిటంటే, జనం (Conscience) మనస్సాక్షి / అంతరాత్మ విచక్షణా జ్ఞానాన్ని గురించి మాట్లాడుతూ ఉంటారు. అది (Conscience, మనస్సాక్షి / అంతరాత్మ విచక్షణా జ్ఞానం) అనేది మనల్ని నడిపించాలిగాని, మన ఇష్టం వచ్చినట్లు మనమే దానిని నియంత్రిస్తూ ఉంటాము. మరి (Conscience) మనస్సాక్షి / అంతరాత్మ విచక్షణా జ్ఞానం అంటే ఏమిటి? అది మన స్థాయినిబట్టి ఉంటుంది అనగా మనస్సు, బుద్ధి, చిత్తం మరియు అహం మీద ఆధారపడి ఉంటుంది. ఎప్పుడైతే ఇవన్నీ సమతుల్య స్థితిలో ఉండి, మూలమైన ఆలోచనలో లేదా సంకల్పంలో విలీనమైపోతాయో అప్పుడు అది (Real Consciousness) సిసలైన చైతన్యం లేదా స్పృహగా ఉంటుంది.

**ప్రశ్న 39: విశ్వాసం (Faith) అనబడేది ఒక కానుక అవుతుందా లేక ఇచ్ఛ యొక్క కార్యరూపమా?**

**జవాబు:** రెండూ సరైనవే.

**ప్రశ్న 40: ప్రేమ (Love) అంటె ఏమిటి? అది అవసరమా?**

**జవాబు:** అవును; ప్రేమ అనేది అవసరమే అని నేను చెబుతాను. మాస్టర్ పట్లగాని, దైవంపట్లగాని ప్రేమ అనేది ఉండి తీరాలి. అయితే ఆధ్యాత్మిక పురోగతిలో ఒకప్పుడు ప్రేమ కూడా అంతరించిపోయే దశ వస్తుంది.

**ప్రశ్న 41: శరణాగతి (Surrender) అంటె ఏమిటి?**

**జవాబు:** 'నేను' లేదా 'అహం' అనునది లోపించటమే శరణాగతి (Surrender) అవుతుంది. ఇందులో మొదటిది భగవంతునిపట్ల భక్తి, రెండవది 'అతడి' మీదే ఎప్పుడూ ఆధారపడి ఉండటం. నీవు భగవంతునికి శరణాగతుడయ్యావు అనుకుందాం. ఆ శరణాగతి కనుక నిజమైనది అనగా స్వచ్ఛమైనదే అయితే అది సమస్త మానవాళికి శరణాగతిగా అవుతుంది.

**ప్రశ్న 42: మనం ఎంత కాలానికి సాక్షాత్కారం పొందగలం?**

**జవాబు:** సాక్షాత్కారం సమయాన్ని లేక సందర్భాన్నిబట్టి కలుగుతుంది. నీవు ఈ దిశగా తల ఒగ్గితే, అదే కలుగుతుంది.

**ప్రశ్న 43: ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) అంటే ఏమిటి?**

**జవాబు:** మానవుడిని రూపాంతరీకరణ చేయటానికి ఉపయోగించు దివ్య శక్తియే ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్)..

**ప్రశ్న 44: ఈ ప్రాణాహుతి ఎలా పని చేస్తుంది?**

**జవాబు:** ఇది దివ్యశక్తిని (Divine Energy) నీలో ప్రవేశపెట్టి అది పని చేస్తుంది. ఆ ప్రకృతి యొక్క దివ్యశక్తి నీలో ప్రవేశించి, అది పని చేస్తుంది. మనం సూక్ష్మగ్రాహిగా (sensitive) ఉండినట్లయితే దాని అనుభూతి చెందుతాము. ఒకవేళ నీవు దాని అనుభూతి చెందలేకపోయినట్లయితే, నీలో కలిగే మార్పులు ఆ ప్రాణాహుతి యొక్క ప్రభావంతోనే అని నీకు నమ్మకం కలుగుతుంది.

**ప్రశ్న 45: ప్రార్థన అంటే ఏమిటి?**

**జవాబు:** మనకు, ఆ అంతిమంకు మధ్య ఏర్పడవలసిన ఆధ్యాత్మిక సంబంధానికి మనం ఏ అభ్యర్థన చేస్తామో అది ప్రార్థన అవుతుంది. సహజమార్గ విధానంలో ప్రార్థనకు ఇది సూక్ష్మ నిర్వచనం.

**ప్రశ్న 46: 'అహం' అనగా నేమి?**

**జవాబు:** అహం అంటే ఏమిటో మీకు తెలుపుతున్నాను. మానవుడు దైవం చేయాల్సిన పనిని తాను స్వీకరించి దైవానికి తన పనిని అప్పగిస్తున్నాడు. వచ్చిన చిక్కు అంతా ఇదే. మనం చేయాల్సిన పని మనం చేస్తూ, దైవాన్ని తన పనిని యథేచ్ఛగా చేసుకోనివ్వాలి.

**ప్రశ్న 47: దుష్కర్మ (Evil) అంటే ఏమిటి? ఆ దుష్కర్మ విధానాలు (Evil ways) ఏమిటి?**

**జవాబు:** ప్రకృతి విరుద్ధమైన పనులు చేయటమే దుష్కర్మ (Evil). మానవుడికి ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను ఏవైతే బలం చేకూర్చుతాయో అవి మంచివిగాను, ఏవైతే మానవుడ్ని మానసికంగాను, భౌతికంగాను కృంగదీస్తాయో అవి చెడ్డవిగాను అవుతాయి.

**ప్రశ్న 48: స్వార్థం అను దానిని మీరు స్పష్టంగా ఏ విధంగా నిర్వచిస్తారు?**

**జవాబు:** ఎవరైనా నీకు చేసిన సేవను నీ హృదయం అంగీకరించక పోయినట్లయితే, అది స్వార్థపూరితం అవుతుంది.

**ప్రశ్న 49: బాబూజీ! భయం యొక్క స్వభావం ఏమిటి?**

**జవాబు:** జ్ఞానం (Wisdom) యొక్క భ్రాంతియే / భ్రమయే భయం. జ్ఞానం కనుక సరైనది అయినట్లయితే, భయం కలిగే అవకాశం ఉండదు.

**ప్రశ్న 50: ఈ భ్రాంతినే / భ్రమనే (Hallucination) మాయగా (Maya) భావిస్తారా?**

**జవాబు:** అలా కాదు. సామాన్యంగా మాయను ఒక భ్రాంతిగా భావిస్తారు కాని దానిని నేను అంగీకరించను. మాయ అనేది దైవశక్తిగా నేను భావిస్తాను. ఈ శక్తి ఎలా పని చేస్తుందో మనకు తెలియనప్పుడు, మనం తికమకపడి దానిని మాయ అంటాము. ఎప్పుడైతే మనం ఆ దైవశక్తి ఎలా పని చేస్తుందో తెలుసుకున్నప్పుడు, మనం ఆ సత్యత్వాన్ని (రియాలిటీని) గ్రహిస్తాము. వాస్తవం చెప్పాలంటే, అది మన స్వంత అజ్ఞానం. మేధావులు జ్ఞానాన్ని అరువు తెచ్చుకుంటారు, దివ్యపురుషుడు జ్ఞానాన్ని సృష్టిస్తారు.

**ప్రశ్న 51: మీరు ఒక గురువు అనదగినవారా?**

**జవాబు:** నేను అలా భావించటంలేదు. నా సహచరుల్లో నేను కేవలం ఒక సహచరునిగానే భావించుకుంటాను.

**ప్రశ్న 52: చాలామంది మిమ్మల్ని గురువుగానో లేదా మాస్టర్‌గానో గౌరవిస్తారని నేను అనుకుంటున్నాను.**

**జవాబు:** అయితే ఒకటి. ఎవ్వరైనా నన్ను గూర్చి చెప్పవలసి వచ్చినప్పుడు, వారు ఏదో ఒక గౌరవపదం వాడాలి కనుక, వారు అలా చెప్పుకుంటారు; కాని నాకు అది ఇష్టం ఉండదు.

**ప్రశ్న 53: ఒక మానవునిలో అతడు ఎంతగా ఉన్నతినందాడో మీరు చూడగలరా?**

**జవాబు:** నా పనికి సంబంధించినంతవరకు నేను ఎంతవరకు గమనించాలో దానిని చూడగలుగుతాను.

**ప్రశ్న 54: కొంతమంది గురువు లోన ఉన్నాడు అంటారు?**

**జవాబు:** అయితే చెప్తాను వినండి. గురువు అంటే దైవం ఒక్కడే. మిగిలినవారందరు అతని మార్గదర్శకత్వంలోను, 'అతని' ఆదేశాల ప్రకారం పనిచేస్తూ ఉంటారు. వాస్తవంగా చెప్పాలంటే, ఏ మనిషి అయినా తనను గురువుగా చెప్పుకుంటే, అతడు ఆధ్యాత్మిక రంగంలో ఇతరులకు శిక్షణ ఇవ్వడానికి అర్హుడు కాడు. అటువంటి వ్యక్తి నిజంగా దైవ స్థానాన్ని అక్రమంగా ఆక్రమిస్తున్నాడన్న మాట.

**ప్రశ్న 55: నా శరీరం, నా మాస్టర్‌దే అని అనుకోవటం, అలాగే నేను ఏదైనా చేస్తున్నప్పుడు నేను కాకుండా ఆ మాస్టర్ మాత్రమే పని చేస్తున్నాడు, అని భావించుకోవచ్చునా?**

**జవాబు:** నేను దానిని సమర్థించను. మాస్టర్ హృదయంలో ఉన్నాడు అని నేను భావిస్తాను. అభ్యాసీ అటువంటి స్థితికి తలవని తలంపుగా చేరతాడు. అది ఒక భావన మాత్రమే.

**ప్రశ్న 56: లాలాజీ ఈ జీవితానికి ముందు జన్మ కలిగి ఉన్నారా?**

**జవాబు:** లేదు. అది అసంభవం.

**ప్రశ్న 57: గ్రాండ్ మాస్టర్‌తో సంబంధం కలిగి ఉన్నట్లుగా మీరు ఎలా అనుభూతి చెందుతారు?**

**జవాబు:** ఏ విధంగానైతే సంబంధం కలిగి ఉండాలో, ఆ విధమైన సంబంధం ఎల్లప్పుడూ ఉంటూనే ఉంది.

**ప్రశ్న 58: అసలైన సాధన అంటే ఏమిటి?**

**జవాబు:** దైవం నీ హృదయంలోనే దాగి ఉండి నిన్ను బహిర్గతం చేశాడు. నీవు దాగి ఉండి దైవాన్ని బహిరంగపరచు. ఇదే నిజమైన సాధన.

**ప్రశ్న 59: ప్రపంచాన్ని గురించి మీ నిర్వచనం ఏమిటి?**

**జవాబు:** సత్యత్వం (రియాలిటీ) యొక్క విస్తృతరూపమే ప్రపంచం అని నేను చెప్తాను.

**ప్రశ్న 60: విశ్వమానవ ప్రేమ (Universal Love) ఎలా సాధించబడుతుంది?**

**జవాబు:** అసలైన విషయం ఏమిటంటే, ప్రేమ అంతటినీ దైవదత్తం చేయాలి. ఒక్కని యొక్క జ్ఞాపకం అందరి యొక్క జ్ఞాపకాన్ని కలిగిస్తుంది. నేను నిన్ను ప్రేమిస్తున్నాను అంటే, నీ పిల్లల్ని కూడా ప్రేమిస్తున్నానన్న మాట. ద్వేషం అనుదానిని తొలగించినట్లయితే ప్రేమ దానంతట అదే వృద్ధి చెందుతుంది.

**ప్రశ్న 61: మానవ మనుగడ విషయంలో మానవమాత్రుని ప్రయోజనం ఏమిటి?**

**జవాబు:** సాక్షాత్కారమే లక్ష్యంగా ఉంది. లేదంటే దైవానిదే అయిన అతని స్వంత స్వభావాన్ని గుర్తించటమే.

**పశ్న 62: జీవితం అంటే ఏమిటి?**

**జవాబు:** దానికి అనేక నిర్వచనాలు ఉన్నాయి. అయితే నా స్వంత నిర్వచనం ఏమిటో దానిని చెబుతున్నాను. జీవనంలోని జీవనమే నిజమైన జీవితం.

**పశ్న 63: జీవితం యొక్క లక్ష్యం ఏమిటి? మనం ఎక్కడి నుండి వచ్చాము? మనం ఎక్కడికి పోతాము?**

**జవాబు:** మానవుడు ఆ మూలం (ఆదిశక్తి) నుంచి వచ్చాడు, మళ్ళీ అతడు చేరవలసింది అక్కడికే. అతని ఉనికి యొక్క ప్రయోజనం, వెనుదిరిగి అక్కడకు వెళ్ళడమే.

**పశ్న 64: మావవుని నైతికత (Moral of man) ఏమిటి?**

**జవాబు:** ఉన్నత లేక ఉత్కృష్ట విషయాల గురించి ఆలోచించటం (Think of higher things) మానవుని నైతికతగా ఉంటుంది. దానిని గురించి నీవు ఆలోచించినట్లయితే నీవు కూడా దానిని పొందగలవు, ప్రయత్నించి చూడు.

**పశ్న 65: ఇచ్ఛ (Will) మరియు కోరిక (Desire) వేరైనవా?**

**జవాబు:** కోరిక (Desire) అనేది దాని స్వస్థానంలో అది చెడ్డది, అదే కనుక సక్రమంగా రూపొందినట్లయితే, అది మంచిదవుతుంది. ఆ కోరికను మనం చెడుగా ప్రయోగిస్తున్నాం. (Desire) కోరిక యొక్క లక్ష్యాన్ని పొందటానికి ఆచరించే విధానం (Will) ఇచ్ఛ.

**ప్రశ్న 66: జ్ఞానం (Wisdom) అంటే ఏమిటి?**

**జవాబు:** దివ్యశక్తిని (Power of God) సక్రమంగా వినియోగించేది జ్ఞానం (Wisdom).

**ప్రశ్న 67: అంతటా అవినీతి నెలకొని ఉంది. మరి నేను ఈ ఆధ్యాత్మిక మార్గాన్ని ఆచరించటం ఎలా?**

**జవాబు:** నీవు స్వయంగా ఉత్కృష్ట లేక ఉన్నత విషయాలవైపు (higher things) ఆసక్తి కలిగి ఉన్నట్లయితే, ఈ నీచమైన విషయాలు (lower ones) వాటంతట అవే తొలగిపోతాయి. ఉన్నతమైన వాటిని పొందటానికి నీవు సంకల్పించినట్లయితే, ఈ అల్పవిషయాలు సమసిపోతాయి.

**ప్రశ్న 68: ఆధ్యాత్మిక క్షేత్రంలో 'మహాప్రళయం' గురించి మీరు ఏమి చెప్తారు?**

**జవాబు:** 'మహాప్రళయం' అనగా అహం యొక్క నశింపు మరియు అహంకార పూర్వక వృత్తుల హరింపు. ఇది నిర్మలీకరణం ద్వారాను, మన మాస్టర్ సహాయంతోను మాత్రమే సంభవమవుతుంది.

**ప్రశ్న 69: దయచేసి జీవుడు, బ్రహ్మం గురించి వివరించండి.**

**జవాబు:** పదార్థం అనగా శరీరంతో ప్రాణం కలిసి ఉన్నప్పుడు అది జీవుడు అనబడుతుంది. అదే (ప్రాణం) కనుక శూన్యంతో అనుసంధానమై ఉన్నప్పుడు అది బ్రహ్మం అనబడుతుంది. కనుక శూన్యస్థితిలో ఉన్న జీవుడు బ్రహ్మం అవుతాడు. భూమిమీద నిలిచి ఉన్న ప్రాణం జీవుడు అయి ఉండగా, అది అనగా ఆ ప్రాణం తన సాంద్రతను కోల్పోయినప్పుడు, అది శూన్యత మాదిరిగా తేలిక అయిపోయి బ్రహ్మం అవుతుంది. మనస్సును స్వాధీనంలో ఉంచుకోవటం అనేది కర్మ అనబడితే, స్వాధీన (నియంత్రణ) స్థితిలో ఉన్న మనస్సు ఉపాసన అవుతుంది. దాని ఎరుకయే జ్ఞానం అవుతుంది.

**ప్రశ్న 70: మీరు ఇంటికి దూరంగా (అనగా విదేశాలలో) ఉన్నప్పుడు, మీరు ఇంటిమీద దిగులుతో ఉన్నారా?**

**జవాబు:** నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లుగా ఉంటుంది.

**ప్రశ్న 71: దయచేసి క్రోధం (Anger), లోభం (Greed, తృష్ణ లేదా పేరాస)ల గురించి వివరించండి.**

**జవాబు:** (Anger) క్రోధం (కోపం) అనునది దైవానుగ్రహంగా ఉంటుంది, అందుచేత దానిని పూర్తిగా విస్మరించటం (లేదా తొలగించటం) సాధ్యపడదు. దానిని ఎవ్వరైనాగాని సక్రమంగా వినియోగించాలి. అయితే (Greed) లోభం అనేది మన స్వకల్పితం. దానిని పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది. ఎవ్వరైనా సరే, కనీసం ఆధ్యాత్మికత కొరకు కూడా పేరాశ కలిగి ఉండకూడదు.

**ప్రశ్న 72: హృదయం మీద ధ్యానం చేయటానికి, మరి దేనిమీదనైనా ధ్యానం చేయటానికిగల భేదం ఏమిటి?**

**జవాబు:** హృదయం మానవ శరీరానికి నాభి స్థానం (లేదా ముఖ్య కేంద్రం)గా ఉండి అది పనిచేస్తూ, రక్తాన్ని కూడా పంపుతూ ఉంటుంది. కనుక మనం ధ్యానంలో ఉన్నప్పుడుగాని, దైవం యొక్క ధ్యాసలో ఉన్నప్పుడుగాని, అది హృదయాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. రక్తం శరీరంలోకి ప్రవహిస్తున్నది అంటే, అది పవిత్రతను కూడా ఆపాదిస్తుంది. అందుచేత నా దృష్టిలో హృదయం మీద ధ్యానం, శరీరం యొక్క ఇతర అంగాలలో దేనిమీదైనా కంటె చాలా లాభదాయకమనిపిస్తుంది.

**ప్రశ్న 73: అసలైన మానవుడు (Real man) ఎవ్వరు?**

**జవాబు:** మానవుని నేత్రాలు అతడు ఆంతరికంగా దృష్టి సారించినప్పుడు మాత్రమే అతడు (Real man) అసలైన మానవుడిగా గుర్తించబడతాడు. అక్కడే ఆ సత్యత్వం (రియాలిటీ) కొరకు అన్వేషణ జరుగుతుంది. అప్పుడు అతడు ఆ మూలాధారంతో తన సంబంధం కల్పించుకుంటాడు.

**ప్రశ్న 74: మనం ఆధ్యాత్మికంగా పురోగమనం చెందుతున్నామని గ్రహించటం ఎలా?**

**జవాబు:** నిరంతరం మనస్సు మరియు ఆత్మ యొక్క తేలికదనం వృద్ధి చెందటమే, ఆధ్యాత్మిక ఉన్నతికి ఖచ్చితమైన పరీక్షగా ఉంటుంది.

**ప్రశ్న 75: ధ్యానంలో ఎటువంటి దృశ్యాలు, అనుభవాలు అనుభూతమవుతూ ఉంటాయి?**

**జవాబు:** నిజం చెప్పాలంటే, దృశ్యాలు అనేవి ఆధ్యాత్మిక ఉన్నతిలో ఎంత మాత్రం విలువలేనివిగానే ఉంటాయి. నిర్మలీకరణ ప్రక్రియలో బంధించబడి ఉన్న సంస్కారం పైకి తేలడానికి అవకాశం ఇవ్వబడినందున సాదృశ్యమయ్యే దృశ్యంతప్ప అంతకుమించి మరేమీ కాదు. అందుచేత ఈ పరోక్ష దర్శనాలుగా కనిపించేవి అన్నీ, మన ఆలోచనలు, క్రియల మూలంగా గతంలో ఏర్పడిన సంస్కారాల ఫలితంగానే. కనుక ఈ దృశ్యాలు, ఆధ్యాత్మిక జీవితంలో ఏమీ విలువలేనివి అని గ్రహించాలి.

**ప్రశ్న 76: బాబూజీ! ప్రాణాహుతి ప్రయోజకంగా మనమీద పని చేస్తున్నదని గ్రహించటం ఎలా?**

**జవాబు:** అది చాలా సులభం. ఆ ప్రాణాహుతి యొక్క నిజమైన ప్రభావం నీవు గమనించదలచినట్లయితే, నీవు నీలోని మార్పులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలి. జీవనశైలిలో సామాన్యత, వాగ్ధోరణిలో సమతుల్యత, ప్రవర్తనలో ప్రకృతిసిద్ధమైన సమైక్యత అనేవి సెయింట్ తత్వానికి చిహ్నాలుగా ఉంటాయి. అవి మనలో సాదృశ్యమైనపుడు మనలో ఆధ్యాత్మిక ప్రగతి ప్రారంభమైనట్లుగా భావించవచ్చు. ఎప్పుడైతే ఇవి నిర్మాణాత్మకమవుతాయో అప్పుడు (అహం యొక్క) వినాశనం కూడా పరస్పరం ఒక దానితోపాటు మరొకటి జరుగుతూ ఉంటాయి.

**ప్రశ్న 77: ఏ రకంగా ఆ అంతిమ స్థానాన్ని చేరాలి?**

**జవాబు:** "నేను ఆత్మ సమర్పణనుగాని, సహకారాన్నిగాని, ఆత్మ నివేదననుగాని, అలాగే సత్యత్వాన్ని (లేదా సత్పదార్థాన్ని) గాని లెక్కచేయను. విశ్వాసంతో, మాస్టర్‌లో ఉండటం మాత్రమే నేను చూదాలనుకుంటాను. ఆ విధంగా నీవు నీ మాస్టర్‌ను ప్రేమించిన కొంతకాలానికి, నీ మాస్టరే నీలో లయమవుతారు.

**ప్రశ్న 78: ఏ ఒక్కరైనా, మాస్టర్‌తో నిరంతరం ఉన్నాడని గ్రహించటం ఎలా?**

**బాబూజీ:** మాస్టర్ సూచించిన విధానానికి నీవు కట్టుబడి ఉండు. అప్పుడు ఒక శూన్యం ఏర్పడి, మాస్టర్ యొక్క ప్రాణాహుతిని నీవు ఎక్కడ ఉన్నా కూడా ఆ శూన్యం భర్తీ చేసుకుంటూ ఉంటుంది.

**ప్రశ్న 79: దైవం (దేవుడు) అంటే ఎవరు?**

**బాబూజీ:** అతడు ఎవరో నీకు తెలియనివాడు. నీవు 'వానిని' వర్ణించదలచినట్లయితే 'అతడు' దేవుడు కానేకాడు. అతడు ఎవరో అతడే. అతడు ఎలా ఉన్నాడో ఇకముందు కూడా అలాగే ఉంటాడు. అతడు ఎక్కడ ఉన్నాడో అక్కడే ఉన్నాడు. అతడు అక్కడ ఉన్నప్పటికీ అతడు తెలియకుండానే ఉన్నాడు. అతడు ముందుగానే గుర్తించబడడు. ఒకవేళ అతడు ముందుగానే గుర్తించబడినట్లయితే అతి సత్యవంతం కాదు.

**ప్రశ్న 80: ఏ ఒక్కరైనా తన మాస్టర్‌పట్ల ఎటువంటి విశ్వాసం కలిగి ఉండాలి?**

**బాబూజీ:** లాలాజీ మహరాజ్‌లో ఎటువంటి బలహీనత చూడలేకపోయినంతగా, హృదయపూర్వకంగా విశ్వాసపాత్రుడై ఉండాలి. (బాబూజీ మహరాజ్‌లాగా)

**ప్రశ్న 81: శ్రీ రామచంద్ర మిషన్ యొక్క సభ్యునికి కలిగే అనుగ్రహం ఏమిటి?**

**బాబూజీ:** శ్రీ రామచంద్ర మిషన్‌కు చెందిన ఏ ఒక్క సత్సంగీయుడు కూడా, తనకు కనీస అవసరాలైన ఆహారం, దుస్తులు, జీవితానికి అవసరమైన మరికొన్ని చిన్న అవసరాలు తీర్చబడకుండా ఉండరు.

రామచంద్రజీ మహరాజ్ తన ప్రార్థన ద్వారా శ్రీకృష్ణ భగవానుని నుంచి ఈ అనుగ్రహంతో ఆశీర్వదించబడ్డారు.

**ప్రశ్న 82: బాబూజీ! మా ఆధ్యాత్మిక పురోగమనంలో మాస్టర్ యొక్క భౌతిక ప్రత్యక్షత ముందుకు నడిపిస్తుంది. ఈ విషయంలో మేము అనుబంధాన్ని కల్పించుకోవచ్చునా?**

**బాబూజీ:** అలా కాదు. మనం అటువంటి అనుబంధాన్ని కల్పించుకొనకూడదు. మాస్టర్ యొక్క భౌతిక ప్రత్యక్షత మిమ్మల్ని ముందుకు తీసుకువెళ్తుంది అను అనుభవం లేదా భావం ఒక భ్రమ వంటిది. దీనిని బట్టి మనం ఇంకనూ భౌతిక విషయాలమీదనే ఆధారపడి ఉంటున్నామని సూచిస్తుంది. మాస్టర్ యొక్క భౌతిక ప్రత్యక్షత కూడా మనకు ఏ విధంగాను ఉపకరించదు. అయితే ఆధ్యాత్మికంగా మాత్రం మనం 'వారి' మీద ఆధారపడి ఉంటున్నాము. ఆ విధంగా మీరు ఆంతరికంగా వారిమీద ఆధారపడి ఉండటాన్ని కల్పించుకొనగలిగి నట్లయితే, అప్పుడు మీకింక మాస్టర్ యొక్క భౌతిక ప్రత్యక్షత అవసరం ఉండదు.

# సహజ సమాధి

# ఉపోద్ఘాతం

ఈ రోజు అనగా 26 సెప్టెంబర్, 1952న లఖీంపూర్‌లో శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపక దినోత్సవం జరుపబడింది. ఈ అల్పమైన సేవకురాలకి కూడా సేవాభాగ్యం లభించింది. పరదా వేసుకుని కూర్చుని ఉన్న నేను, చెప్పదలచుకున్న ఈ కథనం ద్వారా సేవ చెయ్యాలి, తద్వారా, అందరిలోనూ భగవత్ప్రేమ అధికమవుతుందని భావించి, ఇది వ్రాసాను.

మానవమాత్రులు తమ జీవన విధానంతో సంబంధం ఉంచుకోరు. ఎందుకంటే, వారు తమ జీవన విధానాన్ని వాస్తవంలో ఎలా ఉండాలో ఆ విధంగా అసలు మలచుకోనే లేదు కనుక. జీవించాలనే ఆలోచన ఉన్నప్పుడే జీవనం గురించి చింత ఉంటుంది. ఆ తర్వాత అతనికి ఏ స్థానం జీవించటానికి యోగ్యమో కూడా తెలిసి వస్తుంది. స్థానం వ్రాయవలసిన ఆవశ్యకతయే లేదు. ఎందుకంటే, మన సర్వస్వం (Belongings) అన్నిటితోసహా పరమాత్మలో ఏ విధంగా 'వారి'తో హత్తుకుని ఉండి, వారిలోనే ఐక్యమై, కలిసిపోవాలంటే, అలా కలిసిపోయాయి అనే చేతన (స్పృహ) కూడా లేనంతగా, లీనమై ఉండగలిగే స్థానం కేవలం పరమాత్మ యొక్క జాత్‌యే అని అందరికీ తెలిసినదే. పైగా అన్ని ధార్మిక గ్రంథాలు చెప్పేది కూడా ఇదే. కానీ ఇది ఎలా సంభవం? మనమైతే అనేక విషయాలతో ఏ విధంగా హత్తుకుని ఉన్నామంటే, వాటిని మనం పట్టుకుని, వదలటం అలా ఉంచి, అవే మనల్ని పట్టుకుని ఉన్నాయని ఎప్పుడూ అంటూ ఉంటాము. మనం మన మనస్సుకు ఏ విధమైన అలవాటు చేసామంటే, ఏ దశలోనైతే మనం ఉండకూడదో, ఆ దశయే మనకు ప్రియమైనదిగా అనిపిస్తోంది. మరి, అలా, ఏదైతే మనకు ప్రియమైనదిగా అనిపిస్తోందో, ఏదైతే మనకు ప్రేమపూర్వకమని అనిపిస్తోందో, దానిని వదలబుద్ధి కాదు కదా, పైగా మన బంధనాలు అన్నింటికి కారణమైన దీనినే మనం 'వాని' అంటే భగవంతుని ప్రేమగా భావిస్తున్నాం. ప్రేమ బంధనం అయితే దానిని ఏవైపు అయిన మళ్ళించినా అది బంధనానికి కారణం అవ్వవచ్చు అని తర్క వితర్కములు చేసేవారు, లేదా దార్శనికులు (ఫిలాసఫర్లు), పైన చెప్పబడిన దానిని ఖండించవచ్చు. ఈ విమర్శ, తర్కించబడే విషయపు సీమలలో ఉన్నంతవరకూ (పై పై తర్కం ప్రకారం) సరి అనిపించవచ్చు. కాని ఈ విషయం యొక్క వాస్తవికతలోకి దృష్టి పెట్టినప్పుడు పరిణామం ఏమవుతుందంటే, ఇది కేవలం వాస్తవికత ప్రాప్తించటానికి మాత్రమే, మిగతావన్నీ కర్తవ్యాలు (Duties) అని, వాటన్నిటినీ కేవలం ఆ విధంగా కర్తవ్యాలుగానే జరపాలని, తెలియ వస్తుంది. ఎప్పుడైతే మనం కర్తవ్యాన్ని కర్తవ్యంగా తెలుసుకుని, వాటిని నిర్వహిస్తామో, అందులో బంధనానికి (Attachment) –అంటే అది బంధనంగా మారటానికి ఆస్కారం ఉండదు. ఈ కారణంగానే మనచేత ఆచరించబడే విభిన్నమైన ప్రాపంచిక విషయాలలో మనం ఉన్నా, దానిని వాటిపై మన ప్రేమ అని అనలేము (మిగతా ప్రాపంచిక పనులలో ఉన్నా, వాటిమీద మనకు ఆసక్తి ఉండదు. వాటి ప్రభావం మనకు అంటదు అని భావం). ఈ ప్రసంగం ద్వారా, 'సహజ' శబ్దంతో మీరంతా పరిచితులు కావాలనే ఉద్దేశ్యంతో, సేవాభావంతో ఏదైతే వ్రాసానో, అది మీ ముందు ఉంచుతున్నాను. అదంతా నా అనుభవం. కాబట్టి ఇదే ఉత్సవంలో నా తరఫునుంచి చదవబడింది. సోదరీ సోదరులందరికి దీని ద్వారా తమ తమ పిల్లలలో

ఇటువంటి భావన ఉద్భవింపజేయాలని, వారంతా సత్ప్రవర్తనతో ఆధ్యాత్మిక లాభం పొందాలని నా ప్రార్థన. ఈ ప్రస్తావన క్లుప్తంగా రెండు మాటలలో చెప్పాలంటే, తనువుపై వ్యామోహం, మనస్సుపై ఆసక్తి, మూలం సహితంగా పోనంతవరకు భగవత్ దర్శనం (సహజ సమాధి) కలలో కూడా సాధ్యం కానేరదు.

– వినమ్రతతో

**కస్తూరీ బెహెన్**

# సహజ సమాధి

**అజ్ఞాన్ హృదయ గ్రంథేర్నిః శేష్ విలయస్తదా,**
**సమాధినా వికల్పేన యదాద్వైతాత్య దర్శనమ్.**

ఎప్పుడైతే నిర్వికల్పం లేదా సహజ సమాధి ద్వారా అద్వైత ఆత్మ స్వరూపం యొక్క సాక్షాత్కారం కలుగుతుందో అప్పుడు మాత్రమే అజ్ఞాన రూపమైన హృదయ గ్రంథి యొక్క సంపూర్ణ వినాశనం జరుగుతుంది.

ఆధ్యాత్మిక క్షేత్రంలో సమాధి అవస్థ విశేషం గురించి ఎంతో కాలంగా నొక్కి వక్కాణించబడుతూ ఉంది. ప్రాచీన కాలంలో మన పూర్వీకులైన ఋషులు, మహర్షులు, ఎంతో దీర్ఘమైన, అంటే వేలాది సంవత్సరాలు సమాధి ధారణ కావించేవారు. యోగి పుంగవుల విషయంలో సమాధి అవస్థ వారికి జీవనమే. ఎందుకంటే, భగవంతునిలో యోగం లేక కలయిక లేక సంబంధం కలిగి ఉండటమే కదా యోగం. పైగా, యోగం యొక్క దట్టమైన (సాంద్ర రూపపు) అవస్థయే సమాధి అవస్థ. కాని, భగవత్ప్రేమికులు లేదా భక్తుల సమాధి విషయం కాస్త వేరుగా ఉంటుంది. తన ఇష్టునిలో సమాధి అయిపోవటం లేదా శరణాగతి (Surrender)యే సమాధి. నిశ్చయాత్మకమైన లేదా వ్యావసాయాత్మికమైన (దృఢమైన సంకల్పంతో, అదే దృష్టిలో ఉన్న) బుద్ధియే ఈ సమాధికి బీజం (విత్తనం). తన ఇష్టుని (దైవాన్ని) తైలధార వంటి నిరంతర ప్రేమ ప్రవాహంతో ఆ బీజమును మొలకరింపజేయటం (అంకురింపజేయటం) ద్వారా మాత్రమే ఈ సమాధి రూపపు పరిణామం లభిస్తుంది. లేదా, వేరే ఏమని చెప్పవచ్చంటే, మనస్సు, మన ధ్యేయం (లక్ష్యం) పూర్తిగా ఏకీభవించినప్పుడు వచ్చే దశయే ఈ అవస్థ. మనస్సు చంచలత్వం పోగొట్టుకుని, ఒకటే పట్టుపట్టి, స్థిరంగా వశంలోకి వచ్చి, అభూత పూర్వ (కనీ వినీ ఎరుగునటువంటి) రసమును ఆస్వాదిస్తుంది. ఇది సమాధి అవస్థ. ఈ ఆధ్యాత్మిక దశను కబీర్ ఈ విధంగా వర్ణించారు:

**అవధూ మేరా మన్ మత్‌వారా**
**ఉన్మని చఢయా గగన రస్ పీవై, త్రిభువన్ భయా ఉజియారా**
**గుడ్ కరి జ్ఞాన్ ధ్యాన్ కరి మహువా, పీవై పీవన్ హారా.**

అనగా ఓ అవధూతా! నా మనస్సు ప్రభుభక్తి అను మత్తుతో వివశమైపోయింది. అది ఏమీ తెలియని స్థితితో మత్తెక్కిపోయి, ఆకాశమంత (అనంత) రసాస్వాదన చేస్తూన్నది. త్రిభువనములలోనూ శోభిల్లుతున్నది. జ్ఞానము అను (ఆత్మానందపు) పానకం ఎడతెరిపిలేకుండా గ్రోలుతూనే ఉన్నది. అనగా సృష్టి యొక్క సమస్త జ్ఞానం తనకు లభించిందని అర్థం.

శ్రీ శంకరాచార్యులవారు తమ వివేకచూడామణి గ్రంథంలో ఈ అవస్థను ఎంత రమణీయంగా వివరించారో చూడండి.

**క్రియాంతశ్ సక్తిమ్-పాస్య కటికొ ధ్యాయన్య థాలిం హయలి**
**భావ మృచ్ఛతి తథైవ యోగీ పరమాత్మ-తత్వ ధ్యాత్వా సమాయాతి తదేక తిష్టయా.**

అనగా ఏ విధంగానైతే సమస్త ఇతర కార్యములందు ఆసక్తిని విస్మరించి భ్రమరం యొక్క ధ్యానమునే మదిలో నింపుకుని, కీటకం భ్రమర రూపం దాలుస్తుందో, ఆ విధంగానే యోగి ఏకాగ్రతతో పరమాత్మ తత్వం యొక్క చింతన చేస్తూ చేస్తూ పరమాత్మ భావాన్నే ప్రాప్తింప జేసుకుంటాడు. ఇదే రాజయోగుల సమాధిగా ఉంది. అయితే హఠ యోగుల యొక్క సమాధిలో భేదం ఉంది. ఆత్మను శూన్యంలో అనగా సమాధి స్థితిలో నిలపటం, ఆ తర్వాత ఆ శూన్యతను ఆత్మలో నిలిపి యోగి నిశ్చింతుడు కావటమేనని హఠయోగ ప్రదీపికలో చెప్పబడింది. వారి దృష్టిలో అనగా ఆత్మ షట్చక్రాలను ఛేదించుకుని సహస్రారం లేదా శూన్య చక్రంలో స్థిరం కావటాన్ని సమాధి అనబడుతుంది. యోగి నిశ్చింతుడు కావటం అంటే దానితోనే అతడి సాధన పూర్తయినట్లుగా భావించటం. అతని యోగ సిద్ధి, గమ్యం అంతవరకేనన్న మాట, అనగా అతనికి కావలసింది ఏమి ఉంటుంది? అతడు సాధించదలచిన శాంతి ప్రాప్తించింది, అనగా సమాధి కొనసాగుతూ ఉంది. అభ్యాసీ సోదురులారా! అయితే నిజానికి దానివలన మనకు వాస్తవిక శాంతి యొక్క సరిహద్దు నుంచి గాలి కూడా సోకినట్లు కాదు. ఈ కారణంగానే రాజయోగం పొందటానికి హఠయోగం ఒక సోపానం (మెట్టు)గా చెప్పబడింది. స్వామి వివేకానందుడు కూడా హఠయోగం తర్వాత రాజయోగం యొక్క అవుసరం ఉంటుందని, ఆ శక్తి మాత్రమే అతడిని ధ్యేయానికి చేర్చగలదని చెప్పారు.

ఇప్పుడింక సహజ సమాధి స్థితి అంటే ఏమిటి? దానిని సాధించటం ఎలా? అనేది ప్రశ్నగా ఉంటుంది. సహజ వస్తువు అనగా దివ్య లక్ష్యం పొందటానికి సాధ్యమైనంతవరకు మనం సహజ సాధననే ఉపయోగించాల్సిన అవసరం ఉంది, అది తప్పనిసరి కూడా. ధ్యేయం వరకు చేర్చటంలో సహాయకారి అయిన సహజ మార్గం ద్వారానే సాధన కూడా అవుసరం. మరి సహజ-సాధన అంటే ఏమిటి? అది మన 'మాలిక్' అయిన ఈశ్వర ధ్యానమే. ధ్యానం కూడా సాధనయే అయినప్పుడు మరి సహజ విధానం ఎలా అవుతుందని మీరు అడగవచ్చు. దానికి సమాధానం చెప్పాలంటే -మీరు ఒక పళ్ళెం తీసుకుని దానిని ఎడతెగకుండా ఒక కర్రపుల్లతో కొడుతూ ఉంటే, ఎంతో విపరీతమైన ధ్వని కలుగుతుంది; అంతటా అశాంతి, కలవరం కలుగుతుంది. అటువంటప్పుడు, ఆ అశాంతి, కలవరం శాంతింప జేయటానికి మీరేమి ఆలోచన చేస్తారు? పళ్ళెం మీద కర్రపుల్లతో బాదటం ఆపటానికి ప్రయత్నిస్తారు. అప్పుడు మాత్రమే పళ్ళెమును బాదకముందు ఉన్న స్వాభావిక శాంతి మళ్ళీ నెలకొంటుంది. అనగా పళ్ళెం మీద కర్రపుల్ల తగలకుండా ఆపుతారు. ఇదే విధంగా, ప్రతి పనీ, ప్రతి విషయమూ జన్మజన్మాంతరాలుగా 'నేను, నాది' అను కర్రపుల్లతో బాదుతూ, మనం మన మనస్సు మీద అనేకానేక సంస్కారాలనే గాయాలను కలిగించాము కదా! వాటి నుంచి అనగా మనస్సుకు మళ్ళీ సహజ స్థితిని కల్పించటానికి మనం ధ్యానం లేదా నిరంతర స్మరణ (Constant Remembrance) యొక్క అభ్యాసం చేస్తున్నాము. ఇది సహజ మార్గం అవునో, కాదో

ఇప్పుడు మీరే చెప్పండి! ఇది ఎంత సరళం, సహజమైన మార్గమో కదా! ఇందులో కూడా, ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) శక్తి కలిగి ఉన్న గురువర్యులు దొరికితే సాధన మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంటుందని నేను ఈ విషయంలో చెప్పగలను. ఎప్పుడైతే ఈ మానసిక వ్యవస్థ ఏర్పడుతుందో అప్పుడు ఈ సహజ–ధ్యానం లేక సహజ–అభ్యాసం జరుగుతుంది. నాకు బాగా జ్ఞాపకం ఉన్న విషయం ఏమిటంటే, నేను శ్రీ బాబూజీని –"నేను అభ్యాసం మూలంగా చాలా తేలికదనం అనుభూతి చెందుతున్నాను, అలా ఎందుకు?" అని అడిగాను. దానికి సమాధానంగా 'వారు' దానిని అభ్యాసం యొక్క పరిణామంగా చెప్పారు. ఎప్పుడైతే ఈశ్వరుని కృపవలన ఆధ్యాత్మిక దశ వృద్ధి చెందుతుందో, అప్పుడు అభ్యాసం లేదా ధ్యానం సూక్ష్మత్వం చెందుతుంది. అయితే ఇది కూడా కర్మ క్రిందికి వస్తుంది. అందుచేత ఈ దశలో ఎటువంటి అభ్యాసం దీనితో సంబంధం కలిగి ఉంటుందో, అది తెలియక పోయిన్పటికీ, స్వయంగా జరిగిపోతూ ఉంటుంది. అంటే అప్పుడు అది సహజ అభ్యాసం అవుతుంది (కర్మల ప్రభావం సాధకునిపై ఉండదని భావం).

నాకు తెలిసినంతలో, సహజ–సమాధి అవస్థ అనేది జీవన–మోక్ష దశ, అది తురీయావస్థ తర్వాత వస్తుంది. ఈ దశ ఎటువంటిది అంటే, ఋతువులు మారినాగాని, యుగాలు మార్పు చెందినాగాని, ఎవ్వని మనస్సుకైతే ఈ సమాధి–అవస్థ ప్రాప్తమవుతుందో, అలాంటి మనస్సుకు చాంచల్యమంటూ ఉండదు. ఇటువంటి సాధకునికి రేయింబవళ్ళు ఉండవు; చలి, వేడిమితో అతనికి సంబంధం ఉండదు. అంతేగాకుండా సమాధి–అవస్థలో అతని 'మాలిక్' (దైవం) మీద ఏకీకృతమైన దృష్టి చలించకుండా స్థిరంగా ఉండిపోతుంది. చివరకు ఆ దృష్టి కూడా క్రమ క్రమంగా అతని ప్రియతముడు అనగా దైవంలోనే లయమైపోతుంది. అతని చలించని దృఢమైన ఏకాగ్రత మాత్రం కేవలం సమాధి స్థితి మనస్సు కోసమే ఉంటుంది. ఎందుకంటే, ఆ సమాధిలో 'నా' అను తత్వం యొక్క అవశేషం ఉంది. దానిలో మనకు సమాధి యొక్క ధ్యాస ఉంది. అయినప్పటికి మనకు ఈ ఆలోచనా భారం అనగా ఇది నా సమాధి–అవస్థ అను భావం నుంచి కూడా దైవం మనకు విముక్తి కల్పించాడు. అనగా దీని స్వారస్యం లేదా రుచి ఎలా ఉంటుంది అను స్పృహ లేదా జ్ఞానం మనకు లేకుండా ఉంటుంది. కనుక ఈ సమాధి అవస్థ అనే దానికి ఎంత సౌలభ్యం, ఎంత సహజత్వం చేకూరాయో మీరే చెప్పండి! సహజ సమాధి అవస్థ అంటే ఇదియే. నేను ఒకసారి బాబూజీతో "ఇప్పుడు ఈ దశ ఎంత తేలికగా ఉంది అంటే, అది 'తేలిక' అను పదం నుంచి కూడా అతిదూరంగా ఉన్నట్లుగాను అనిపిస్తోంది. ఎందుకంటే, నేను 'తేలిక' అని చెప్పే సందర్భంలో ఆ శబ్దం యొక్క భారం కాని, దాని అర్థం గాని నాకు తెలియకుండాపోయాయి" అని నేను చెప్పినట్లుగా నాకు జ్ఞాపకం ఉంది. దానికి సమాధానంగా "బిటియా! మనస్సుకు సహజ–సమాధి అవస్థ చేకూరింది. అయినా కూడా డిల్లీ అంటే ధ్యేయం ఇంకా చాలా దూరంలో ఉంది" అని 'వారు' చెప్పటం జరిగింది. కబీర్‌దాస్ ఒక పదంలో ఈ దశను ఎంతో సుందరంగా ఇలా అభివర్ణించారు:

**సాధో సహజ–సమాధి భలీ,**

**గురు–ప్రతాప్ జా దిన్‌తె ఉపజీ, దిన్ దిన్ అధిక్ బలీ.**

(అనగా "సహజ-సమాధి చాలా మంచిది. గురు ప్రతాపం మూలంగా మొలకవేసిన రోజు నుంచి అది రోజు రోజుకు వృద్ధి చెందింది" అని భావం)

పైన నేను వ్రాసిన దానినిబట్టి ఏమి అనిపిస్తుంది అంటే, మనస్సు యొక్క అచంచలమైన ఏకాగ్రత బంధం తెంచుకుని సమాన స్థాయిలో ప్రవహించసాగుతుంది అని. ఈ కారణంగా తన ఉన్నతి యొక్క దశ ఈ విధంగా ఉంటుంది:

**జహ్ జహ్ డోలోం సోయి పరికర్మా, జోకుచ్ కరౌం సౌ సేవా।**
**జబ్ సోవోం తబ్ కరౌం దండవత్, పూజౌ ఔర్ న దేవా॥**
**ఆంఖ్ న మూందోం, కాన్ న రూంధోం, తనిక్ కష్ట్ నహి ధారోం।**
**ఖులె నైన్ పహిచానోం హంసి హంసి, సుందర్ రూప్ నిహారోం॥**
**సబద్ నిరంతర్ సె మన్‌లాగా, మలిన్ వాసనా త్యాగే।**
**ఉఠత్, బైఠత్ కబహుం న ఛూటై, ఐసీ తారీ లగీ॥**
**కహ్ కబీర్ యహ్ ఉన్మని రహనీ, సో పర్‌గట్ కర్ భాయీ।**
**దుఃఖ్ సుఖ్ సే కోయీ పరే పరమ్‌పద్, తేహి పద్ రహా సమాయీ॥**


అనగా ఎక్కడెక్కడ తిరుగుతామో అదే పరిక్రమ (ప్రదక్షిణ), ఏమి చేసినా అదే వారి సేవ; నిద్రించినప్పుడు అది సాష్టాంగ ప్రణామమే. నేను వేరే ఏ దైవమునూ కొలువనవసరమే లేదు; ఇప్పుడు 'వారి' మందహాసపూరిత సుందర రూపాన్ని తెరిచిన కళ్ళతోనే చూస్తున్నాను; నిరంతరం ఓంకార శబ్దాన్నే మనస్సులో నిలుపుకుని, మలినమైన వాంఛలన్నింటినీ త్యాగంచేసి, కూర్చుండి ఉన్నా, లేచి నిలబడి ఉన్నా కూడా ఆ దర్శనాన్ని వీడకుండా సాగిపోతున్నాను. కష్టసుఖాలను లక్ష్యపెట్టకుండా, వాని పాదాలనే ఆశ్రయించుకుని, ఈ కబీర్ పరమానందమయ స్థితిలో మునిగి ఉన్నాడు, అని అర్థం.

నా దృష్టిలో సహజ శబ్దం లేదా సహజ వస్తువులో ఆకర్షణ శక్తి అధికంగా ఉంటుంది. శ్రీ కృష్ణ భగవానుడిది సహజ సుందర రూపం. ఈ ప్రకారంగానే సూరదాసు పదాలలో గోపాలుని సహజ రూప వర్ణన చెప్పబడింది. శ్రీకృష్ణ భగవానునిలో ఆకర్షణ శక్తి అధికంగా పెరిగి ఉంది. ఆయనకు ఎంత అపరిచితులైనా, ఎంతగా ఆయనని గుర్తించలేకపోయేవారైనా సరే, అలాంటి వాళ్ళంతా కూడా వారి (శ్రీకృష్ణుని) వైపు ఆకర్షితులైపోయేవారు. మనస్సు యొక్క ప్రభావం ఏమిటంటే, అది పరిశుద్ధమైనప్పుడు సహజ వస్తువువైపు శీఘ్రంగా ఆకర్షితమైపోతుంది. అయితే ఎప్పుడు సహజ దశతో మానవుడు ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఎదుగుతాడో అప్పుడు సహజత్వం సూక్ష్మమవుతుంది. దానివలన ఆకర్షణశక్తి ఇంకా ఎక్కువ అయిపోయినప్పటికీ, సూక్ష్మత్వం చెందిన కారణంగా అది మనకు తక్కువగా అనుభవానికి వస్తుంది. అలా ఎందుకంటే, మన దృష్టి స్థూలత్వానికి అలవాటుపడి ఉండటమే దానికి కారణం. కనుక మనం సహజ రూపాన్ని విస్మరించాం. మనం ధ్యానం లేదా అభ్యాసం ఎందుకు చేస్తున్నాము? మన సహజ రూపం లేదా సహజ స్థితిని ప్రాప్తింపచేసుకోవటానికే కదా! అయితే మన సహజరూపం ఏది? అది మనం వచ్చినప్పుడు ఎలా ఉన్నామో అలా కావటమే, ఇది మాత్రమే. మరి మన సహజ స్థితి ఏమిటి? మనం ఎక్కడ నుండి

వచ్చామో అక్కడనే మన స్థావరం లేదా అదే మన పూర్ణస్థితి అవటం, ఇది మాత్రమే. "నా ఉన్నతి 'మాలిక్' దయతో బాగానే కొనసాగుతున్నట్లుగా అనిపిస్తోంది, అయినప్పటికీ హృదయం ఈ దశలతో సంతృప్తి చెందటంలేదు" అని ఒకసారి నేను శ్రీ బాబూజీని అడిగినట్లుగా నాకు జ్ఞాపకం ఉంది. అప్పుడు దానికి 'వారు' ఎంత సరళమైన, సహజమైన సమాధానం ఇచ్చారో చూడండి– "హృదయం దిగులు చెందటమంటే, దానికి స్వగృహం యొక్క జ్ఞాపకం రావటమే, అందుకు సంకేతమవుతుంది. ఇక్కడ గృహం అంటే నా ఉద్దేశ్యంలో మనం ఉండే ఇల్లు కాదు, అది మనం ఎక్కడ నుండి వచ్చామో అది (అనగా దివ్యస్థానం)" అని అన్నారు.

అభ్యాసులారా, నేను ఏమి వ్రాసానో అది దైవానికే తెలియాలి. 'అతని' దయతో అనుభూతికి వచ్చిన దానిని వ్రాశాను. మన ధ్యేయం వాస్తవంలో ఏ అవస్థ (దశ) యొక్క విశేషణమూ కాకూడదు. మన ధ్యేయం కేవలం మన ఇష్టదైవాన్ని పొందటంగానే (ఈశ్వర ప్రాప్తిగానే) ఉండాలి. ఆ మార్గంలో పయనిస్తూపోతే 'అతని'కి ఏది ఇష్టమైతే దానినే అనుగ్రహిస్తాడు, మన దృష్టి మాత్రం పవిత్రతవైపే ఉండాలి. మన దృష్టి కలిగే సిద్ధులమీద కాకుండా, ధ్యేయం మీదనే ఉండాలి. అప్పుడు ఏ దూరమూ, ఏ కష్టమూ ఉండదు. అంతా చక్కగా నడుస్తుంది. ఈ విధంగానే మనం కొనసాగుతూపోతే మన పురోగమనంలో ఏ దశ ప్రాప్తమవుతుందో అదియే సహజ దశ అవుతుంది. ఎందుకంటే, ఆ విధంగా కలిగిన దశ మన అభ్యాసం అను ప్రయత్నంతో కాకుండా 'మాలిక్' (దైవం) అనుగ్రహంతో కలిగినదే. మనం ఆ దశలను దైవకృపగానే భావించి, వాటి మీద కూడా దృష్టి నిలపకుండా మన ధ్యేయాన్ని నిలుపుకోవాలి. అప్పుడు ఏమి జరుగుతుంది? సమస్త ఇంద్రియాలు నియంత్రించబడతాయి. మనస్సు పరిపూర్ణానందం పొందుతుంది. దానిలోనే అన్నీ సమకూరి ఈశ్వరప్రాప్తి కలుగుతుంది. ఈ జీవన కర్మలమయమైన దేహం, సహజ సమాధిమయమైనదిగా తయారవుతుంది. దుఃఖమయమైన ప్రాంగణంలో సుఖమునిచ్చే ప్రశాంత నిలయం ఏర్పడుతుంది. శత్రువులు మిత్రులవుతారు. ప్రతి వస్తువు లేదా విషయంలోను స్వాభావికత వస్తుంది. తనది, ఇతరులది అనేది తొలగిపోయి సమస్థితి వస్తుంది. ఇటువంటి దశలో, సాధకునివలన ఇతరులు ఎవరైనా ఇబ్బందిపడటంగాని, ఇతరులతో సాధకుడు ఇబ్బందిపడటంగాని జరగదు.

ooOoo


ముక్తి సాధనలో ముందుకు సాగిపోవాలంటే
సహజమార్గం అందుకు సాటిలేనిది.
ఈ మార్గంలో బాబూజీ ముందుగానే ముళ్ళను
ఏరివేసి బాటను మృదువుగా చేసారు.
సహజమార్గం మనం ఎంపిక చేసుకున్న
మనోహరమైన పుష్పం వంటిది. పూవు నుంచి
సువాసన ఎలా వెదజల్ల బడుతుందో సహజమార్గం
నుంచి దివ్యశక్తి అలా ప్రవహిస్తూ ఉంటుంది.
సహజమార్గంలో ముళ్ళు తొలగించబడిన మనోహరమైన
గులాబీ పుష్పాలు మాత్రమే ఉన్నాయి. అభ్యాసి దీనిని
స్వీకరించటంలో ఏ ఇబ్బందీ కలగదు. ఈ విధానం
అన్ని మంచి వాటితోనే నిండి ఉంది. బాబూజీ ఆశీస్సులతో
మీరు అంతిమానికి చేరవచ్చు. అభ్యాసికి సాధనా
మార్గంలో ఎదురయ్యే ఆటంకాలన్నీ తొలగించబడతాయి.